అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 03-04-2025 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 92 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50


సెవ్వణక్కం.. వీర వణక్కం

నినాదాలతో హోరెత్తిన మదురై...

- ఒకవైపు సాంస్కృతిక కార్యక్రమాలు.. మరోవైపు ఎర్రదండు కవాతు
- ఆహ్లాదాన్ని నింపిన షేక్ మస్తాన్ బృందం నాదస్వరం
- అబ్బురపరిచిన పాప్పంపాడి పెరియ మేళమ్
- అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన బిమన్ బసు
- స్ఫూర్తిదాయక వాతావరణంలో సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభలు ప్రారంభం

వివరాలు 14లో





నవ భారతం నిర్మిద్దాం

తమిళనాడు సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన మధురై, భారతదేశ రాజకీయ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచే ఘట్టానికి వేదికైంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు, కార్మిక వర్గ నేతలు, శ్రామిక దళాలు ఎంతో ఆశతో ఎదురుచూసిన సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభలు మహోత్సాహంగా ప్రారంభమయ్యాయి. నగరంలో ఎటుచూసినా ఎర్ర జెండాలు రెపరెపలాడుతూ, కార్మిక శక్తి, రైతాంగ ఉద్యమాలకు నూతనోత్తేజం అందిస్తున్నాయి. సీపీఐ(ఎం) ఈ మహాసభల ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, ఫాసిస్ట్ శక్తులకు దీటుగా నిలిచే కార్యాచరణ రూపొందించడం, యువతను ఉద్యమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి లక్ష్యాలను స్పష్టం చేసింది. భారత రాజకీయం మళ్లీ ఒక నూతన దిశలోకి మళ్ళనున్నదా? అన్న ప్రశ్నకు ఈ మహాసభలు సమాధానం చెప్పబోతున్నాయి!

జనతా ప్రజాస్వామ్యం, సోషలిజమే లక్ష్యం

లౌకిక, ప్రజాతంత్ర, ప్రగతిశీల మార్గాలే ప్రాతిపదిక

దేశానికి రక్ష వామపక్షమే

సీపీఐ(ఎం) 24వ మహాసభ ప్రారంభోపన్యాసంలో ప్రకాశ్ కరత్

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి నవతెలంగాణ ప్రతినిధి

'మధురై నగరం నుంచి ఈ పిలుపును మరింత బిగ్గరగా, మరింత స్పష్టంగా వినిపించనీయండి. చీకటి శక్తుల దుష్ట చర్యలను తిప్పి కొట్టడానికి అన్ని వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఐక్యం కావాలి. లౌకిక, ప్రజాతంత్ర, ప్రగతిశీల మార్గాల ప్రాతిపదికగా, ప్రజల ప్రజా స్వామ్యం, సోషలిజం లక్ష్యాల సాధన కోసం మనమందరం కలిసి పనిచేద్దాం..' అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ అన్నారు. సీపీఐ(ఎం) అఖిల భారత 24వ మహాసభ తమిళనాడులోని సీతారాం ఏచూరి నగర్ (మదురై)లో బుధవారం ప్రారంభమైంది. కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్ ఆడిటోరియంలో జరిగిన ఈ ప్రారంభసభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రారంభో పన్యాసం చేసిన ప్రకాశ్‌కరత్ పలు జాతీయ, అంతర్జాతీయ అంశాలను ప్రస్తావించారు. అన్ని లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో చేతులు కలిపి పనిచేయడానికి సీపీఐ(ఎం) తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్టు ప్రకటించారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల మధ్య నెలకొనే ఇటువంటి విస్తృత ఐక్యతే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు వ్యతిరేకంగా విజయవంతమైన పోరాటాలకు దోహదం చేస్తుందని చెప్పారు. 'ఈ దిశలో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ నిర్మాణం కోసం అన్ని వామపక్ష శక్తులతో కలిసి పని చేయడానికి సీపీఐ(ఎం) సిద్ధంగా ఉంది.' అని కరత్ అన్నారు. వామపక్ష ఐక్యతను బలోపేతం చేయడానికి, వామపక్ష రాజకీయ జోక్యాన్ని విస్తృతం చేయడానికి ఇది సరైన సమయ మని ఆయన చెప్పారు. 'నయా ఉదారా వాద, పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరే కంగా, శ్రామిక ప్రజల ప్రయోజనాలను వామపక్షాలు మాత్రమే ధృడంగా కాపాడ తాయి.' అని అన్నారు. దేశానికి ప్రమాదకరంగా మారిన హిందుత్వ నూతన ఫాసిజా ...3లో

సైద్ధాంతిక యోధుడు..

సెక్యులర్ పార్టీల మధ్య విశాల ఐక్యతకు తోడ్పడ్డారు
సీతారాం ఏచూరికి సీపీఐ (ఎం)
అఖిల భారత మహాసభ ఘన నివాళి 14లో..



రాజకీయ ప్రత్యామ్నాయ ఏర్పాటు

అధ్యక్షునిగా ట్రంప్ ఎన్నికైన తరువాత అమెరికా సామ్రాజ్యవాదంలో కొత్త శకం ప్రారంభమైందని ప్రకాశ్‌కరత్ చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సామ్రాజ్యవాద దోపిడీ సాగుతోందని, ఈ క్రమంలో మిత్ర దేశాలను కూడా ట్రంప్ వదలడం లేదని చెప్పారు. పాలస్తీనియన్ల నుంచి గాజాను స్వాధీనం చేసుకునేందుకు నెతన్యాహు ప్రణాళికలకు ట్రంప్ ఆమోద ముద్ర వేశారని అన్నారు. ట్రంప్ విధానాల ప్రభావం దేశంపై తీవ్రంగా ఉంటుందని, టారీఫ్‌లను తగ్గించడం ద్వారా మోడీ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని చెప్పారు. దేశ ప్రయోజనాలకు భిన్నమైన ఈ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు, సీపీఐ(ఎం) ముందు వరుసన నిల్చుని పోరాటం చేయాల్సి ఉందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి, ట్రంప్ అనుసరిస్తున్న నూతన ఆర్థిక, వ్యాపార యుద్ధాలకు, రాజకీయ, మిలటరీ జోక్యాలకు, మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. ఇజ్రాయిల్ దాడులను 17 నెలలుగా ఎదుర్కొంటూ పోరాటం కొనసాగిస్తున్న పాలస్తీనా ప్రజలకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఇజ్రాయిల్‌ను గుడ్డిగా సమర్థిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా ఖండించారు. అమెరికా సామ్రాజ్యవాదపు ఆంక్షలను ఎదుర్కొని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న క్యూబా ప్రజలకు, ప్రభుత్వానికి ఆయన సంఘీభావం తెలిపారు.



వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం

అనుకూలం..282..వ్యతిరేకం 232

- లోక్‌సభలో 12 గంటలపాటు సాగిన చర్చ
- ఓటింగ్‌కు ప్రధాని మోడీ డుమ్మా
- నేడు రాజ్యసభ ముందుకు బిల్లు
- రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి : ప్రతిపక్ష పార్టీల ఎంపీలు
- దీన్ని ఇండియా బ్లాక్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది

3లో..

బీసీ రిజర్వేషన్లు ఆమోదించకపోతే

కేంద్రంపై ధర్మయుద్ధం

పరేడ్ గ్రౌండ్స్‌లో 10 లక్షల మందితో ధర్నా

- తెలంగాణలో బీసీల రిజర్వేషన్లకు అనుమతివ్వాలని కోరుతున్నాం : "బీసీల పోరు గర్జన" ధర్నాలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం అనుమతించకపోతే బలహీన వర్గాలు మోడీ సర్కార్‌పై ధర్మ యుద్ధం ప్రకటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతి ఇస్తే 10 లక్షల మందితో సభ పెట్టి ప్రధాని హోదాలో మోడీని సన్మానిస్తామన్నారు. ఇకపై విజ్ఞప్తులు తీసుకొని హస్తినకు రామని, బీజేపీ నేతలు ఎలా గల్లీలోకి వస్తారో చూస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లకు కేంద్రం అనుమతించాలని బుధవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో 12 బీసీ సంఘాలు 'బీసీల పోరు గర్జన' ఆందోళన చేపట్టాయి. ఈ ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కుల గణన చేపట్టామని, బీసీలకు రిజర్వేషన్ల పెంపు తీర్మానం చేశామని అన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలన్నా.. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కొనసాగాలన్నా జన గణనలో కుల గణన జరగాలన్నారు. ఇంకెంతో కాలం ప్రధాని మోడీ బీసీ ముసుగులో ప్రభుత్వాన్ని ఏలలేరని, బీసీ రిజర్వేషన్ల డిమాండ్లకు ...13లో

హెచ్‌సీయూలో ఆగని నిర్బంధం

విద్యార్థుల ర్యాలీపై లాఠీలతో విరుచుకుపడిన పోలీసులు



నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400ఎకరాల్లో ఉన్న ఆకుపచ్చని అడవులను తొలగించవద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీలు విరుచుకు పడ్డాయి. తమ వర్సిటీకి చెందిన భూముల జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తూ, అక్కడే తలదాచు కుంటున్న వన్య ప్రాణుల ఆవాసాలను బుల్డోజర్లతో కబళించి వేయొద్దంటూ వేడుకుంటున్న అమాయక విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు చేపట్టిన పనులను వెంటనే నిలిపివేయడంతో పాటు, నిరసన తెలిపిన విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించు కోవాలంటూ హెచ్‌సీయూ టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ ఆడిటోరియం నుంచి ఈస్ట్ క్యాంపస్ మీదుగా వర్సిటీ ప్రధాన ద్వారం వరకు, అక్కడి నుంచి అడ్మినిస్ట్రేషన్ భవనం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఓ వైపు విద్యార్థులు శాంతియుతంగా ర్యాలీ కొనసాగిస్తుండగా, అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులు విద్యార్థులపై లాఠీచార్జికి దిగారు. ర్యాలీగా వెళ్లిన ప్రొఫెసర్లు.. రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.

హెచ్‌సీయూలో నిర్బంధకాండ.. లాఠీచార్జిలు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకై విద్యార్థులు చేపట్టిన శాంతియుత ఆందోళనపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. ఈస్ట్ క్యాంపస్ వైపు కన్నెత్తి చూడకుండా భారీ ఎత్తున బందోబస్తును ...13లో

బాధ్యులపై చర్యలు తీసుకోండి
రాష్ట్ర అటవీ శాఖకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ లేఖ

400 ఎకరాల భూమిలో పనులు ఆపండి
నేడూ కొనసాగనున్న విచారణ

కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్ట్


13లో..

సొంతిల్లు కల కల్లే

దేశంలోని ప్రధాన నగరాలలో ఇంటి అద్దెలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు అవి ఏ మాత్రం అందుబాటులో ఉండడం లేదు. ఉదాహరణకు నాలుగు సంవత్సరాల క్రితం గురుగ్రామ్‌లో మూడు పడక గదుల ఇంటి అద్దె యాభై వేల రూపాయలు ఉంటే ఇప్పుడది ఏకంగా ఎనభై ఐదు వేలకు చేరుకుంది. అంటే ఏడాదికి 14 శాతం పెరుగుతోందన్న మాట. ఆ నగరంలోని విలాసవంతమైన ప్రాంతాలలో అయితే ఇంటి అద్దెలు మరింత దడ పుట్టిస్తున్నాయి. గోల్ఫ్ కోర్స్ రోడ్డులో ఇంటి అద్దె నెలకు ఎంతో తెలుసా? 2021లో లక్షన్నర రూపాయలు ఉన్న అద్దె ఇప్పుడు మూడు లక్షలకు పెరిగిపోయింది. అంటే ఏడాదికి సగటున 19 శాతం పెరుగుదల. ఇది ఒక్క గురుగ్రామ్ కథే కాదు. ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, కొల్‌కతా, అహ్మదాబాద్, పూనే... ఇలా ఏ నగరంలో చూసినా ఇంటి అద్దెలు గగన కుసుమాలే. చిన్న చిన్న నగరాలలో సైతం ఇంటి అద్దెలు భయపెడుతున్నాయి.

చాలీచాలని ఆదాయంతో అగచాట్లు

పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ : 2021 ఏప్రిల్... రెండో దశ కోవిడ్ ఉగ్రరూపం దాల్చిన సమయం. కాబట్టి ఆ సమయంలో అద్దెలు పెద్దగా లేవు. కోవిడ్ మహమ్మారి విజృంభించినప్పుడు కార్పొరేట్ ఉద్యోగులు చాలా మంది తమ తమ స్వస్థలాలకు పోయి ఇంటి నుంచే పని చేశారు. దీంతో నగరాలలోని ఇండ్లన్నీ ఖాళీ అయ్యాయి. కోవిడ్ ప్రభావం తగ్గి వారంతా తిరిగి నగరాల బాట పట్టడంతో ఇంటి యజమానులు అద్దెలు భారీగా పెంచేశారు. అయితే కోవిడ్ తర్వాత ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయన్న కారణంతోనే ఇంటి అద్దెలు పెరిగాయనడం సరికాదు.

పెరిగిపోతున్న స్థిరాస్థి ధరలు

కోవిడ్ తర్వాత బడా నగరాలలో స్థిరాస్థి ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. ఇంటి అద్దెలు పెరగడానికి ఇది ప్రధాన కారణమైంది. 2021-2024 మధ్యకాలంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఇంటి సగటు ధర చదరపు అడుగుకు రూ.5,826 నుంచి రూ.8,590కి పెరిగిందని అనరాక్ అనే ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ తెలిపింది. అన్ని కేటగిరీల ఇండ్ల ధరలు నాలుగు సంవత్సరాలలో 48 శాతం పెరిగాయని చెప్పింది. పైగా నిర్మాణ సంస్థలు ప్రజలకు అందుబాటు ధరలో ఇండ్లను నిర్మించడానికి ఆసక్తి చూపడం లేదు. 2021లో ప్రతి నాలుగు ఇండ్లలో ఒక ఇల్లు నలభై లక్షల రూపాయల కంటే తక్కువకే లభించేది. కానీ 2024 వచ్చే సరికి అది ఆరు ఇండ్లకు ఒక ఇల్లుగా మారిపోయింది. మరోవైపు చూస్తే 2021లో కొత్తగా నిర్మించిన 33 ఇండ్లలో కేవలం ఒక ఇంటి ధర మాత్రమే రెండున్నర కోట్ల రూపాయలకు పైబడి ఉండేది. మరి ...13లో

అద్దె ఇల్లూ భారమే

సమస్యల సుడిగుండంలో మధ్య తరగతి వేతన జీవులు

ఏం జరుగుతుంది?

అద్దెల పెరుగుదల అనే అంటువ్యాధి అన్ని తరగతులపైనా ప్రభావం చూపుతుంది. రియల్ ఎస్టేట్ కూడా దీనికి మినహాయింపు ఏమీ కాదు. ఇప్పటికే ఆ రంగంపై ప్రభావం పడుతోంది. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో గత సంవత్సరం ఇండ్ల విక్రయాలు 2023తో పోలిస్తే నాలుగు శాతం మేర పడిపోయాయి. కొత్త వెంచర్ల నిర్మాణాలు కూడా ఏడు శాతం తగ్గాయి. ఈ పరిణామాల కారణంగా ఇంటి అద్దెలు తగ్గుతాయా? గత అనుభవాలను బట్టి చూస్తే ఇండ్ల ధరలు తగ్గడానికి చాలా కాలమే పడుతుంది. యజమానులు తాము కొనుగోలు చేసిన ఇండ్లను ధరలు పెరుగుతాయన్న ఉద్దేశంతో అలాగే ఉంచుకుంటారు. అమ్మకానికి ఇష్టపడరు. అదే జరిగితే చాలా మంది యజమానులు తమ ఇండ్లను అద్దెకు ఇవ్వడానికే మొగ్గు చూపుతారు. దీనివల్ల పెద్ద నగరాలలో ఇంటి అద్దెలు స్వల్పంగా తగ్గవచ్చు. అయితే ఒకసారి ఇంటి అద్దెలు పెరగడమంటూ జరిగితే అవి గణనీయంగా ఏమీ తగ్గవు. కాకపోతే పెరుగుదల ఆగిపోతుంది. అంతే.



భూములమ్ముకుని పాలించడం

అభ్యంతరకరం

400 ఎకరాల భూములను హెచ్‌సీయూకే ఇవ్వాలి

- సీపీఐ(ఎం) నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం.. : సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి
- అరెస్టులు, కేసులపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు
- ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ-ముషీరాబాద్/విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూములను అమ్మటం ద్వారా ఆర్థిక వ్యవస్థను నడపాలని భావించడం తీవ్ర అభ్యంతరకరమని, అటువంటి ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించు కోవాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలంటూ మంగళవారం యూనివర్సిటీ వద్ద ఆందోళన చేసిన సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడంపై బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. నాయకులపై అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద నిరసన ...13లో

వర్సిటీ గెస్ట్ లెక్చరర్ల వేతనం రూ.50 వేలకు పెంచండి

ఖాళీ పోస్టులను ప్రాధాన్యతా క్రమంలో భర్తీ చేయండి : సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయ అనుబంధ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ, పార్ట్‌టైంగా పని చేస్తున్న వారికి నెలకు రూ.50 వేల వేతనం పెంచుతామన్న హామీని అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను ప్రాధాన్యతా క్రమంలో భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా, గెస్ట్ ఫ్యాకల్టీగా, పార్ట్ టైమ్‌గా చేస్తున్నవారు సుమారు 1,240 మంది ఉన్నారని తెలిపారు. వారు 20 ఏండ్లకు పైగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారికి సాధారణ సెలవులతోపాటు, కనీస వేతనం ఇవ్వడం లేదని తెలిపారు. పని గంటలు పెరిగినా పనికి తగ్గట్టుగా వేతనం పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు రూ.28 వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వారు పొందుతున్న తక్కువ వేతనంతో కుటుంబాలను పోషించుకోలేక, ఇంటి అద్దె కట్టలేక, పిల్లలను చదివించుకోలేని పరిస్థితిల్లో ఉన్నారని తెలిపారు. నెలకు రూ.50 వేల వేతనం పెంచుతామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏడాది దాటినా హామీ అమలు జరగలేదని పేర్కొన్నారు. మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని వారికి ఇచ్చిన హామీ ప్రకారం నెలకు కనీసం రూ.50 వేల వేతనం పెంచాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో దాదాపు 1,940 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికీ ఈ పోస్టులను భర్తీ చేయడం లేదని తెలిపారు. తగిన విద్యార్హతలు కూడా వారికి ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని భర్తీ చేసివుంటే 20 ఏండ్ల క్రితమే వారు రెగ్యులర్ ఉద్యోగులయ్యేవారని తెలిపారు. ఈ పోస్టులను ప్రాధాన్యతా క్రమంలో భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

రియల్ ఎస్టేట్ కోసమే హెచ్‌సీయూ భూముల విధ్వంసం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రియల్ ఎస్టేట్ కోసమే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విధ్వంసం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీఆర్ఎస్‌వీ, హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సీఎం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. భూములను కాపాడుతామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారనీ ఈ సందర్భంగా శ్రవణ్ తెలిపారు. సుప్రీంకోర్టులో హెచ్‌సీయూ భూముల కేసు గెలవగానే. వాటిని తాకట్టుపెట్టి రూ.20వేల కోట్ల అప్పు తెచ్చారని ఆరోపించారు. ఒక జింకను చంపితే ఐదేండ్ల శిక్ష సల్మాన్ ఖాన్‌కు పడిందని గుర్తు చేశారు. వందల నెమళ్లు.. జింకలను చంపుతున్న రేవంత్‌రెడ్డికి ఎన్నేండ్ల శిక్ష పడాలని ప్రశ్నించారు. యూనివర్సిటీ విధ్వంసంపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు.

అటవీ చట్టాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోండి

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లోని 400 ఎకరాల భూమిలో అటవీ చట్టాలను ఉల్లంఘించి చెట్లను నరకడంతో పాటు వన్యప్రాణులకు హాని తలపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తెలంగాణ అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ మెరూను హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) అటవీ సంరక్షణ చట్టం 1980, వన్యప్రాణుల రక్షణ చట్టం 1972 ఉల్లంఘించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిరుమళ్ల రాకేష్, కురువ విజయ్ కుమార్, కిషోర్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్లకు ఆర్టీసీ ఎండీ అభినందనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీజీపీఎస్సీ గ్రూప్-1 పోస్టులకు నిర్వహించిన రాత పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు పొంది కొలువులు సాధించిన ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలను టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. శుక్రవారంనాడిక్కడి బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ పాల్గొన్నారు. గ్రూప్-1 ఫలితాల్లో నారాయణపేట డిపోనకు చెందిన కండక్టర్ ఎరుకలి శ్రీనివాస్ కుమార్తె వీణ 118 వ ర్యాంకు, టీఐ-2 గా పనిచేస్తున్న వాహిద్ కుమార్తె ఫాహిమినా ఫైజ్ 126 ర్యాంకు, వనపర్తి డిపోలో పనిచేస్తోన్న టీఐ-2 ఎస్.బాల్‌రెడ్డి, కండక్టర్ బీ పుష్పలతల కుమారుడు రాఘవేందర్‌రెడ్డి 143 ర్యాంకును సాధించారు. వీరందరినీ సజ్జనార్ శాలువాలు కప్పి, జ్ఞాపికలు బహూకరించి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ కొలువుగా భావించే గ్రూప్-1లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు రాణించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా రవాణా వ్యవస్థకు వారి తల్లిదండ్రుల చేస్తోన్న సేవ, కష్టించే తత్వాన్ని ఆదర్శంగా తీసుకుని, నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో సీపీఎం ఉషాదేవి, డిప్యూటీ సీపీఎం శిరీష, నారాయణపేట డీఎం లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి

విద్యార్థులపై కేసులను ఉపసంహరించుకోవాలి

ఓయూలో అప్రజాస్వామిక సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి

వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

నేడు చలో సెక్రటేరియట్‌కు పిలుపు

నవతెలంగాణ - ముషీరాబాద్

హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ వర్గాలకు ప్రభుత్వం ధారాదత్తం చేసే అనాలోచితమైన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అదేవిధంగా ఓయూలో ప్రజాస్వామిక సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చలో సెక్రటేరియట్‌కు పిలుపునిస్తున్నట్టు ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ (విజృంభణ), ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో బుధవారం 'చలో సెక్రటేరియట్' పోస్టర్‌ను హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి, మాట్లాడుతూ.. హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిసున్నట్టు తెలిపారు. అదేవిధంగా మంత్రులు ప్రెస్‌మీట్ పెట్టి సమస్యను తప్పుదోవ పట్టించేలాగా మాట్లాడటం బాధ్యతారహిత్యమన్నారు. రాత్రికి రాత్రి బుల్‌డోజర్లు పెట్టి భూమిని చదును చేస్తున్నారని, నిరసన తెలియజేసిన విద్యార్థులను పోలీస్‌లు హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మాయిలను రాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచి ఇంకోసారి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనబోమని రాసివ్వాలని పోలీసులు ఒత్తిడి తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. ప్రజాస్వామ్యానికి అంబాసిడర్‌గా చెప్పుకునే సీఎం రేవంతర్‌రెడ్డి ఈ నిర్బంధాన్ని ఏమంటారో చెప్పాలని ప్రశ్నించారు. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొదట హైకోర్టు పేరుతో అగ్రికల్చర్ యూనివర్సిటీ భూమి 100 ఎకరాలను లాక్కుందన్నారు. ఇప్పుడు హెచ్‌సీయూ భూముల మీద కన్ను పడిందన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ భూములు అమ్మొద్దని, ప్రకృతిని కాపాడాలని గొప్పగా మాట్లాడి నేడు అధికారంలోకి రాగానే మరోలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చైతన్య మాట్లాడుతూ.. ఓయూలో అప్రజాస్వామిక సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని కోరుతూ కొద్ది రోజులుగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేసినా ప్రభుత్వ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, అశోక్‌రెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శులు అనిల్, విజయ్, ఏఐడీఎస్ఓ రాష్ట్ర నాయకులు నితీష్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు మహేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నవీన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు సాయి కిరణ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రాకేష్, నాయకులు పవన్, విజృంభన నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడం గర్వకారణం

ప్రొఫెసర్ కంచ ఐలయ్య

ఐలమ్మ ఫొటో ఆవిష్కరణ



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వీరనారి చిట్యాల ఐలమ్మ పేరు మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టడంతో తెలంగాణ రాష్ట్రం పునీతమైందని, ఇది శుభపరిణామమని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. రెవల్యూషనరీ ఉమెన్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఆర్‌బ్ల్యూహెచ్‌ఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలోని దర్బార్ హాల్‌లో వీరనారి చిట్యాల ఐలమ్మ జీవిత చరిత్రను ఆంగ్ల పద్య రూపంలో చిత్రీకరించిన ఫొటోను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మహిళల పేర్లతో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు చాలా తక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టడం శుభపరిణామమని అన్నారు. అయితే, మహిళా విద్యాభివృద్ధికి, సాధికారతకు దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా సేవలందించిన సావిత్రీబాయి పూలే పేరు ఏ విద్యాసంస్థకూ లేకపోవడం బాధాకరమన్నారు. దేశం కోసం పని చేసిన వీర వనితల పేర్లను కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థినులు కళాశాల కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో 50 శాతం మహిళా సభ్యులున్నప్పుడే మహిళ సాధికారత సాధ్యమన్నారు. యూనివర్సిటీ వీసీ సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయమని, యూనివర్సిటీకి తొలి వీసీగా తాను ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళా విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం రూ.540 కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఐలమ్మ జీవిత చరిత్రను పాట రూపంలో పాడి అలరించారు. ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ ముని మనవరాలు శ్వేత ఐలమ్మ, డాక్టర్ సంధ్యా విప్లవ్, వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణిమ దుర్గా, డాక్టర్ పి.హరికాంత్, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, ఐలమ్మ కుటుంబ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కేర్ యూనిట్ విస్తరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తార్నాక ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌ను విస్తరించినట్టు ఆ సంస్థ తెలిపింది. ఆ యూనిట్‌లోని బెడ్‌ల సంఖ్యను 4 నుంచి 12కు పెంచామనీ, దీనికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆర్థికసాయం చేసింది. ఈ యూనిట్ విస్తరణకు సీఎస్ఆర్ కింద నిధులు కేటాయించాలని ఆర్టీసీ అధికారులు పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ అయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) అంగీకరించి, రూ.కోటి సాయం చేసేందుకు ముందుకువచ్చింది. నిర్మాన్ డాట్ ఓఆర్‌జీ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ యూనిట్‌ను ఐఓసీఎల్ విస్తరించనుంది. దీంతో పాటు ఆర్టీసీ ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణను ఇచ్చేందుకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు సహకరిస్తుంది. ఈ మేరకు ఓ ఒప్పందాన్ని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సమక్షంలో ఐఓసీఎల్, నిర్మాణ్ డాట్ ఓఆర్‌జీ ప్రతినిధులు కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ ప్రతినిధులు ఎస్‌సీ మెస్‌రాం, పి.కైలాష్ కాంత్, వీవీఎస్ చక్రవర్తి, నిర్మాన్ డాట్ ఓఆర్‌జీ సీఓఓ పుల్లా అనురాధ, తార్నాక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు మద్దతివ్వకుండా

బీజేపీ, బీఆర్ఎస్ డ్రామాలు : చనగాని దయాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ బిల్లుకు మద్దతివ్వకుండా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు డ్రామాలాడుతున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లుపై చర్చ రాకుండా చేయాలనే కుట్రతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం వద్దకు కేటీఆర్ వెళ్లిన తర్వాతే, జింకలు, నెమళ్ల ఫొటోలను గ్రాఫింగ్ చేసి వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం అంగుళం కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. 2003లోనే భూబదలాయింపు జరిగిందనీ, అత్యున్నత న్యాయ స్థానాలు ఇచ్చిన తీర్పుపై రాద్ధాంతం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను కేటీఆర్ రెచ్చగొడుతుంటే, బీజేపీ అంతర్గతంగా సహకరిస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో పర్యావరణాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయబద్ధంగా ముందుకెళ్తుంటే బీఆర్ఎస్ అభివద్ధిని అడ్డుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి యువత అండగా నిలబడాలని కోరారు.

ప్రకృతి పునర్నిర్మాణానికి వందల ఏండ్లు పడుతుంది

హెచ్‌సీయూలో ప్రకృతిని విధ్వంసం చేయొద్దు : ప్రొఫెసర్ జి.హరగోపాల్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఒకసారి ప్రకృతిని ధ్వంసం చేస్తే దాని పునర్నిర్మాణానికి వందల ఏండ్లు పడుతుందని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలి భూముల సమస్యపై పౌర సమాజ మేధావులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో ప్రకృతి విధ్వంసాన్ని వెంటనే నిలిపేయాలని, అడవిని నాశనం చేయొద్దని కోరారు. అడవి ఎంతో సుసంపన్నమైన ప్రకృతి అని, చూస్తే కానీ అర్థం కాదన్నారు. ఇందులో ఎన్నో రకాల అరుదైన జాతుల పక్షులు ఉన్నాయన్నారు. హెచ్‌సీయూ భూములు ప్రభుత్వానివేనని కోర్టు తీర్పు వచ్చినప్పటికీ నైతికంగా ఆ భూమి హెచ్‌సీయూదేనన్నారు. కంచ గచ్చిబౌలి అడవిని నాశనం చేయడంపై తీవ్ర ఆందోళన చెందుతున్న అనేక మంది పౌర సమాజ సంస్థలు, మేధావులతో కలిసి మంగళవారం సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమావేశమై వివరించామన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని, అడవిని నాశనం చేయడాన్ని ఆపాలని కోరినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. దేశంలో ఏడు వందల విశ్వవిద్యాలయాలు ఉన్నప్పటికీ హెచ్‌సీయూని మాత్రమే భారత రాజ్యాంగంలో ప్రస్తావించారన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీకి 5 వేల ఎకరాలు, స్టాన్ ఫర్డ్ యూనివర్సిటీకి 8 వేల ఎకరాలు, ఓయూకు 2,600 ఎకరాలు ఉన్నాయన్నారు. 800 ఎకరాలు సరిపోదని ఇందిరాగాంధీ చెప్పడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూకు 2,300 ఎకరాలు కేటాయించిందని గుర్తు చేశారు. అప్పటి వీసీ ముందు చూపుతో 2,300 ఎకరాలకు ప్రహరీ నిర్మించారని వివరించారు. 2,300 ఎకరాలను యూనివర్సిటీకి రిజిస్ట్రేషన్ చేసి ఉంటే ఈ ప్రకృతి విధ్వంసం జరిగి ఉండేది కాదన్నారు. ఇదే చివరి తరం కాదని, ప్రభుత్వానికి దూరదృష్టి, భవిష్యత్ తరాల పట్ల బాధ్యత ఉండాలని సూచించారు. హెచ్‌సీయూకు ఈ భూమితో పని లేదని, అడవిని ధ్వంసం చేయకుండా ప్రభుత్వమే ఫారెస్ట్ ఏరియాగా డెవలప్ చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటు వ్యక్తులకు అమ్మకూడదన్నారు. ఇప్పటికే 100 ఎకరాల భూమిని విధ్వంసం చేశారని, ఇంకా 300 ఎకరాల భూమిని వెంటనే కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు ప్రతిపక్షాల మాయలో పడి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రభుత్వం అనుకుంటున్నదని, కానీ అక్కడ ప్రకృతి విధ్వంసం పట్ల విద్యార్థులు నిరసన చేపడుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు కూడా విద్యార్థులను రెచ్చగొట్టొద్దన్నారు. ప్రభుత్వం విద్యార్థులతో చర్చలు జరపాలని కోరారు. ఈ సమావేశంలో విస్సా కిరణ్ కుమార్, ప్రొఫెసర్ నరసింహారెడ్డి, అరుణ్, జాన్ మైకల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) 25 శాతం రిబేట్, ఫీజు చెల్లింపు గడువును ఏప్రిల్ 30వతేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎమ్ దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గడువు మార్చి 31వ తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ స్కీం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆశించిన మేర నిధులు సమకూరలేదు. దీనితో ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించారు. తాజాగా ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక సంఘాలతో డీటీసీపీ లే అవుట్లకు కూడా 25 శాతం రిబేటు వర్తింస్తుందని పేర్కొన్నారు.

ఏప్రిల్ మహనీయుల మాసం

11 నుంచి 14 వరకు ఫూలే, అంబేద్కర్ జనజాతర

కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటం

హెచ్‌సీయూ భూముల వేలంపాటను ఆపాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏప్రిల్ ఐదున బాబు జగ్జీవన్‌రామ్, తొమ్మిదిన రాంజీగోండు, 11న మహాత్మా జ్యోతిబాపూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జన్మించారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు అన్నారు. ఈనెలలో వారి జయంతి కార్యక్రమాలున్నందున ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం టీపీఎస్‌కే హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు గడిచినా రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏండ్లు అవుతున్నా ఇప్పటికీ కులవివక్ష, అంటరానితనం కొనసాగు తున్నదని చెప్పారు. కులవివక్ష 128 రూపాల్లో ఉందన్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ గుడిలోకి దళితులకు ప్రవేశం లేదని అన్నారు. నగరాలు, పట్టణాల్లో ఇంటి అద్దె రూపంలో వివక్ష కొనసాగుతున్నదని వివరించారు. శాఖాహారులకు మాత్రమే, ఓసీలకు మాత్రమే అంటూ టులెట్ బోర్డులుంటాయని చెప్పారు. దళితులకు ఇంటి అద్దె ఇవ్వని వారిపై అట్రాసిటీ కేసులను నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో దళితులకు క్షవరం చేయడం లేదన్నారు. దసరా పండగరోజు జమ్మి ఆకు తెంపనివ్వడం లేదని చెప్పారు. గ్రామాల్లో జరిగే బొడ్రాయి పండగకు దళితులతో నీళ్ల పోయనివ్వడం లేదని అన్నారు. గ్రామాల్లో బోనం తొలుత దళితులు ఎత్తకుండా అగ్రకులాల వారు అడ్డుకుంటున్నారని చెప్పారు. ఆర్టికల్ 14, 15 ప్రకారం కుల వివక్ష, అంటరానితనం నేరమని అన్నారు. రాజ్యాంగం ప్రకారం మనుషులంతా సమానమేనని వివరించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులు అమలు కావడం లేదని విమర్శించారు. కుల వివక్ష ఎక్కడుంటే కేవీపీఎస్ అక్కడ ఉంటుందన్నారు. ఈనెల ఒకటి నుంచి పది వరకు గ్రామగ్రామాన కుల వివక్షపై అధ్యయనం చేయాలని వివరించారు. ఈనెల 11 నుంచి 14 వరకు పూలే-అంబేద్కర్ జనజాతరలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 15 నుంచి 30 వరకు వివక్షకు వ్యతిరేకంగా ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలను చేపడతామని హెచ్చరించారు. కులం క్యాన్సర్, ఎయిడ్స్ కంటే ప్రమాదకరమైందన్నారు. పాస్టర పగడాల ప్రవీణ్‌ది హత్య, ఆత్మహత్య అనేది తెలియడం లేదని చెప్పారు. అందుకే ఈ సంఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని కోరారు. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమిని అమ్మేందుకు ప్రభుత్వం తలపెట్టిన వేలం పాటను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారడం సరైంది కాదన్నారు. కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు ఆ భూమిని అమ్మడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు, రాజకీయ పార్టీల నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కృపాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వమే కులవివక్షను పాటిస్తున్నదని అన్నారు. మున్సిపాల్టీలు, గ్రామపంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల్లో ఎక్కువ మంది దళితులేనని వివరించారు. అన్ని కులాల వారుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు మతగ్రంథంపై ప్రమాణం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం దశరథ్, కార్యదర్శి బి సుబ్బారావు, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గుంటి లక్ష్మణ్, నాయకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




పాలకుండలో విషపు చుక్కలు

2014లో మోడీ నాయకత్వాన కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినది మొదలు ప్రజలు జరుపుకునే పండుగల ధోరణి సైతం మారిపోయింది. ఈ పదేండ్ల మోడీ పాలనలో ఇది స్పష్టంగా కనపడుతున్నది. పండుగలంటే కేవలం భక్తి ప్రదర్శన మాత్రమే కాదు. పండుగలని అన్ని మతాలవారు పరస్పర సహకారానికి, సౌభాతత్వానికి ప్రతీకగా చూశారు. చూడటమే కాదు, ఆ పద్ధతిని అనుసరించారు. మతాచారాలను పరస్పరం గౌరవించు కోవటం, పండుగ రోజున ఇరుగు పొరుగు వారితో పిండి వంటలు పంచుకోవటం చాలా సాధారణ విషయంగా జరిగిపోయేది.

పండుగ సందర్భాలలో రాష్ట్రపతి మొదలు, ప్రధాని, రాష్ట్ర గవర్నర్లు, ముఖ్యమంత్రులు, అన్ని పార్టీలు ప్రజలకు సుఖశాంతులు, సంపదలు కలగాలని శుభాకాంక్షలు చెపుతాయి. పండుగంటే చెడుపై మంచి విజయం సాధించిన రోజని ఆ ప్రకటనలలో ప్రజలకు గుర్తు చేస్తాయి. కానీ, ఈ శుభాకాంక్షల అర్థం తెలిసే వారు మనస్ఫూర్తిగా చెపుతున్నారా అనే సందేహం ఈ పదేండ్ల మోడీపాలన చూసిన తరువాత కలుగుతుంది. గతంలో లేని చోటకూడ ఇప్పుడు శోభా యాత్రలు మొదలయ్యాయి. శోభా యాత్రలో చేతిలో కర్రలు, మసీదులు కనపడకుండా తెరలు వేయటాలు (ఇది ప్రజా రక్షకులు పోలీసులే స్వయంగా చేస్తారు లేండి), అయినా ఆ మసీదుల ముందు, ముస్లిం బస్తీల ముందు రెచ్చగొట్టే నినాదాలు, విన్యాసాలు జరుగుతూనే ఉంటాయి. చివరికి రాళ్ల రువ్వటం, వాహనాలు తగులబెట్టటం, మసీదు మినార్లపైకి ఎక్కి కేకలు, ఈలలు వేయటం పరిపాటిగా మారింది. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని, ముఖ్యమంత్రులు ప్రజలను ఈ అల్లర్ల నుంచి కాపాడటానికి ఎటువంటి చర్యలు తీసుకున్నట్టు కనపడదు. పైగా ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే నిర్విఘ్నంగా జరిగిపోతుండటం మరో విషాదం. హిందూ పండుగైనా, ముస్లిం పండుగైనా మైనార్టీలే టార్గెట్. వారి పట్ల ద్వేషాన్ని వెళ్ళగక్కటం, హింసాత్మక దాడులకు దిగటం ఒక కార్యక్రమమైంది. పండుగ ముసుగులో జరిగే ఈ దాడులకు అధికార పీఠంపై కూర్చున్న మతతత్వ పార్టీ అండదండలు ఉన్నాయని ఇప్పుడు అందరికీ అర్థమైంది.





మొదటిసారిగా వాజ్‌పేయి నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు ఇటువంటి ధోరణి లేదు. ఆనాడు లేదంటే కారణం ప్రధానిగా వున్న వాజ్‌పేయి మెతకదనమో, లేక అతని పాలనాదక్షత అనో ముచ్చట పడాల్సిన అవసరం లేదు. వాజ్‌పేయి పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా వున్న రోజులలోనే అద్వానీ రథయాత్ర జరిగింది, ఆ యాత్ర దారి పొడుగునా విద్వేష ప్రసంగాల హోరు సాగింది. ఆఫీసుల్లో, బస్టాండ్‌లల్లో ఒక చోట ఏమిటి- పది మంది కూడిన చోట ఉద్రేకపూరిత వాదోపవాదాలు జరిగాయి. వాజ్‌పేయి మసీదు కూల్చివేతపై మొసలి కన్నీళ్లు కార్చారు. ఆ మొసలి కన్నీళ్లనే వ్యూహం అన్నారు వారి పార్టీ వారే. అంతేకాదు, 2002లో గుజరాత్‌లో జరిగిన ముస్లిం సామూహిక హననం వాజ్‌పేయి ప్రధానిగా అధికారం చెలాయిస్తున్న రోజులలోనే జరిగింది. అయినా వాజ్‌పేయి దానిని ఆపటానికి చేసింది ఏమీ లేదు, మరోసారి వ్యూహాత్మకంగా కన్నీళ్లు పెట్టుకోవటం తప్ప.

అయినప్పటికీ, ఆ రోజులలో పండుగలు ఇంత ఉద్రిక్త వాతావరణంలో జరగలేదు. మతోన్మాదపు ఛాయలు కనపడుతున్నా, ఇంత విద్వేషాన్ని వాజ్‌పేయి ప్రభుత్వం రెచ్చగొట్టలేకపోయింది. ఒక ప్రధాన కారణం బీజేపీకి అప్పట్లో స్వంతంగా మెజార్టీ లేదు. దానికి మద్దతుగా వున్న బీజేపీ మిత్రపక్షాలకు మతోన్మాదాన్ని అడ్డుకునే సైద్ధాంతిక శక్తి, నైతిక బలం వున్నాయి. ఇప్పుడు బీజేపీని బలపరుస్తున్న పార్టీలకు ఆనాటి సైద్ధాంతిక శక్తి లేదు. రెండుసార్లు మోడీ నాయకత్వాన పూర్తి మెజారిటీతో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల మతోన్మాదపు అసలు రూపం చూసిన తరువాత పూర్తిగా లొంగి పోయారు. తమ మీద మోడీ ప్రభుత్వం ఆధారపడిందని భావించటానికి బదులు, తామే మోడీ దయా దాక్షిణ్యాలపై ఆధారపడినట్టు వారు తలుస్తున్నారు. ఒకవేళ మోడీని తొలగించాలని ఆర్‌ఎస్‌ఎస్ అనుకున్నా, మోడీనే ప్రధానిగా ఉండాలని ఈ లొంగిపోయిన తెలుగుదేశం, జేడీ(యూ) పట్టుబట్టినా ఆశ్చర్యం కలగదు.

బీజేపీ ముస్లిం వ్యతిరేకత కేంద్రంలో అధికారం సంపాదించటానికే గనుక, ఆ అధికారం దక్కింది గనుక, ఇక మతోన్మాదపు దాడులకు దిగదులే అని కొంతమంది భావించారు. అటువంటి భ్రమలకు ఆస్కారం లేదు అని బీజేపీ చెపుతున్నది. ముస్లిం, క్రిస్టియన్లపై దాడులను రెండింతలు, మూడింతలు చేసింది.

ఇంకొక రెండు రోజులలో శ్రీరామ నవమి రానున్నది. ఈ రంజాన్ పండుగ సందర్భంలో కూడా అనేక ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష పార్టీలు ప్రభుత్వానికి శాంతి భద్రతల రక్షణపై హెచ్చరికగా చెప్పాయి. అయినా ఎన్డీఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఆ సందర్భంలో అల్లర్లు జరగకుండా అడ్డుకునేది ఎవరు? ప్రజలు, వారి సహాయంతో ప్రజాస్వామ్య లౌకిక, వామపక్ష పార్టీలు మాత్రమే.

పండుగ పేరు మీద మతతత్వ వాదులు గతంలో లాగే అల్లర్లను లేవదీయటానికి చూస్తే, అడ్డుకునే ఉద్దేశంతో సీపీఐ(ఎం) పార్టీ కార్యకర్తలు ఈ వారం రోజులు రోడ్డు మీదే ఉంటారని ఆ పార్టీ బెంగాల్ కార్యదర్శి మహమ్మద్ సలీం మంగళవారం ఓ పత్రికా సమావేశంలో చెప్పారు. బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఉన్న రోజుల్లో ఒక్క మతఘర్షణ జరగలేదు అనే విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

ఏమైనా, మళ్ళీ త్వరలోనే

" హిందూ, ముస్లిం, సిక్కు, ఇసాయి...
సబ్ కో భాయి, భాయి " అనే నినాదాలతో మన రహదారులు తిరిగి మార్మోగుతాయని ఆశిద్దాం.

- కర్లపాలెం

నవ భారతం నిర్మిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

(హిందూత్వ నియో- ఫాసిజం) న్ని ఎదుర్కొనే సైద్ధాంతిక శక్తి ఒక్క వామపక్షాలకు మాత్రమే ఉందని కరత్ చెప్పారు. వామపక్ష శక్తులు మాత్రమే మన దేశంలోని సామ్రాజ్యవాదుల దోపిడీకి, కుట్రలకు వ్యతిరేకంగా పోరాటానికి నాయకత్వం వహించగలవని అన్నారు.



మోడీ మూడో విడత పాలనపై....

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడో విడత పదవీ కాలాన్ని ప్రస్తావించిన ఆయన ' మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ నిర్దేశించే హిందుత్వ ఎజెండాతో, మరింత దూకుడుగా నూతన ఉదార విధానాలను అమలు చేస్తోంది. నియంతృత్వాన్ని బలోపేతం చేసేలా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో అది నూతన ఫాసిస్టు లక్షణాల (నియో- ఫాసిస్ట్ కారక్టరిస్టిక్స్)ను ప్రదర్శిస్తోంది.' అని కరత్ వివరించారు. 'ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు ఎజెండాను అమలు చేస్తూ ముస్లిం మైనార్టీలను ఏకైక లక్ష్యంగా చేసుకుంటోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాష్ట్ర యంత్రాంగం సహాయంతో హిందుత్వ శక్తులు ముస్లింలను లక్ష్యంగా చేసుకుని మత హింసకు దిగుతున్నారని చెప్పారు.' ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా నిత్యం హింస, బెదిరింపులు కొనసాగుతున్నాయి. ఇది శాశ్వత మత విభజనను నెలకొల్పి 'పాన్ -హిందుత్వ'గా సమీకరించే యత్నం' అని చెప్పారు. మోడీ ప్రభుత్వం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి చిరునామాగా మారిందని అన్నారు. కొత్త రంగాలను ప్రయివేటీకరిస్తూ గరిష్టంగా లాభాలను పోగేసుకునేందుకు బడా కార్పొరేట్లకు కొత్త మార్గాలను చూపుతోందని అన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా అంతరాలు పెరుగుతున్నాయని, దేశం మొత్తం సంపదలో 40శాతం జనాభాలో ఒక్కశాతంగా ఉన్న ధనికుల వద్ద కేంద్రీకృతం అవుతున్నదని చెప్పారు. యువతలో నిరుద్యోగం భారీగా పెరుగుతోందని, దీనిని అవకాశంగా తీసుకుని కార్మికులను పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ సంక్షోభం కారణంగా రైతులు, వ్యవసాయ కార్మికుల పరిస్థితులు కూడా దారుణంగా దిగజారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రానున్న కాలంలో కార్మికులు, రైతులు పెద్దఎత్తున పోరాటాలు చేపట్టే అవకాశం ఉందని, వాటికి రాజకీయ నిర్దేశం చేయాల్సి వుందని అన్నారు. కార్మిక హక్కుల్ని హరించే నాలుగు కోడ్‌లను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమౌతోందని, దీనికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు మే20వ తేదీన ఒక్కరోజు సమ్మెకు పిలుపునిచ్చాయని, దీనిని విజయవంతం చేయడానికి వామపక్షపార్టీలు, వర్గ, ప్రజా సంఘాలు కృషి చేయాల్సి ఉందన్నారు. లోక్‌సభలో బీజేపీకి మెజార్టీ రాకపోయినప్పటికీ, ఉభయసభల్లోనూ ఎన్డీఏ కూటమికి రెండింట మూడువంతుల మెజార్టీ లేకపోయినప్పటికీ నిరంకుశ పోకడలను కొనసాగిస్తున్నాయని చెప్పారు. లోక్‌సభతో పాటు అసెంబ్లీలకు కూడా ఒకేసారి ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదన ప్రజాస్వామ్యంపై నేరుగా దాడిచేయడమేనని అన్నారు. న్యాయవ్యవస్థను బలహీనపరచడంతో పాటు, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కూడా మోడీ ప్రభుత్వం రద్దు చేస్తోందని, రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా ఫెడరల్ స్ఫూర్తిపై దాడి చేస్తోందని చెప్పారు.

రాజకీయ వ్యూహాత్మక పంథాపై

'డోనాల్డ్ ట్రంప్‌నకు స్నేహితునిగా ఎవరు చెప్పుకున్నారు? ..గౌతం అదానీ, ముఖేశ్ అంబానీలకు సన్నిహిత స్నేహితుడు ఎవరు? ఆర్‌ఎస్‌ఎస్‌కు సంపూర్ణ విధేయత చూపేది ఎవరు?' అన్న ఈ మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం వస్తుందని, అదే మోడీ అని చెప్పారు. దక్షిణ దేశాల పట్ల అమెరికా క్రూరంగా అమలు చేస్తున్న చర్యలకు మోడీ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మద్దతు ఇస్తూ విధేయతను చాటుకుంటున్నారని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదంతో అత్యంత సన్నిహితంగా వ్యవహరించే హిందూత్వ, కార్పొరేట్ ప్రభుత్వంగా మోడీ సర్కారు ఉందని, దీనిని ఓడించి తీరాలని అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను ఒంటరిపాటు చేయడం ద్వారా మితవాద ధోరణులను తిప్పికొట్టాల్సి ఉందని చెప్పారు. అయితే, హిందూత్వ శక్తులు కేవలం ఎన్నికల రాజకీయాల ద్వారానే దేశంలో అధికారంలోకి రాలేదని, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విషబీజాలు చల్లడం ద్వారా వారు అధికారంలోకి వచ్చారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలను నిర్వహించాల్సి ఉందన్నారు.



స్వతంత్ర బలంపై దృష్టి

పార్టీ మహాసభలో సీపీఐ(ఎం) స్వతంత్ర బలం పెంచుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణను లక్ష్యంగా చేసుకుని దేశ వ్యాప్తంగా స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించే అంశాన్ని చర్చిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష విధానాలను ప్రతిఘటించడంలోనూ, ప్రజానుకూల విధానాలను అమలు చేయడంలోనూ కేరళ వామపక్ష, ప్రజాతంత్ర ప్రభుత్వం ముందువరుసలో ఉందని అన్నారు. తమిళనాడులో జరిగిన ప్రజాపోరాటాలను, ఇక్కడి అమరుల త్యాగాల ను కరత్ ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. వారి బాటలో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.



బీజేపీ మునిగిపోతున్న నౌక

సీపీఐ (ఎం) మహాసభలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.బాలకృష్ణన్

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

బీజేపీ అనేది మునిగిపోతున్న నౌక అని సీపీఐ (ఎం) తమిళనాడు మాజీ కార్యదర్శి, పార్టీ 24వ మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. బుధవారం ప్రారంభమైన మహాసభలో ఆయన స్వాగతోపన్యాసం చేస్తూ...బీజేపీతో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ కూడా మునిగిపోవటం ఖాయమని ఎద్దేవా చేశారు. మదురై నగరం తిరుగుబాటుదారుల పుట్టినిల్లని తెలిపారు. స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి నేటి కార్మిక పోరాటాల వరకు అదే ఒరవడి కొనసాగుతోందని తెలిపారు. సీపీఐ (ఎం) ఐదు మహాసభలకు తమిళనాడు ఆతిథ్యమిస్తే అందులో మూడింటికి మదురై నగరం వేదికగా నిలిచిందని వివరించారు. ఇక్కడ తమ పార్టీ భూస్వామ్య విధానాన్ని వ్యతిరేకించిందని, దళితుల హక్కుల కోసం పోరాడిందని గుర్తు చేశారు. వాచ్చాత్తి అఘాయిత్యాలకు వ్యతిరేకంగా న్యాయపోరాటం సాగించి బాధ్యులందరికీ శిక్ష పడేలా చేసిందని తెలిపారు. 1925లో సింగారవేలర్ నేతృత్వంలో మొదటిసారి తమిళనాడులో మేడేను జరిపిన ఘనత కమ్యూనిస్టులదేనని చెప్పారు.

శాంతి, స్థిరత్వాలకు మహాసభ దోహదం చేయాలి

సౌహార్థ సందేశంలో చైనా

అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాల పురోగతికి, ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ దోహదం చేయాలని చైనా కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్షించింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అంతర్జాతీయ విభాగం సౌహార్ద సందేశాన్ని పంపింది. ఈ సందేశంలో 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా 24వ మహాసభను నిర్వహించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం. ఈ మహాసభ సంపూర్ణ విజయం సాధించగలదని ఆకాంక్షిస్తున్నాం' అని పేర్కొంది. భారతదేశంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఒక ముఖ్యమైన వామపక్ష శక్తిగా, దేశ ఆర్థిక, సామాజిక పురోగతికి సీపీఐ(ఎం) నిరంతరం కట్టుబడి ఉంది. ప్రాంతీయ శ్రేయస్సు, పురోగతిని ప్రోత్సహించేందుకు ఈ సదస్సు దోహదపడే అవకాశంగా నిలుస్తుందని మేము నమ్ముతున్నాము.' అని సందేశంలో పేర్కొంది. 'మెరుగవుతున్న చైనా-భారత సంబంధాలు రెండు దేశాల ప్రజలకు, సాధారణ ప్రయోజనాలను అందిస్తాయని పేర్కొంది. ఈ కొత్త పరిస్థితుల నేపథ్యంలో భారతీయ, రాజకీయ పార్టీలతో సంబంధాలను కొనసాగిస్తామని, పార్టీ, ప్రభుత్వ పాలన అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నాం' అని చైనా కమ్యూనిస్టు పార్టీ తెలిపింది.

ప్రజాపునాదిని బలోపేతం చేయాలి : వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా

24వ మహాసభ విజయవంతం కావడం ద్వారా సీపీఐ(ఎం) ప్రజాపునాది బలోపేతం కావాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా పేర్కొంది. ఈ మేరకు పంపిన సందేశంలో పార్టీ సభ్యులందరికీ హృదయపూర్వక, స్నేహపూర్వక శుభాకాంక్షలను తెలియజేస్తున్నట్టు పేర్కొంది. 'మహాసభ పార్టీ సంస్థాగత పునాదిని, ప్రజా పునాదిని బలోపేతం చేయడంలో కొత్త మైలురాయిని నెలకొల్పే ముఖ్యమైన సందర్భం అవుతుందని విశ్వసిస్తున్నాం.' అని పేర్కొంది.. రెండు పార్టీల మధ్య దీర్ఘకాల స్నేహం, సహకారం భవిష్యత్తులో మరింత అభివద్ధి చెందుతుందన్న దఢ సంకల్పాన్ని వ్యక్తం చేసింది.

స్నేహం అభివృద్ధి చెందాలి : వియత్నాం కమ్యూనిస్టు పార్టీ

రెండు కమ్యూనిస్టు పార్టీలతో పాటు, దేశాలు, ప్రజల మధ్య కూడా స్నేహ సంబంధాలు అభివృద్ధి చెందాలని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్షించింది. ఈ మేరకు పంపిన సందేశంలో వామపక్ష ఉద్యమ సంఘీభావాన్ని బలోపేతం చేయడానికి సీపీఐ(ఎం) చేసిన కృషిని ఆ పార్టీ ప్రశంసించింది. ప్రజల జీవనోపాధి, ప్రజాస్వామ్యం, శ్రామిక ప్రజలు, మైనారిటీ వర్గాల చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించడానికి చేసిన చట్టబద్ధమైన పోరాటాలను ప్రస్తావించింది. 24వ మహాసభలో చేస్తున్న తీర్మానాలు భారత రాజకీయాల్లో సీపీఐ(ఎం) స్థానం, ప్రభావాన్ని పెంచడానికి దోహదపడతాయని పేర్కొంది. శాంతియుత, ఐక్యమైన, ప్రజాస్వామ్య, సంపన్న భారతదేశాన్ని నిర్మించడానికి మహాసభ తీర్మానాలు సంపన్న భారతదేశాన్ని నిర్మించడానికి ఉపయోగపడగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్(సవరణ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో వాడీవేడీ చర్చ జరిగింది. 12 గంటల పాటు సుదీర్ఘ చర్చ అనంతరం అర్ధరాత్రి దాటిన(12.58 గంటలకు) తర్వాత బిల్లు ఆమోదం కోసం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. అనుకూలంగా 282 మంది సభ్యులు ఓటు వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. బీజేపీ నేత ృత్వంలోని ఎన్డీయే పక్షాలు, ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌లోని ప్రధాన పార్టీలు తమ ఎంపీలు అందరికీ విప్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్డీయే కూటమిలోని కొందరు ఎంపీలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్టు సమాచారం.దీంతో కేవలం 50 ఓట్ల తేడాతో లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లుకు లైన్‌క్లియర్ అయింది. అయితే ఈ బిల్లు గురువారం రాజ్యసభకు వెళ్లనుంది. ఈ బిల్లుపై చర్చకు ఎగువసభలో 8 గంటల సమయాన్ని కేటాయించారు.

రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడి : ప్రతిపక్ష పార్టీల ఎంపీలు

రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై వక్ఫ్ సవరణ బిల్లు దాడి చేస్తోందని, దీనిని ఇండియా బ్లాక్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ప్రతిపక్ష పార్టీల నేతలు స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును బుధవారం లోక్‌సభలో కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చల్లో వివిధ పార్టీల నుంచి 35 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. 1970 నుంచి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసిందని, ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యూపీఏ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు తీసుకురాకపోతే, పార్లమెంట్ భూమిని సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్నాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు వివరించారు.

సమాఖ్య నిర్మాణంపై దాడి : గౌరవ్ గొగోయ్

ఈ సందర్భంగా జరిగిన చర్చలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ ఈ బిల్లు రాజ్యాంగంలోని నిబంధనలను నీరుగార్చే, మైనార్టీలను కించపరిచే, వారి హక్కులను తొలగించే, భారత సమాజాన్ని విభజించడం వంటి నాలుగు లక్ష్యాలతో ఉందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం పార్లమెంట్‌ను తప్పుదారి పట్టించిందని, ఈ విషయంలో గతంలో జరిగిన చర్చలను కూడా ఆయన ప్రస్తావించారు. ఈ బిల్లు మన సమాఖ్య నిర్మాణంపై దాడి చేస్తుందని అన్నారు. ఈ బిల్లుపై మైనార్టీ ప్రతినిధులతో తగినంతగా చర్చించలేదని పేర్కొన్నారు. ఈ బిల్లు సవరణలు సమర్పించడానికి ఒక ఏడాది ముందు, 2023లో జరిగిన పార్లమెంటరీ కమిటీలో నాలుగు సమావేశాలు జరిగాయని, వాటిలో దేనిలోనూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ బిల్లును ఎందుకు ప్రస్తావించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ బిల్లు మహిళలకు హక్కులు ఇస్తున్నట్లు, ప్రస్తుతం చట్టం మహిళలపై వివక్ష చూపుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి ప్రస్తుత చట్టంలో వితంతువులు సహా మహిళ రక్షణ, సాధికారత కోసం నిబంధనలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రతిపక్షాల సూచనలను జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు.



దేశ లౌకిక ప్రతిష్టను దెబ్బతీస్తుంది: అఖిలేష్ యాదవ్

ఈ బిల్లు విభజన లక్ష్యంగా ఉందని, దేశ లౌకిక ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రపంచానికి తప్పుడు సందేశం పంపుతుందని ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. బీజేపీకి తగ్గుతున్న ఓటుబ్యాంకును నిర్వహించడానికి ఈ బిల్లును తీసుకొచ్చారని విమర్శించారు. బీజేపీ తన విధానాల కారణంగా ఇప్పుడు పార్టీకి దూరంగా ఉన్న మద్దతుదారులను సంతృప్తి పరచాలని కోరుకుంటుందని అన్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఓట్ల శాతం తగ్గినందున, బీజేపీ ఓట్లను నియంత్రించ దానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. కొంత మంది సభ్యులు బిల్లుకు మద్దతు ఇస్తున్నట్టు చెప్పుకుంటున్నప్పటికీ, లోపల వారు సంతోషంగా లేరని అన్నారు. వక్ఫ్ బిల్లు తీసుకురావడం బీజేపీ రాజకీయ క్రీడ, ఇది వారి మత రాజకీయాలకు కొత్తరూపం అని విమర్శించారు.

వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు చోటు లేదు: అమిత్‌షా

వక్ఫ్ సవరణ బిల్లుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, ముస్లింల మతపరమైన వ్యవహారాల్లో ఎలాంటి జోక్యం ఉండదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా భరోసా ఇచ్చారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరలకు చోటు లేదని స్పష్టం చేశారు. "వక్ఫ్ చట్టం, బోర్డు 1995లో అమల్లోకి వచ్చాయి. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేరుస్తామని, వక్ఫ్‌లో జోక్యం చేసుకుంటామని కొందరు వాదనలు చేస్తున్నారు. మొదటగా వక్ఫ్ బోర్డులో ఏ ముస్లిమేతరులు ఉండరని నేను చెప్పదలచుకున్నాను. అలాంటి ప్రొవిజన్ ఏదీ ఇందులో లేదు. అలా చేయాలని కూడా మేము కోరుకోవడం లేదు. ముస్లింల మతపరమైన కార్యక్రమాల్లో, వాళ్ల విరాళాలుగా ఇచ్చిన ఆస్తుల్లో జోక్యం చేసుకుంటామనేది కూడా పూర్తిగా అపోహ. కేవలం ముస్లింల ఓటు బ్యాంకు కోసమే ఇలాంటి తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి" అని అమిత్‌షా పేర్కొన్నారు. 2014 ఎన్నికలకు ముందు న్యూఢిల్లీలోని 123 వీఐపీ ఆస్తులను వక్ఫ్ బోర్డుకు కాంగ్రెస్ ఇచ్చింది. 2013లో కూడా వక్ఫ్ చట్టానికి సవరణలు చేయడంతో రైల్వే భూమిని వక్ఫ్‌కు ఇచ్చింది. జేడీయూ కూడా ఈ బిల్లుకు మద్దతు ఇచ్చింది. జేడీయూ నేత, కేంద్ర మంత్రి లాలన్ సింగ్ మాట్లాడుతూ ఈ సవరణలు వెనుకబడిన, పేదలు, మహిళల ప్రయోజనాల కోసమే అని అన్నారు.

మద్దతు ఇచ్చిన పార్టీలు

బీజేపీ, టీడీపీ, జేడీయూ, శివసేన (షిండే), అప్నాదళ్, జనసేన, ఎల్జేపీ, జేడీఎస్, ఆర్‌ఎల్‌డీ, ఎన్‌సీపీ (అజిత్ పవార్)

వ్యతిరేకించిన పార్టీలు

కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే, టీఎంసీ, సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ ఎంఎల్, ఎన్‌సీపీ (శరద్ పవార్), శివసేన (ఠాక్రే), వైసీపీ, ఆర్‌జేడీ, జెఎంఎం ఆఫ్ నేషనల్ కాన్ఫరెన్స్, ఐయూఎంఎల్, బీసీకేజీ , ఆర్‌ఎస్‌పీ, ఎంఐఎం

గడువు ముగిసినా లక్ష్యం చేరలే

స్మార్ట్ సిటీస్ మిషన్ తీరిది

వందలో 18 నగరాల్లోనే పూర్తైన ప్రాజెక్టులు
మోడీ సర్కారు వైఫల్యం : విశ్లేషకులు

న్యూఢిల్లీ : ప్రజల జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చటానికి మోడీ సర్కారు తీసుకొచ్చిన కార్యక్రమమే 'స్మార్ట్ సిటీస్ మిషన్'. 2014 మే 26న భారత దేశ ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టారు. దేశంలో అత్యాధునిక సాంకేతిక కమ్యూనికేషన్ సామర్థ్యాలతో కూడిన వంద స్మార్ట్ సిటీలను నిర్మిస్తామని ఒక నెల తర్వాత ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా వంద నగరాలను ఎంపిక చేశారు. అనేక గడువులు దాటాయి. చివరకు ఈ ఏడాది మార్చి 31 వరకు దానిని పొడగించారు. అది కూడా ముగిసింది. కానీ.. అనుకున్న లక్ష్యాన్ని మాత్రం మోడీ సర్కారరు సాధించినట్టు కనబడటం లేదు. వంద నగరాల్లో 18 సిటీల్లో మాత్రమే ప్రాజెక్టులు పూర్తయ్యాయని విశ్లేషకులు చెప్తున్నారు. దీనిని బట్టి చూస్తే మోడీ సర్కారు వైఫల్యం స్పష్టంగా కనబడుతున్నదని అంటున్నారు.

కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత.. స్మార్ట్ సిటీస్ మిషన్ గురించి పెద్దగా ప్రచారం చేసుకున్నారు. "గతంలో నగరాలు నదీ తీరాలపై నిర్మించబడ్డాయి. ఇప్పుడు రహదారుల వెంట ఉన్నాయి. భవిష్యత్తులో అవి ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ల లభ్యత, మౌలిక సదుపాయాల ఆధారంగా నిర్మితమవుతాయి" అని మోడీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా చెప్పబడుతున్న ఈ ప్రాజెక్టులో మరుసటి సంవత్సరం 1.2 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ఆయన ప్రకటించారు. ప్రయివేటు వనరులు, విదేశాల నుంచి కూడా నిధులు వస్తాయి. అప్పట్లో దేశ ఆర్థిక మంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ వివరాలనూ వెల్లడించారు. ఈ కొత్త నగరాల్లో ఎక్కువ భాగం పెద్ద నగరాల చుట్టూ ఉన్న పట్టణాలుగా ఉంటాయని చెప్పారు. విదేశీ పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలను ప్రకటించారు.

ఇటు మోడీ అనుకూల మీడియా సైతం 'స్మార్ట్ సిటీస్'కు విపరీత ప్రచారం కల్పించింది. మోడీ సర్కారు ప్రణాళికను కొనియాడింది. టైర్-2 సిటీస్‌కి ఈ ప్రణాళికతో మంచి రోజులు రానున్నాయని కోడై కూసింది. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తరలి వస్తాయని వివరించింది. సదరు నగరాల్లోని ప్రజలకు మోడీని ఒక హీరోలాగా ప్రచారం చేసింది మీడియా.

రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారులు, విదేశీ సరఫరాదారులు, ప్రపంచ సాంకేతిక, ఐటీ సంస్థలు స్మార్ట్ సిటీ మిషన్‌లో మేకిన్ ఇండియా ప్రాజెక్టు కంటే ఎక్కువ ఆకర్షణీయమైన వ్యాపార అవకాశాలను చూశాయి. 2015 మధ్య నాటికి.. ఫ్రాన్స్, యూఎస్, చైనా, స్వీడన్, ఇజ్రాయెల్, జర్మనీ, బ్రెజిల్, సింగపూర్ సహా 14 దేశాలు ఆసక్తిని వ్యక్తం చేశాయి. స్మార్ట్ సిటీలలో ప్రధాన పెట్టుబడులను పరిశీలిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, యూఎస్-ఎయిడ్ వంటి దిగ్గజ అంతర్జాతీయ సంస్థలు మద్దతు ఇచ్చాయి. ప్రైస్‌వాటర్‌హౌజ్‌కూపర్స్, మెకిన్సీ, లీ అసోసియేట్స్ అండ్ బాష్ ఎంప్యానెల్డ్ కన్సల్టెంట్లుగా ఉన్నాయి. ప్రయివేటు సంస్థలకు ఈక్విటీ భాగస్వామ్యం, యూజర్ ఛార్జీలు విధించే హక్కును కల్పించారు.

దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామాలను వైఫై బాక్స్‌లు, గేర్ వంటి సౌకర్యాలతో అనుసంధించటానికి 7 లక్షల కిలోమీటర్ల బ్రాడ్‌బ్యాండ్ కేబుల్ అవకాశాలు కాంట్రాక్టర్లను ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీంతో ఆ సమయంలో ప్రయివేటు, విదేశీ పెట్టుబడిదారులు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం విపరీత ఆర్థిక భారాన్ని మోయాల్సి ఉంటుంది. దీంతో మోడీ కలల ప్రాజెక్టు ఆర్థికంగా భారమైనదనీ, వినాశకరమైనదని ప్రభుత్వంలోని ముఖ్యులు ప్రధానికి వివరించినట్టుగా తెలిసింది. ఈ ప్రాజెక్టు రాజకీయంగా తెలివితక్కువ నిర్ణయమని కూడా చెప్పినట్టు సమాచారం. నగరాలను 'స్మార్ట్'గా ఉంచటానికి నిరంతర నవీకరణ అవసరమని మోడీ భావించి ఉండొచ్చు.

ఇందులో భాగంగానే.. నామకరణాన్ని కొనసాగిస్తూ కార్యక్రమ లక్ష్యాన్ని మోడీ సర్కారు మార్చింది. స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రస్తుత నగరాలను పునరుద్ధరించటం, గృహనిర్మాణం, పరిశుభ్రమైన నీరు, విద్యుత్, రవాణా వంటి సౌకర్యాలను అందించటం వరకే పరిమితం చేసింది. అన్ని పథకాలనూ ప్రయివేటు కంపెనీలు, ప్రయివేటు-ప్రభుత్వ భాగస్వామ్య వెంచర్లైన హైసోనింగ్ స్పెషల్ పర్పస్ వెహికిల్స్ (ఎస్‌పీవీ) నిర్వహిస్తాయి.



స్మార్ట్ సిటీస్ మిషన్ మన్మోహన్ సర్కారు తీసుకొచ్చిన జవహర్‌లాల్‌నెహ్రూ నేషనల్ రెన్యూవల్ మిషన్(జేఎన్ఎన్‌యూఆర్ఎం), దాని నాలుగు ఉప-మిషన్ల నుంచి భారీగా రుణాలు తీసుకున్నది. మోడీ మిషన్ ప్రస్తుతమున్న అటల్ మిషన్ ఫర్ రిజువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-యూ), నేషనల్ అర్బన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ (ఎన్ఎల్‌యూపీ)లను అతివ్యాప్తి చేస్తున్నది.

వాస్తవానికి స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రస్తుత దశను 2020 నాటికి ముగించాలని నిర్ణయించారు. కానీ, అమలులో అడ్డంకులు ఉన్నందున పలు పొడగింపులు వచ్చాయి. చివరకు ఈ ఏడాది మార్చి 31ని తుది గడువుగా నిర్ణయించారు. అయితే, ప్రధానమైన మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం, స్మార్ట్ పరిష్కారాలు వంటివి ఈ మిషన్ సాధించలేకపోయిందని విశ్లేషకులు చెప్తున్నారు. స్మార్ట్ సిటీ మిషన్ అనూహ్యంగా ముగిసిందని అంటున్నారు. ఇది అనేక ఉద్యోగాల నష్టం, సంబంధిత అనిశ్చితులను మిగిల్చిందని చెప్తున్నారు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఆహారం, గృహనిర్మాణం, విద్యుత్, రవాణా వంటి ముఖ్యమైన విషయాలకు ప్రాధాన్యత ఉండాలని విశ్లేషకులు చెప్తున్నారు. వాటిని వదిలేసి.. స్మార్ట్ సిటీస్ అనే విస్తృతమైన అంశాన్ని పట్టుకుంటే.. ఆర్థిక నష్టం, ప్రజల ప్రయోనాలకు నష్టం తప్పితే మరేమీ ఉండదని అంటున్నారు.

సంపాదకీయం

ఇదీ యుద్ధమే!



'ట్రంపెట్' ఎప్పుడో ఊదాడు. ఈ రోజుతో గడువు ముగిసింది. కేంద్ర బడ్జెట్ నుండే మెల్లిగా వంగడం ప్రారంభించిన మోడీ సర్కార్ పూర్తిగా పాదాభివందనం చేస్తుందో లేదో చూడాలి. కోట్లాది భారతీయ రైతులకు, పాల ఉత్పత్తిదారులకు నష్టం చేసే విధానం అవలంభిస్తుందో లేదో చూడాలి. ఈ బడ్జెట్‌లోనే కొన్నిరకాల అమెరికన్ ఉత్పత్తులపై పన్నులు తగ్గించిన మోడీ ప్రభుత్వం ఎంతకైనా తెగించవచ్చు. చివరికి కొలంబియా వంటి చిన్న లాటిన్ అమెరికా దేశం తన విద్యార్థులకు సంకెళ్ళు వేయకుండా, అమెరికా యుద్ధ విమానం తన దేశంలోకి రాకుండా, తానే యుద్ధ విమానం పంపి తమ దేశ పౌరులను గౌరవప్రదంగా వెనక్కి తెచ్చుకున్న ఘటన చూస్తే మన సర్కార్ ఎంతకైనా దిగజారుతుందేమో అనిపిస్తుంది.

> ఇటీవల అమెరికా కామర్స్ మంత్రి మోడీతో ఏమన్నారంటే నూటనలభై కోట్ల జనం ఉన్నారంటారు, గొప్ప ఆర్థిక వ్యవస్థ ఉందంటారు, మా దగ్గర్నించి నాలుగు జొన్న కంకులు కొనలేరా? అమెరికా రైతులు మీ దగ్గరికి రాలేరు. మీ రైతులు మా దగ్గరికి వస్తారు. అదెలా? అని దబాయిస్తే మొహం కిందికేసుకున్నది మన ప్రతినిధి బృందం. ఇప్పటికే మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, బియ్యం, పప్పులపై టారిఫ్‌లు తగ్గించడానికి భారత ప్రభుత్వం అంగీకరించింది. అమెరికా కోరినవన్నీ ఇస్తే మన ఫార్మారంగం, ఆటోమొబైల్ రంగం బాగా దెబ్బతింటుంది.

మల్లయుద్ధంలాగా, కత్తి యుద్ధంలాగా ఇదీ టారిఫ్‌ల యుద్ధం. మరో ప్రపంచ యుద్ధానికి దారితియ్యొచ్చని కొందరం టున్నారు. ఇప్పుడే జోస్యం చెప్పలేము. కానీ ఒక నిజాన్ని బయటపెట్టింది. ప్రపంచీకరణ నిత్యమనీ, సత్యమనీ నయా ఉదారవాద విధానాలు అన్ని దేశాల్ని కష్టాల వైతరణిని దాటిస్తాయన్న ప్రచారం పరమ బూతుమాట అని తేలిపోయింది. ప్రపంచీకరణంటే పేద, ధనిక దేశాలకు ఉభయ తారకంగా ఉంటుందని ఊదరగొట్టిన మాటలు వట్టివేనని తేల్చేసింది.

నేటి ట్రంపు కంపు మాటలు చూస్తే గత 30 ఏండ్లలో అమెరికానే మునిగిపోయిందట. ఆ పేరు మీద ట్రంప్ ప్రారంభించిన టారిఫ్‌ల యుద్ధంగాని, సరైన డాక్యుమెంట్లు లేవని మన దేశంతో సహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల పిల్లలను, కార్మికులను గొలుసులతో బంధించి వెనక్కి పంపడంగాని, కెనడా, గ్రీన్‌ల్యాండ్, పనామా, గాజాలను ఆక్రమించుకుంటాననే వలసవాద కోరికను బహిర్గతం చేయటం అమెరికా ఇంతకాలం చెప్పిన సుద్దులన్నీ పోసుకోలు మాటలేనని తేల్చిచెప్తోంది.

గ్లోబలైజేషన్ భజన రాయిళ్లు అంతా ఏదో మోటు సామెత చెప్పినట్టు గమ్మున కూచున్నారు. అమెరికాను చూసి 'ఆహా', 'ఓహో' అన్న వారి నోళ్లు పడిపోయినాయి. గ్లోబలైజేషన్‌పై భారతదేశంలో మొదట్నించి పోరాటం చేస్తున్న వర్గ సంఘాలకు నేడు పైచేయి సాధించే అవకాశం వచ్చింది.

ఏప్రిల్ 2 నుండి టారిఫ్‌లు వేస్తామన్న దేశాల్లో మనదీ ఒకటి. ముందే చెప్పినట్టు బడ్జెట్ నుండే 55 రకాల అమెరికన్ సరుకులపై టారిఫ్‌లు తగ్గిస్తూ వస్తున్నారు మోడీ సర్కారు వారు. బోర్బన్ విస్కీ, హార్లీడే విడ్‌సన్ మోటారు బైక్‌లపై తగ్గించారు. మొన్న మార్చి 25న ప్రవేశపెట్టిన ఫైనాన్స్ బిల్ సవరణలో గూగుల్ కోసం డిజిటల్ టాక్స్ తగ్గించారు. అనేకరకాల సరుకులపై ఈ పన్ను తగ్గింపును నిర్మలా సీతారామన్ సమర్థించుకున్నారు. అమెరికా నుండి భారత్‌లోకి వచ్చే పెట్రోలియం క్రూడ్‌పై టన్నుకు కేవలం ఒక రూపాయి పన్ను. మొత్తం దిగుమతయ్యే క్రూడ్ పెద్ద మొత్తంలో ఉన్నా దానిపై పన్ను ముష్టి టన్నుకు రూపాయి. అలానే అమెరికా నుండి దిగుమతయ్యే బొగ్గు, ఎల్ఎన్‌జీ, విమానాలు మొదలైన వాటిపై కేవలం 2.5 శాతమే పన్ను. నేడు అమెరికా కోరేదేమంటే తన వ్యవసాయ ఉత్పత్తులపైనా, డెయిరీ ఉత్పత్తులపైనా, కొన్ని ముఖ్యమైన మాన్యుఫాక్చర్డ్ సరుకులపైనా పన్నులు తగ్గించాలని పెద్దఎత్తున వత్తిడి చేస్తున్నది.

అంటే దేశ జనాభాలో 45శాతం మంది ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్న వాస్తవాన్ని గమనంలో పెట్టుకుంటే దీని ప్రభావం ఏమేరకుంటుందో గమనించవచ్చు. తలదించుకుని ఉండే మోడీ సర్కార్‌ని చూసి ట్రంప్ మరిన్ని రాయితీలు డిమాండ్ చేస్తున్నాడు.

ఇటీవల అమెరికా కామర్స్ మంత్రి మోడీతో ఏమన్నారంటే నూటనలభై కోట్ల జనం ఉన్నారంటారు, గొప్ప ఆర్థిక వ్యవస్థ ఉందంటారు, మా దగ్గర్నించి నాలుగు జొన్న కంకులు కొనలేరా? అమెరికా రైతులు మీ దగ్గరికి రాలేరు. మీ రైతులు మా దగ్గరికి వస్తారు. అదెలా? అని దబాయిస్తే మొహం కిందికేసుకున్నది మన ప్రతినిధి బృందం. ఇప్పటికే మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, బియ్యం, పప్పులపై టారిఫ్‌లు తగ్గించడానికి భారత ప్రభుత్వం అంగీకరించింది. అమెరికా కోరినవన్నీ ఇస్తే మన ఫార్మారంగం, ఆటోమొబైల్ రంగం బాగా దెబ్బతింటుంది.

పైగా వెనిజులా నుండి ఆయిల్ కొనేవారి నెత్తిన ఇంకో 25 శాతం అదనంగా పన్ను వేస్తామంటున్నాడు ట్రంప్. మన దేశానికి ఇది అదనపు పన్ను పోటు. తోటి జీ7 దేశాల్లో ఒకటైన కెనడా అమెరికాకు ఎదురునిలిచింది. మెక్సికో, ఈయూ దేశాలు, చైనా అమెరికాను ఎదిరించి నిలిచాయి. చిన్న, పెద్ద దేశాలు అమెరికా దాష్టీకాన్ని ఏదో ఒక రూపంలో ఎదిరించి నిలుస్తుంటే మన దేశం మన ప్రజల కోసం, ముఖ్యంగా రైతుల కోసం అమెరికా ముందు సాష్టాంగపడరాదు. ఈ యుద్ధంలో గెలవాలి. అమెరికా దాష్టీకాన్ని ఎదిరించి నిలవాలి.

కార్పొరేట్, మతోన్మాదానికి విరుగుడు.. సామాజిక, ఆర్థిక పోరాటాలే


పాలడుగు భాస్కర్
9490098033

భూస్వామ్య, పితృస్వామిక వ్యవస్థకు మూలాధారమైన తిరోగామి హిందూత్వ విధానంపై ఆధారపడిన సమాజంలో నేడు మనమున్నాం. ఆ వ్యవస్థకు గుర్తులుగా ఉన్న అన్నిరకాల రుగ్మతలను, వివక్షలను, అసమానతలను పాలకవర్గాలు తమ రాజకీయ ప్రయోజనాలకు, ఆర్థిక దోపిడీకి వాడుకుంటున్నాయి. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ మన దేశంలోనే ఉన్నది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని, మనిషిలాగా చూడలేని దుర్మార్గపు స్థితి నేటికీ కొనసాగడం అమానుషం. కులం, మతం, ప్రాంతం, లింగ బేధం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజల్ని, కార్మిక వర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా, ముండ్ల కంచెలా ఉన్నాయి. దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం పాలక వర్గాలు కార్మికవర్గంలో సున్నితమైన ఈ అంశాలను ముందుకు తెస్తున్నారు. దాంతో కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసి దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నాయి. సమాజంలో అన్నిరకాల దోపిడీ, అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి వీటి నుండి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సీఐటీయూ తన ఆవిర్భావం నుంచి పని చేస్తున్నది. సామాజిక అణచివేత, వివక్ష, దోపిడీలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలతో శ్రామికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తున్నది.

రాష్ట్రంలో నేటికీ పరిశ్రమల్లో, విద్యాలయాల్లో, పని ప్రదేశాల్లో చాపకింద నీరులా కులవివక్ష కొనసాగుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ ఉద్యోగులూ వివక్ష, దాడులకు గురవుతూనే ఉన్నారు. సమాజంలో ఉన్న వివక్ష, సహచర ఉద్యోగులు, కార్మికులు పాటిస్తున్న వివక్ష ఈ రెండింటినీ వారు అనుభవించాల్సి వస్తున్నది. ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న లోపం వల్ల పదోన్నతులు దక్కడం లేదు. దళిత ఉద్యోగుల ఎడల రిజర్వేషన్ కేటగిరీ అంటూ చిన్నచూపు చూస్తున్నారు. డ్యూటీ చేస్తున్న పని ప్రదేశాలు మధ్యాహ్నం లంచ్ చేసే దగ్గర కూడా వివక్ష కొనసాగుతున్నది. ప్రత్యేకంగా కార్మికుడి సామర్థ్యం, హోదా నుండి కాకుండా వారి కులం ఆధారంగా గౌరవిస్తున్న అమానుష స్థితి ఉంది. 77 సం॥లు స్వాతంత్ర్యానంతరం కూడా పట్టణ ప్రాంతాల్లో దళిత ఉద్యోగ, కార్మికులకు ఇండ్లు అద్దెకు ఇవ్వకపోవడం శోచనీయం. దళితులకు గుడి ప్రవేశం లేని గ్రామాలు, దళితులకు క్షవరం చేయని స్థితి, దసరా పండుగ సందర్భంగా దళితులను జమ్మి ఆకు తెంప నీయకపోవడం, బతుకమ్మ ఆడనీయని ప్రాంతాలు, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, రచ్చబండపై వీరిని కూర్చోనీయకపోవడం, పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే అగ్రవర్ణ విద్యార్థులు తినకపోవడం లాంటి ఘటనలు జరుగుతున్నాయి. కుల వివక్ష, అంటరానితనం, కుల దురహంకార హత్యలు, సాంఘిక బహిష్కరణలు నిత్యకృత్యం. తెలంగాణ రాష్ట్రంలో దళితులపై 128 కులదురంహకార హత్యలు జరిగాయి. భువనగిరిలో అంబోజీ నరేష్‌ను హతమార్చారు. మంథనిలో మధుకర్‌ను కుల దురహంకారంతో అమానుషంగా అంతమొందించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరిలో ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌పై దాడి చేసి ఊరేగించి అవమానపర్చారు. తుక్కుగూడ దళిత హెడ్‌మాస్టర్ రాములుపై మతోన్మాదులు రెచ్చిపోయి దాడి చేసి అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థి కాళ్లు మొక్కించారు. ఇలా చెప్పుకుంటూ పోతే మతపరమైన దాడులు, విద్వేషపు అల్లర్లు కోకొల్లలు.

వేల సంవత్సరాల నాటి బూజు పట్టిన మనువాద సిద్ధాంతాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. దేశ భక్తి ముసుగులో మతం పేరుతో శ్రామిక ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నది. రాజ్యాంగ స్ఫూర్తిని భగ్నం చేస్తున్నది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ అగ్ర నాయకత్వమే బహిరంగంగా ప్రకటించింది. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగానికి రూపకల్పన చేసే సమయంలోనే బీజేపీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, అంబేద్కర్ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. వారు అత్యంత ప్రామాణికంగా భావించే మనుస్మృతికి భారత రాజ్యాంగంలో స్థానం లేకుండా పోయిందని స్వయంగా గోల్వాల్కర్ తమ 'ఆర్గనైజర్' పత్రికలో పలు వ్యాసాలు రాశారు. మన దేశానికి ప్రస్తుత రాజ్యాంగం పనికిరాదన్నారు. ఇప్పుడు ఆరెస్సెస్ కనుసన్నల్లో పాలన చేస్తున్న బీజేపీ అదును చూసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నది. ఈ ప్రమాదాలను కార్మికవర్గం ప్రతిఘటించాలి! రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి!!



భారత రాజ్యాంగం ఆర్టికల్-14, 16, 19 (1) (సి), 23, 24, 38, 41ల ద్వారా కార్మిక హక్కులకు అత్యంత ప్రాధాన్యత కల్పించింది. కార్మికుల సంక్షేమం, హక్కులు, బాధ్యతలు రాజ్యాంగంలో పొందుపర్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వరంగ సంస్థలను ఆధునిక దేవాలయాలతో పోల్చింది నాయకగణం. కానీ నేడు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి వాటిని సమాధి చేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించడం, మూసివేయడం, వాటి ఆస్తులను నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ద్వారా తెగనమ్మడం, ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడం, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం వంటి నిర్ణయాల వల్ల దళిత, గిరిజన, బలహీన, పీడిత వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను నీరుగారుస్తున్నది. పేదలకు రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాలరాస్తున్నది. రిజర్వేషన్లకు పాతరేస్తున్నది. ఆర్టికల్-14కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. చట్టం ముందు అందరూ సమానమేననే భావనలకు తిలోదాకాలిచ్చింది. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చి కార్మిక హక్కులను హరించచూస్తున్నది. యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, సంఘటిత శక్తి, బేరసారాల హక్కులపై దాడి చేస్తూ కార్పొరేట్ల లాభాలకు కార్మికవర్గాన్ని బలి చేస్తున్నది. ఓ వైపు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, మరోవైపు మనువాద మతోన్మాద విధానాలను ఏకకాలంలో అమలు చేస్తూ సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నది.

జాతీయోద్యమ కాలంలోనూ, స్వాతంత్ర్యానంతర కాలంలోనూ భారతదేశంలో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనం, అణచివేత, మూఢనమ్మకాలు, స్త్రీల హక్కులు, ఆర్థిక, సామాజిక దోపిడీ, పీడనల నుండి విముక్తి కోసం దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలతో పాటు వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎందరో మహనీయులు అశేష త్యాగాలు చేశారు. వారు నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాడారు. వారి పోరాటాలు, త్యాగాలు, వారు చేసిన కృషి ఫలితంగానే, నేడు ఆయా తరగతులకు కొన్ని హక్కులు, చట్టాలు, సౌకర్యాలు లభించాయి. ప్రజలను వారి స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు సంభవించాయి. ఆ మహనీయులను స్మరించుకోవడానికి ప్రతి ఏడాది ఏప్రిల్ నెల ఓ ప్రత్యేకత చాటుతున్నది. అంటరానితనం, అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్తలు, సామాజికవేత్తలు, విప్లవకారులు, దోపిడీ రహిత సమసమాజ స్థాపనను కాంక్షించే కార్మికోద్యమ నేతల వర్ధంతులు, జయంతులు వరుసగా ఈ నెలలోనే రావడం విశేషం. అన్నిరకాల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి జీవితాంతం సమసమాజ స్థాపన లక్ష్యానికి కట్టుబడిన కార్మికోద్యమ నేత బిటి రణధివె వర్ధంతి ఏప్రిల్ 6న, ఏప్రిల్ 10 భారత మహిళా కార్మికోద్యమ నేత కా॥ విమలా రణదివె జయంతి, ఏప్రిల్ 11న కుల వ్యవస్థ నిర్మూలనలతో పాటు మహిళా ఉద్ధరణ, హక్కుల కోసం కృషి చేసిన జ్యోతిరావ్ పూలే జయంతి, ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత, అంటరానితనం, బానిసత్వంపై పదునైన ఆయుధాన్ని ఎక్కుపెట్టిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి. ఈ మహానుభావులను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 6 నుంచి 14 వరకు సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. గత మూడేండ్లుగా ఈ ఒరవడి కొనసాగుతోంది. మనువాదానికి వ్యతిరేకంగా, కుల వివక్షను అంతం చేయడం, మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులను ప్రతిఘటించడం, సామాజిక న్యాయం కోసం కార్మికవర్గ ఐక్యతను చాటడం వంటి మౌలిక లక్ష్యాలుగా ఈ సామాజిక సామాజిక న్యాయ వారోత్సవాన్ని నిర్వహించాలని కార్మికులకు నిర్దేశిస్తున్నది.

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలపై హింస రెట్టింపు స్థాయిలో పెరిగింది. అనేక కేసుల్లో బాధితులపై హత్యలు, లైంగికదాడుల ఘటనల తీవ్రత ఆందోళన కలిగిస్తున్నది. దేశంలో రోజుకు 86కు పైగా లైంగికదాడులు, లైంగికదాడియత్నం కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతి గంటకు 49 అమానుష ఘటనలు జరుగుతున్నాయి. వీటిల్లో అత్యధికం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే చోటు చేసుకోవడం గమనార్హం. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించినప్పటికీ దాని అమలును వాయిదా వేసి మోడీ ప్రభుత్వం మహిళలకు ద్రోహం చేసింది. దేశంలో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలను బీజేపీ ప్రభుత్వం ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నది. మైనార్టీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఘర్షణలు పెంచుతున్నది. ముస్లింల ఇండ్ల కూల్చివేతలు ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమై మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీలతో పాటు తెలంగాణ వరకు బుల్డోజర్లను ఉపయోగించింది. ఇటీవల మేడారం ఆదివాసుల జాతరలో మాంసం విక్రయాల్లో హలాల్ వివాదం సంఘ్ పరివార్ శక్తులు ముందుకు తెచ్చింది. మెదక్ జిల్లాలో మత ఘర్షణల్లో స్వయంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు లాఠీ పట్టుకొని స్వైర విహారం చేస్తూ మైనార్టీ హోటల్స్, హాస్పిటల్స్, దుకాణాలను ధ్వంసం చేశారు.

బీజేపీ అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు, కార్పొరేట్ - మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడకుండా సామాజిక న్యాయం సాధించలేము. ఆర్థిక - సామాజిక ఉద్యమాల ద్వారానే కార్పొరేట్, మతోన్మాద విధానాలను తిప్పికొట్టగలం. ఈ లక్ష్యసాధన కోసం సీఐటీయూ బ్యానర్‌తో అణచివేత, దోపిడీ, వివక్ష ఏ రూపంలో ఉన్నా వాటిని అంతం చేయాలనే సంకల్పంతో కార్మికవర్గం పోరాడాలి. రాష్ట్రంలో జరుగుతున్న సామాజికోద్యమాలకు కార్మికవర్గం బాసటగా నిలవాలి.

(ఏప్రిల్ 6 -14 వరకు సీఐటీయూ సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్)

> వేల సంవత్సరాల నాటి బూజు పట్టిన మనువాద సిద్ధాంతాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. దేశ భక్తి ముసుగులో మతం పేరుతో శ్రామిక ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నది. రాజ్యాంగ స్ఫూర్తిని భగ్నం చేస్తున్నది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ అగ్ర నాయకత్వమే బహిరంగంగా ప్రకటించింది. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగానికి రూపకల్పన చేసే సమయంలోనే బీజేపీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, అంబేద్కర్ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. వారు అత్యంత ప్రామాణికంగా భావించే మనుస్మృతికి భారత రాజ్యాంగంలో స్థానం లేకుండా పోయిందని స్వయంగా గోల్వాల్కర్ తమ 'ఆర్గనైజర్' పత్రికలో పలు వ్యాసాలు రాశారు. మన దేశానికి ప్రస్తుత రాజ్యాంగం పనికిరాదన్నారు. ఇప్పుడు ఆరెస్సెస్ కనుసన్నల్లో పాలన చేస్తున్న బీజేపీ అదును చూసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నది. ఈ ప్రమాదాలను కార్మికవర్గం ప్రతిఘటించాలి! రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి!!

శ్రీదేవి - భూదేవి



పాల సముద్రంలో శ్రీహరి యధావిధిగా నిద్రిస్తున్నాడు! ఎంత సేపైందీ తెలియదు కాని, శ్రీహరికి నిద్రా భంగం అయ్యింది! లేచి చూశాడు. తన పాదముల చెంత లక్ష్మీదేవి కనబడలేదు! అటూ ఇటూ వెతికాడు. కనుచూపు మేరలో లక్ష్మీదేవి కనబడలేదు! గతంలో లక్ష్మీదేవి తిరిగి వెళ్లిపోతే వెంకటేశ్వర అవతారం దాల్చవలసి వచ్చింది! మరి ఇప్పుడు ఏ అవతారం దాల్చాలి? దాల్చిన తర్వాత ఏం చేయాలి? అని సుదీర్ఘంగా ఆలోచిస్తున్నాడు! ఇంతలో నారదుడు వచ్చాడు! శ్రీహరికి నమస్కరించాడు.

"స్వామీ ! ఏమిటిది ఒంటరిగా ఉన్నారు? నాయనమ్మ గారేరి?" అని ప్రశ్నించాడు. నారదుడు.

"ఏమో! నారదా, నాకు తెలియటం లేదు. కొద్దిసేపటి నుండి వెతుకుతున్నాను!" అన్నాడు శ్రీహరి.

ఇద్దరూ కలిసి అంతటా వెదకసాగారు! కొద్దిసేపటికి ఎక్కడో పాలసముద్రంలో ఇద్దరు మహిళలు కన్పించారు. ఆత్రంగా దగ్గరకు వెళ్లి పరిశీలించారు! వారిలో ఒకరు శ్రీదేవి! మరొకరు భూదేవి! వారిద్దరూ శోకానికి ప్రతిరూపంగా కన్పించుతున్నారు.

"అమ్మలారా! ఏమిటిది, ఎందుకింతగా శోకించుకున్నారు! ఎవరైనా రాక్షసాధములు మిమ్మల్ని వేధించినారా? అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీమహావిష్ణువే మీ పెనిమిటి! ఆయన స్థితికారకుడు! అలాంటి శ్రీహరి దేవేరులైన మీరు ఇంతగా శోకించుటకు కారణ మేమి?" అని అడిగాడు నారదుడు.

శ్రీదేవి, భూదేవి మాట్లాడలేదు. శోకించటమూ మానలేదు! పైగా కన్నీటి ప్రవాహం పెరిగింది.

"దేవేరులారా ? మీరు ఎందు కింతగా శోకించుతున్నారు! కారణం ఏమిటీ నాకు తెలపండి! అట్టి సమస్యను నేను పరిష్కరించెదనని వాగ్దానం చేయుచున్నాను!" అన్నాడు శ్రీహరి. లక్ష్మి దేవి కండ్లు తుడుచుకున్నది.

"నాకు విముక్తి ప్రసాదించండి ప్రభూ, నా బిడ్డల వద్దకు నన్ను పంపించండి !" అని వేడుకున్నది శ్రీదేవి.

"దేవి, నీవెపుడూ స్వతంత్రు రాలివే! కొత్తగా విడిపించ వలసిన అవసరమేమున్నది?" అన్నాడు శ్రీహరి విస్మయంగా.

"మీకు తెలియనిదా స్వామీ! గతంలో నన్ను నేలమాళిగల్లో, ఇనుప పెట్టెలల్లో బంధించి దాచి ఉంచేవారు! ఇప్పుడు బాత్ రూములల్లో, బెడ్‌రూములలో బంధించి ఉంచుతున్నారు! అందు వల్ల నేను ఎవరికీ ఉపయోగ పడకుండా మిగిలిపోతున్నాను! అగ్ని ప్రమాదాలు, భూకంపాలు సంభవించినపుడు నా పరిస్థితి మరీ దారుణం! శిధిలాల కింది చిక్కిపోవటం లేదా మంటల్లో కాలిపోవటం ఇదే నాబతుకు సెలవివ్వండి స్వామి!" అంటూ భోరున విలపించింది శ్రీదేవి.

"తల్లీ నీవేమి చెబుతున్నావో ఒక్కముక్క కూడా అర్థం కావటం లేదు" అన్నాడు నారదుడు అయోమయంగా.

"త్రిలోక సంచారివి! నీకు కూడా తెలియదా? నిన్న ఒక న్యాయమూర్తి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది! అందులో కొన్ని నోట్ల కట్టలు సగం కాలిపోయాయి! మరికొన్ని కట్టలను రక్షక భటులు స్వాధీన



పర్చుకున్నారు. నోట్ల కట్టలు నా ప్రతి రూపమే కదా! నేను ఈ విధంగా ఎంతో మంది బడాబాబుల ఇండ్లలో బందీనై ఉన్నాను. నూరు కోట్ల మంది నా బిడ్డలు, కడుపునిండా భోజనం చేయలేని స్థితిలో ఉన్నారు. వారికి ఉపయోగపడలేని నా జీవితం ఎందుకు?" ప్రశ్నించింది శ్రీదేవి.

"బడాబాబులు మాత్రమే నీ బిడ్డలని, అందుకే వారి ఇనుపపెట్టెలల్లో, బెడ్ రూములు, బాత్ రూములలో నీవు కొలువై ఉన్నావని లోకమంతా అనుకుంటున్నది తల్లి!" అన్నాడు నారదుడు.

"నేను బడాబాబుల ఇండ్లలోకి వెళ్లలేదు! వారే నన్ను బంధించి ఉంచుతున్నారు! గనిలో, పనిలో, కార్ఖానాలో, పొలంలో కష్టజీవులు తమ రక్తాన్ని, చెమటగా మార్చి, నన్ను సష్టిస్తున్నారు! అందుకే వారే నాకు ఇష్టం! కాని నేను బడాబాబుల ఇండ్లలో బందీనై ఉన్నాను! అందుకే నన్ను విముక్తి చేయండి స్వామి!" వేడుకున్నది శ్రీదేవి.

"తల్లీ ! భూదేవి నీ బాధకు కారణమేమి?" అడిగాడు నారదుడు.

"నా బాధ అక్క బాధా రెండూ ఒకటే నారదా! అక్క బడాబాబుల వద్ద బందీ అయితే నేను భూబకాసురుల వద్ద బందీనై ఉన్నాను. వందల, వేల ఎకరాల కొద్దీ భూమిని అంటే నన్ను ఈ భూబకాసురులు రకరకాల పేర్లతో తమ వద్ద బందీగా చేసుకున్నారు! నాకును విముక్తి కావలెను." అన్నది భూదేవి.

"తల్లీ! నిన్ను ఒకరు బందీగా ఉంచగలరా! శ్రీదేవి వలె నీవు అటూ ఇటూ కదులుదానవు కాదుగదా! స్థిరమైనదానవు! పైగా నీ బిడ్డలు ఎప్పుడూ నీ ఒడిలోనే ఉంటారు కదా!" అన్నాడు నారదుడు.

"నా బిడ్డలు నా ఒడిలో ఉంటారన్నది నిజమే! కాని నా మీద వారికి ఎలాంటి హక్కు లేదు! ఒక వేళ హక్కు ఉన్నా ఆ హక్కును అనుభవించకుండా ప్రభువులు అడ్డుపడుతున్నారు! నిన్న రామోజీ ఫిల్మ్‌సిటీలో నా బిడ్డలు నిలువనీడ కోసం గొంతెత్తితే, వారిపై ప్రభువులు లాఠీలతో విరుచుకుపడి, నా బిడ్డల రక్తం కండ్ల చూశారు! నా బిడ్డలేం తప్పు చేశారు! గతంలో వారికి ఇండ్ల స్థలాల కోసం పట్టాలు చట్టబద్ధంగానే ఇచ్చారు! పట్టాలో ఉన్న భూమిని ఆక్రమించుకున్న వారినొదిలేసి నా బిడ్డలపై లాఠీఛార్జీ చేశారు! అందుకే నన్ను ఈ భూబకాసురుల నుండి విముక్తి చేయండి ప్రభూ!" అంటూ భూదేవి మహావిష్ణువును వేడుకున్నది!

"దేవేరులారా ! స్థిమిత పడండి! నారదుడు చెప్పినట్లు నేను స్థితి కారకుడినే! కాని కలియుగ మందు కాదు! ఈ యుగమందు ప్రజలే స్థితి కారకులు! ఇంకా సరిగ్గా చెప్పాలంటే, మీమీ బిడ్డలని చెప్పుకున్న రైతులు, కార్మికులు మొదలైన కష్టజీవులే స్థితికారకులు! అంటే చెడును దునుమాడి, మంచిని నిలబెట్టేవారు! కత, త్రేత, ద్వాపర యుగాలల్లో నేను దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేశాను. కలియుగంలో ఒకరి కష్టార్జితాన్ని మరికరు దోచుకుంటున్నారు! ఇదే ఈ యుగపు దుష్టత్వం! తమ రెక్కల కష్టాన్ని దోచుకునే వారిపై కష్టజీవులు తిరగబడటమే శిష్టత్వం! అందువల్ల కష్టజీవులు మాత్రమే ఈ యుగంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చెందుగలవారు! నేను నిమిత్త మాత్రుడను. అందువల్ల మీ బిడ్డలైన కష్టజీవులే మిమ్మల్ని అంటే శ్రీదేవి, భూదేవిలను విముక్తి చేయగలరు! వారు మిమ్మల్ని విముక్తి చేయగా చేసే ప్రయత్నాలు అక్కడక్కడా ప్రారంభించారు! అందులో రామోజీ ఫిల్మ్ సిటీ గేట్ బద్దలు కొట్టడం ఒక మచ్చుతునక మాత్రమే! అయితే మీ బిడ్డల ప్రయత్నాలు ముందుకు పోకుండా బడాబాబులు, భూ బకాసురులు ఎన్నో కుట్రలు చేస్తుంటారు! కులం, మతం, ప్రాంతం లాంటి వాటితో పాటు దేవతలమైన మనల్ని కూడా వాడుకుని మీ బిడ్డలైన కష్టజీవుల మధ్య చిచ్చుబెట్టి విడగొడతారు! దీన్ని తెలుసుకుని కుట్రలను ఛేదించి మిమ్మల్ని విముక్తి చేసే బాధ్యత కష్టజీవులదే! అందులో వారు తప్పక విజయం సాధిస్తారు!" అంటూ మహావిష్ణువు అంతర్థానమయ్యాడు.

- ఉషాకిరణ్

శ్రామిక మహిళలు- కుటుంబ శ్రమ


పద్మశ్రీ
9490098687

హైదరాబాద్ వంటి పట్టణాల్లో రైళ్లు, బస్సులు, మెట్రోలు, ఆటోలు ఇలా ఎక్కడ చూసినా ఒకచేతికి హ్యాండ్ బ్యాగ్, మరొక చేతిలో లంచ్ బ్యాగ్‌తో ఉరుకులు పరుగులతో వెళ్లే మహిళలు రోజూ మనకు కనిపిస్తారు. మున్సిపల్ కార్మిక మహిళల వంటి వాళ్లు పొద్దున్నే సూర్యుడు ఉదయించకముందే సద్ది కట్టుకుని ఇంటి నుండి బయట పడతారు. ఇక ఆస్పత్రులు, స్కూళ్లు, షాపింగ్ మాళ్లు మొదలైనచోట్ల పనిచేసేవాళ్లు ఎనిమిది గంటల కల్లా పని ప్రదేశానికి చేరుకోవాలి. ఐటీలో పనిచేసే వారికి పేరుకి పని గంటలు ఉన్నా అది నామ మాత్రమే. వీళ్లంతా ఏ సమయంలో ఉద్యోగానికి వెళ్లినా ఇంటి పని మొత్తం ముగించుకుని బయటకు వెళ్లాలి. మళ్లీ వచ్చాక కూడా వారే మిగిలిన పనులు చేయాలి. అలాగే రాత్రికి షిఫ్టు చేసే వాళ్ల పరిస్థితి మరింత దుర్భరం.



పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల చదువులు, పెద్దవారి ఆరోగ్యం ఖర్చులు మొదలైన కారణాల రీత్యా పట్టణాలలో మహిళా ఉద్యోగులు, కార్మికులకు సంఖ్య పెరుగుతోంది.ఏ రకమైన ఉద్యోగం చేస్తున్నా, ఉపాధి పొందుతున్నా వీళ్లందరికీ కుటుంబ శ్రమ మాత్రం తప్పట్లేదు. మగవాళ్లతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా అనేక రంగాలలో సమానమైన జీతం, వేతనం పొందట్లేదు. పైగా ఇద్దరూ బయట కష్టపడి ఇంటికొచ్చాక కుటుంబ బాధ్యత మాత్రం మహిళలదే. పుట్టినప్పటి నుండి సమాజంలో చూస్తుండటం వల్ల దురదృష్టవశాత్తు పురుషులే కాదు చాలా మంది మహిళలు కూడా ఇదే భావంతో ఉన్నారు. ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, దానితోపాటు వారు ఇంట్లో, కుటుంబానికి చేసే వంట, కూరగాయలు, సరుకులు తెచ్చుకోవటం, పిల్లల్ని, పెద్దవాళ్లని చూసుకోవటం, ఇల్లు సమర్థించుకోవటం మొదలైన వేతనం లేని శ్రమ కూడా గతం కన్నా పెరుగుతోందని అనేక సర్వే నివేదికలు చెపుతున్నాయి. ఈ శ్రమకి గుర్తింపు కూడా ఉండట్లేదు. జీతం లభించే ఉద్యోగాలలో స్త్రీల పెరుగుదల పురుషులతో పోల్చినప్పుడు తక్కువగా ఉంది. కానీ కుటుంబ శ్రమలో పెరుగుదల మాత్రం పురుషుల కన్నా ఎక్కువగా ఉంది.

భారతదేశంలో 2019-2024 మధ్య వేతనం లభించే పనిలో పాల్గొంటున్న స్త్రీల సంఖ్య 15.5శాతం నుండి18శాతం అంటే 2.5శాతం పెరగగా, పురుషుల్లో ఈ పెరుగుదల 58.1శాతం నుండి 61.2శాతం అంటే 2.9శాతం ఉంది. వేతనం దొరికే శ్రమ అంటే స్వయం ఉపాధి, రెగ్యులర్ ఉద్యోగాలు, కాజువల్, కాంట్రాక్టు, స్కీం వర్కర్స్ మొదలైన వాలందరు ఇందులోకే వస్తారు.వేతనం లేని శ్రమ విషయానికి వస్తే 2019-2024 లెక్కల ప్రకారం పైన ఉదాహరించిన అన్ని కుటుంబ పనులతో పాటు ఇల్లు సర్దటం, బంధువుల్ని చూసుకోవటం, చెత్త చెదారం శుభ్రం చేయటం, అందరికీ భోజనం పెట్టటం, బాక్సులు సర్దటం, మొక్కలు పెంచటం, మొదలైన వేతనం లేని పనులలో (శ్రమ) మహిళల పని పురుషుల కన్నా రెండింతలు పెరిగింది. ఇందులో పిల్లల పెంపకం - అంటే పసిపిల్లలుగా వాళ్ల ఆలనాపాలనా చూడటం దగ్గర నించి స్కూల్‌కి పంపటం, తీసుకుని రావటం, చదివించటం మొదలైన అన్ని పనులు చూడటం, ఇంట్లో ఎవరైనా జబ్బుపడినా, పెద్దవాళ్లు, శారీరక మానసిక వైకల్యం కలిగిన వారు ఉన్నా వారి సంరక్షణ భారం ఎక్కువగా మహిళల పైననే పడుతోంది. ఇక్కడ మహిళలు అంటే ఆదాయంకోసం బయటికి వెళ్లి పనిచేస్తున్న వారు అనే సంగతి మనం గుర్తుంచుకోవాలి.ఈ పరిస్థితి కొద్దీ గొప్ప తేడాతో దేశం మొత్తం మీద ఒకటిగానే ఉంది. 2024 సర్వే నివేదికల ప్రకారం పట్టణాల్లో కుటుంబం పనిలో పురుషులు 20శాతం నుండి 40శాతం భాగం పంచుకుంటుండగా, స్త్రీలు 75శాతం నుండి 85శాతం బాధ్యత మోస్తున్నారు.

ఈశాన్య రాష్ట్రాలు ఇందుకు కొంతమంది మినహాయింపుగా ఉన్నాయి. సిక్కిం, అరుణాచలప్రదేశ్, నాగాలాండ్‌లో పురుషులు ఇంటి పనిలో యాభై శాతం బాధ్యత తీసుకుంటున్నారు. ఈ రాష్ట్రాల తర్వాత వరుసలో 44శాతం కేరళ ముందంజలో ఉంది. అదే మళ్లీ వేతనంతో పని (ఉద్యోగం) చేసే పురుషులు, స్త్రీల సగటును గమనిస్తే, ఇక్కడ కూడా సుమారు అన్ని రాష్ట్రాల్లో ఇంచుమించు ఒకే పరిస్థితి ఉంది. 55శాతం నుండి 65శాతం మంది వేతనంతో కూడిన పని చేస్తుంటే, స్త్రీలు కేవలం 10శాతంనుండి 25శాతం మాత్రమే ఉన్నారు. అందరికన్నా అత్యధికంగా తమిళనాడులో మహిళలు 25శాతం వేతనం వచ్చే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. బీహార్‌లో అత్యల్పంగా 9శాతం మంది, పది శాతంతో ఉత్తరప్రదేశ్ తర్వాత స్థానంలో ఉన్నాయి. తెలంగాణ 24శాతం, హిమాచల్ ప్రదేశ్ 23, కర్నాటక 22తో మెరుగైన స్థానంలో ఉన్నాయి. అయినా సరే ఈ రాష్ట్రాల్లో కూడా ఎనభై శాతం ఇంటిపని ఆడవాళ్లే చేస్తున్నారనేది వాస్తవం.


ఈ మొత్తం సమాచారాన్ని పరిశీలిస్తే మనదేశ పట్టణాల్లో మహిళలు ఇంటా బయటా తీవ్ర పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. పురుషులతో పోలిస్తే వేతనాలు వచ్చే పనుల్లో తక్కువ సంఖ్యలో అవకాశాలు పొందుతున్నారు. ఇంటి పని బాధ్యత మహిళదే అనే పాతకాలపు ఆలోచనలలో పెద్దగా మార్పు లేదు. గ్రామీణ మహిళల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమి లేదు. ఇంకా మరింత అధ్వాన్నంగా ఉంది. పట్టణ మహిళలు చేసే అన్ని పనులతో పాటు వీరు ఇంకా కొన్ని పనులు అధికంగా చెయ్యాల్సి వస్తోంది. సరైన మౌలిక సదుపాయాలు లేనందువల్ల వాళ్లు దూరప్రాంతాల నించి నీళ్లు, వంటచెరుకు మొదలైన నిత్యావసర వస్తువులను తెచ్చుకోవటం మహిళల పనే. మారుమూల ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు తక్కువగ ఉండటంతో వారికి రోజువారీ ఉద్యోగానికి వెళ్లి రావటం కూడా కష్టంతో కూడినదే. పశువుల పోషణలో కూడా స్త్రీలు ఎక్కువ బాధ్యత తీసుకోవలసి వస్తుంది.

2025 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రస్తుతం ప్రపంచంలో మహిళల స్థితిగతుల్ని అంచనా వేసి వారు వందశాతం సమానత్వం సాధించటానికి 2158 వరకూ, అంటే సుమారు మరో ఐదు తరాలు పడుతుందని వెల్లడించింది. మనదేశ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు.

బట్లర్ బాదేశాడు

- ఛేదనలో బట్లర్ అజేయ అర్థ సెంచరీ
- బెంగళూర్‌పై గుజరాత్ టైటాన్స్ గెలుపు

బెంగళూర్ 169/8, గుజరాత్ 170/2



నవతెలంగాణ-బెంగళూర్

జోశ్ బట్లర్ (73 నాటౌట్, 39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సులు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విశ్వరూపం చూపించిన బట్లర్ 31 బంతుల్లోనే అర్థ సెంచరీ బాది గుజరాత్ టైటాన్స్‌కు ఐపీఎల్18లో రెండో విజయాన్ని కట్టబెట్టాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (49, 36 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) సైతం రాణించటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై గుజరాత్ టైటాన్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 170 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ టైటాన్స్ 17.5 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. చిన్నస్వామి పిచ్ స్వభావం దృష్ట్యా ఆరంభంలో ఆచితూచి ఆడిన టైటాన్స్ బ్యాటర్లు చేతిలో వికెట్లు నిలుపుకుని.. మిడిల్ ఓవర్లలో పరుగుల వేట సాగించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (14) నిరాశపరిచినా.. సాయి సుదర్శన్, జోశ్ బట్లర్ జోడీ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. రూథర్‌ఫోర్డ్ (30 నాటౌట్, 18 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) ధనాధన్ మెరుపులతో ఛేదనను మరింత వేగంగా ముగించాడు. పవర్‌ప్లేలో ఒక్క వికెటే పడగొట్టిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బౌలర్లు మిడిల్ ఓవర్లలో వికెట్ల వేటలో విఫలం అయ్యారు. భువనేశ్వర్ కుమార్ (1/23) పొదుపుగా బౌలింగ్ చేసినా ఆశించిన ప్రభావం చూపించలేదు. జోశ్ హాజిల్‌వుడ్ (1/43) ఓ వికెట్ పడగొట్టినా.. యశ్ దయాల్, సలాం, కృనాల్ పాండ్య, లివింగ్‌స్టోన్‌లు మాయ చేయలేకపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. గుజరాత్ టైటాన్స్ పేసర్ మహ్మద్ సిరాజ్ (3/19) మూడు వికెట్లతో నిప్పులు చెరుగా.. స్పిన్నర్ సాయి కిశోర్ (2/22) మాయజాలం ప్రదర్శించాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (14), విరాట్ కోహ్లి (7) సహా దేవదత్ పడిక్కల్ (4) పవర్‌ప్లేలోనే వికెట్లు కోల్పోగా.. కెప్టెన్ రజత్ పాటిదార్ (12) టాప్ ఆర్డర్‌ను అనుసరించి డగౌట్‌కు చేరుకున్నాడు. 42/4తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న బెంగళూర్‌ను లియాం లివింగ్‌స్టోన్ (64, 40 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సులు), వికెట్ కీపర్ జితేశ్ శర్మ (33, 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. ఐదో వికెట్‌కు ఈ జోడీ విలువైన భాగస్వామ్యం నమోదు చేసింది. లివింగ్‌స్టోన్ అర్థ సెంచరీతో కదం తొక్కగా... జితేశ్ శర్మ తనదైన మెరుపులు మెరిపించాడు. ఆఖర్లో టిమ్ డెవిడ్ (32, 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) ధనాధన్ జోరుతో బెంగళూర్ 169 పరుగులైనా చేయగల్గింది. ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్య (5) నిరాశపరిచాడు.



సంజు శాంసన్‌కు లైన్ క్లియర్

పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌కు కెప్టెన్సీ పగ్గాలు

బెంగళూర్ : యువ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా బాధ్యతలు తిరిగి చేపట్టనున్నాడు. చేతి వేలి గాయానికి శస్త్రచికిత్స అనంతరం వికెట్ కీపింగ్‌కు శాంసన్ దూరంగా ఉంటున్నాడు. తాజాగా బెంగళూర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బృందం సంజు శాంసన్‌కు ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో ఏప్రిల్ 5న పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌కు సంజు శాంసన్‌ను రాయల్స్ కెప్టెన్‌గా చూడనున్నాం. తొలి మూడు మ్యాచుల్లో రాయల్స్‌కు రియాన్ పరాగ్ సారథ్యం వహించగా.. సంజు శాంసన్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్ చేశాడు. మూడు మ్యాచుల్లో రెండింట ఓడిన రాజస్థాన్ రాయల్స్ ఓ విజయంతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతుంది.

ముంబయికి జైస్వాల్ గుడ్‌బై

దేశవాళీలో గోవాకు ఆడనున్న యంగ్‌స్టర్



ముంబయి : భారత యువ ఓపెనర్, ముంబయి స్టార్ క్రికెటర్ యశస్వి జైస్వాల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 2025-26 దేశవాళీ సీజన్‌లో గోవా తరఫున బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో ముంబయిని వీడేందుకు యశస్వి జైస్వాల్ ఈమెయిల్ పంపగా.. ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ) వర్గాలు తొలుత ఆశ్చర్యానికి గురైనా, గంట వ్యవధిలోనే నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) మంజూరు చేసినట్టు సమాచారం. 'గోవా జట్టును బలోపేతం చేయటంపై దృష్టి సారించాం. యువ ఆటగాడు యశస్వి జైస్వాల్‌ను సంప్రదించి, గోవా తరఫున ఆడాలని కోరాం' అని గోవా క్రికెట్ సంఘం (జీసీఏ) కార్యదర్శి శంభు దేశాయ్ తెలిపాడు.

యశస్వి జైస్వాల్ (23) అండర్-19 స్థాయి నుంచి ముంబయికి ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. 2019లో ముంబయి తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన జైస్వాల్ పది మ్యాచుల్లో 53.93 సగటుతో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్థ శతకాలు ఉన్నాయి. 2022లో ఉత్తరప్రదేశ్‌పై బాదిన 181 యశస్వి జైస్వాల్ అత్యధిక స్కోరు. 2024-25 రంజీ సీజన్‌లో చివరగా జైస్వాల్ ముంబయికి ఆడాడు. 2023లో వెస్టిండీస్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యశస్వి జైస్వాల్ కెరీర్ తొలి ఇన్నింగ్స్‌లోనే 171 పరుగుల శతకంతో చెలరేగాడు. నిరుడు ఇంగ్లాండ్‌పై 209 పరుగుల ద్వి శతకంతో భారత టెస్టు జట్టులో స్థానం పదిలం చేసుకున్నాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న యశస్వి జైస్వాల్... ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. ముంబైకర్స్ సిద్దేశ్ లాడ్, అర్జున్ టెండూల్కర్ దారిలోనే గోవా తరఫున ఆడేందుకు జైస్వాల్ ముంబయిని వీడాడు. దేశవాళీ దిగ్గజం ముంబయి జట్టులో చోటు దక్కటం అంత సులభం కాదు. రోహిత్ శర్మ, అజింక్య రహానె, సూర్యకుమార్ యాదవ్, పృథ్వీ షా, శ్రేయస్ అయ్యర్ వంటి మేటి ఆటగాళ్లు ముంబయిలో ఉన్నారు. యశస్వి జైస్వాల్‌కు ముంబయి జట్టులో చోటు పదిలం. కానీ గోవా క్రికెట్ అసోసియేషన్ ఆఫర్‌ను యువ బ్యాటర్ తిరస్కరించలేకపోయాడని సమాచారం.

సూర్య, తిలక్‌పై గోవా గురి? : 2024-25 రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ విజేతగా నిలిచిన గోవా.. రానున్న సీజన్‌లో ఎలైట్ గ్రూప్‌లో ఆడనుంది. రంజీ ట్రోఫీలో సంచలన విజయంపై కన్నేసిన గోవా.. స్టార్ క్రికెటర్లను జట్టులోకి తీసుకునే పనిలో పడింది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వర్థమాన స్టార్, హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ సహా పలువురు ప్రపంచశ్రేణి ఆటగాళ్లను తీసుకునేందుకు గోవా క్రికెట్ సంఘం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం పలువురు క్రికెటర్లతో చర్చలు నడుస్తున్నాయని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తానని శంభు దేశాయ్ అన్నారు.

ఆర్చరీ జట్టుకు వీసా కష్టాలు

వరల్డ్‌కప్ పోటీలకు దూరమయ్యే ప్రమాదం



న్యూఢిల్లీ : భారత ఆర్చరీ జట్టు ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 1 పోటీలకు దూరమయ్యే ప్రమాదంలో పడింది. ఏప్రిల్ 8 నుంచి 13 వరకు అమెరికాలోని ఫ్లోరిడాలో ప్రపంచకప్ స్టేజ్ 1 ఈవెంట్ జరుగనుంది. ఈ పోటీలకు 16 మందితో కూడిన భారత జట్టు బృందం వెళ్లాల్సి ఉంది. కానీ 40 రోజులుగా అమెరికా వీసా అపాయింట్‌మెంట్ బుక్ కావటం లేదని భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) బుధవారం వెల్లడించింది. 'గత 40 రోజులుగా వీసా అపాయింట్‌మెంట్ బుక్ చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. వీసా అపాయింట్‌మెంట్ బుక్ చేయడానికి అనూహ్యంగా సిస్టమ్ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం జోక్యం చేసుకోకుంటే భారత ఆర్చరీ జట్టు కీలక టోర్నమెంట్‌కు దూరం కావాల్సిన ప్రమాదంలో పడుతుంది. ఇది భారత ఆర్చర్లకు కోలుకోలేని ఎదురుదెబ్బగా మిగలనుంది' అని భారత ఆర్చరీ సంఘం ఇన్‌స్టాగ్రామ్ వేదిగా తెలిపింది. భారత ఆర్చరీ జట్టులో తెలుగమ్మాయిలు చికిత, జ్యోతి సురేఖ సైతం ఉన్నారు.

వైజాగ్‌లో వన్డే మ్యాచ్

డిసెంబర్ 6న భారత్, సఫారీ ఢీ



ముంబయి : ఈ ఏడాది స్వదేశీ సీజన్‌లో విశాఖపట్నం ఓ వన్డే మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. డిసెంబర్ 6న భారత్, దక్షిణాఫ్రికా ఆఖరు వన్డే మ్యాచ్ విశాఖ తీరంలో జరుగనుంది. ఈ మేరకు 2025-26 స్వదేశీ సీజన్ షెడ్యూల్‌ను బీసీసీఐ బుధవారం విడుదల చేసింది. అక్టోబర్ 2 నుంచి ఆరంభం కానున్న సీజన్‌లో భారత జట్టు వెస్టిండీస్‌తో రెండు టెస్టులు, దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు సహా ఐదు టీ20లు ఆడనుంది. విండీస్ టెస్టులకు అహ్మదాబాద్, కోల్‌కత వేదిక కానుండగా.. సఫారీలతో టెస్టు సిరీస్‌కు న్యూఢిల్లీ, గువహటి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. తొలిసారి గువహటిలో ఓ టెస్టు మ్యాచ్ జరుగనుండగా.. ఇది భారత్‌లో 30వ టెస్టు స్టేడియంగా నిలువనుంది. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు రాంచి, రాయ్‌పూర్, విశాఖలు వేదిక కానుండగా.. టీ20 మ్యాచులు వరుసగా కటక్, చండీగఢ్, ధర్మశాల, లక్నో, అహ్మదాబాద్‌లో జరుగనున్నాయి. ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు ఒక్క మ్యాచ్ సైతం కేటాయించలేదు.

రైజర్స్ పుంజుకుంటారా?

కోల్‌కత, హైదరాబాద్ మ్యాచ్ నేడు



కోల్‌కత : ఐపీఎల్ 2024 ఫైనల్ రీ మ్యాచ్‌కు ఈడెన్‌గార్డెన్స్ వేదిక కానుంది. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్‌తో రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. ఐపీఎల్18లో మూడేసి మ్యాచులు ఆడిన ఇరు జట్లు ఒక్క విజయమే సాధించారు. సన్‌రైజర్స్ దూకుడుతో కూడిన బ్రాండ్ క్రికెట్‌ను కొనసాగించేందుకు ఇక్కట్లు పడుతుండగా.. నైట్‌రైడర్స్ సైతం ఇంకా కుదురుకోలేదు. బౌలింగ్ ఏమాత్రం మెరుగ్గా లేని హైదరాబాద్‌కు బ్యాటర్లు తలనొప్పిగా మారారు. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ మెరుపులు తొలి మ్యాచ్‌కే పరిమితం అయ్యాయి. టాప్ ఆర్డర్‌లో ఈ ముగ్గురు మెరిస్తే నేడు మరో భారీ స్కోరు చూడవచ్చు. హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి నిలకడగా రాణించాల్సిన అవసరం ఉంది. యువ బ్యాటర్ అనికెత్ వర్మ సన్‌రైజర్స్‌కు గొప్ప ఊరట. సిమ్రన్‌జీత్ సింగ్, కమిన్స్, షమి సహా స్పిన్నర్లు తమదైన ప్రదర్శన చేస్తే ఆరెంజ్ ఆర్మీ మళ్లీ గెలుపు బాట పడుతుంది.


హార్దిక్ నం.1

ఐసీసీ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్



దుబాయ్ : ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అగ్రస్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్య 252 పాయింట్లతో వరల్డ్ నం.1 ర్యాంక్ సాధించాడు. బౌలర్ల జాబితాలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 706 పాయింట్లతో మూడో స్థానంలో నిలువగా.. రవి బిష్ణోయ్ (7), అర్షదీప్ సింగ్ (10), అక్షర్ పటేల్ (13) స్థానాల్లో ఉన్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ రెండో స్థానం నిలుపుకోగా.. తిలక్ వర్మ (4), సూర్యకుమార్ యాదవ్ (5) టాప్-5లో కొనసాగుతున్నారు. కివీస్ పేసర్ జాకబ్ డఫ్ఫీ, ఆసీస్ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ బౌలింగ్, బ్యాటింగ్ అగ్రస్థానాల్లో ఉన్నారు.

ఈ సమ్మర్‌లో మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



నితిన్, భరత్

హీరో ప్రదీప్ మాచిరాజు నటించిన తాజా సినిమా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దీనికి నితిన్, భరత్ దర్శకత్వం వహించారు.

మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రంలో దీపికా పిల్లి కథానాయికగా నటించింది. ఈ సినిమా వేసవి కానుకగా ఈనెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా దర్శకులు నితిన్, భరత్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

- మేం టెలివిజన్‌లో డిఫరెంట్ షోస్ చేశాం. అప్పటినుంచి ప్రదీప్ పరిచయం. ఆయనతో చాలా క్రియేటివ్ థాట్స్ షేర్ చేసుకుంటాం. ఒకసారి ఈ కథ ఐడియా చెప్పాం. బావుం దన్నారు. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' పవన్ కళ్యాణ్ సినిమా టైటిల్. ఈ సినిమాకి ఈ టైటిల్ యాప్ట్ అవుతుంది కాబట్టే తీసుకున్నాం. ఇందులో కామెడీ చాలా ఆర్గానిక్‌గా ఉంటుంది. బ్రహ్మానందం, సత్య.. ఇలా పాత్రలన్నీ కథలో ఆర్గానిక్‌గా ఉంటాయి. ఆ పాత్రలను ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు.
- ప్రదీప్, దీపికాపిల్లి అద్భుతంగా నటించారు. మా డిఓపి బాల్ రెడ్డి, మ్యూజిక్ రథన్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. మైత్రి మూవీ మేకర్స్ వారికి సినిమా చాలా నచ్చింది. ఇది సమ్మర్‌కి రావాల్సింది సినిమా అని వారే రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు. ఈ సమ్మర్‌లో ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే సినిమా ఇది. ఖచ్చితంగా అందరిని ఎంటర్టైన్ చేస్తుంది.

నవచిత్రం

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే 'ఫణి'



డైరెక్టర్ డా॥ వీఎస్ ఆదిత్య రూపొందిస్తున్న గ్లోబల్ మూవీ 'ఫణి'. ఈ థ్రిల్లర్ సినిమాను ఓ.ఎం.జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఏయు అండ్ ఐ స్టూడియో సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ కేథరీన్ ట్రెసా లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. మహేశ్ శ్రీరామ్ కీ రోల్ చేస్తున్నారు. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం ఇతర ప్రపంచ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు. బుధవారం ఘనంగా జరిగిన ఈవెంట్‌లో దర్శకేంద్రుడు కె రాఘవేంద్రరావు చేతుల మీదుగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

దర్శకేంద్రుడు కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ, 'ఆదిత్య నా దగ్గర పని చేయలేదు. కానీ నాకు ఇష్టమైన వాడు. వారి సోదరి మీనాక్షి నిర్మాణంలో ఈ సినిమా చేస్తున్నాడు. కేథరీన్ అంటే 'సరైనోడు'లో ఎమ్మెల్యే గుర్తొస్తుంది. ఇందులో ఎలాంటి రోల్‌లో కనిపిస్తుందనే అనేది ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

ప్రొడ్యూసర్, మ్యూజిక్ డైరెక్టర్ డా.మీనాక్షి అనిపిండి మాట్లాడుతూ,'ఈ సినిమాలో కేథరీన్ నటనకు నేషనల్ అవార్డ్ వస్తుంది. ఈ చిత్రంలో ఆమెతో పాటు పాము క్యారెక్టర్ కీలకంగా ఉంటుంది' అని చెప్పారు.

'మా సొంత బ్యానర్‌లో చేస్తున్న సినిమా కావడంతో అన్ని బాధ్యతలు నేనే తీసుకున్నా. దీన్ని చిన్న చిత్రంగా మొదలుపెట్టాం. ఆ తర్వాత కేథరీన్ ఒప్పుకోవడంతో మరో స్థాయికి వెళ్లింది. అలా చివరకు గ్లోబల్ మూవీగా మారింది. త్వరలోనే ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా మీ ముందుకు థియేట్రికల్ రిలీజ్ ద్వారా తీసుకొస్తాం' అని డైరెక్టర్ డా.వీఎస్ ఆదిత్య

ఆశిష్ హీరోగా దిల్‌రాజు 60వ సినిమా



ఆశిష్

శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ 60వ ప్రొడక్షన్‌ని అనౌన్స్ చేశారు. ఈ మూవీలో 'రౌడీ బాయ్స్, లవ్ మీ' చిత్రాలలో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ఆశిష్ హీరోగా నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో ఆదిత్యరావు గంగాసానిని దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు.

ఈ మూవీ హైదరాబాద్ ఓల్డ్ సిటీ నేపథ్యంలో సాగుతుంది. ఆశిష్ లోకల్ కుర్రాడిగా కనిపించనున్నారు. ఈ నేపథ్యం కథకు రగ్గడ్ అండ్ గ్రిట్టీ ఎట్మాస్ఫియర్‌తో ఇంటెన్స్‌ని యాడ్ చేస్తోంది. ఇప్పటికే తన మునుపటి పాత్రలలో వెర్సటాలిటీని ప్రజెంట్ చేసిన ఆశిష్ ఈ చిత్రం కోసం పూర్తిగా మేకోవర్ కానున్నారు. మరింత ఇంటెన్స్, మాస్-ఓరియెంటెడ్ లుక్‌లో కనిపించబోతున్నారు. ఎగ్జైట్‌మెంట్‌ని మరింత పెంచుతూ నిర్మాతలు న్యూట్యాలెంట్ కోసం ముఖ్యంగా హైదరాబాద్ యాసని ఫ్లూయంట్‌గా మాట్లాడే వారి కోసం, కాస్టింగ్ కాల్‌ని అనౌన్స్ చేశారు. ఈ నటీనటుల ఎంపిక అన్ని వయసుల వారికి ఓపెన్‌గా ఉంటుంది. ఇది ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో భాగం కావడానికి గొప్ప అవకాశం అందిస్తుంది. ఈ చిత్రాన్ని హై బడ్జెట్, హై ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో మేకర్స్ నిర్మించబోతున్నారు.

'శారీ' రిలీజ్‌కి రెడీ



సత్య యాదు, ఆరాధ్య దేవి

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ చేసిన కొత్త సినిమా 'శారీ'. ఈ చిత్రంలో సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించారు. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు గిరి కృష్ణ కమల్ రూపొందించారు. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై వ్యాపారవేత్త రవిశంకర్ వర్మ నిర్మించారు.

ఈ సినిమా ఈ నెల 4న తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషలలో పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.

డైరెక్టర్ గిరికృష్ణ కమల్ మాట్లాడుతూ,'రెండు పాత్రలతోనే ప్రధానంగా సాగే ఇంటెన్స్ డ్రామా ఇది. ఆ రెండు క్యారెక్టర్స్‌లో సత్య యాదు, ఆరాధ్య దేవి బాగా నటించారు. వర్మతో వర్క్ చేయడం సంతోషంగా ఉంది' అని అన్నారు. 'సోషల్ మీడియాను మితిమీరి ఉపయోగించడం వల్ల జీవితంలో ఎలాంటి భయంకరమైన పరిస్థితులు ఏర్పడటానికి అవకాశాలు ఉన్నాయి అనే పాయింట్ మీద చేసిన చిత్రమే ఇది. ఈ సినిమాకు నేను మూల కథ అందించాను. నేను చేసిన స్క్రిప్ట్ కంటే చాలా గొప్పగా దర్శకుడు గిరికృష్ణ కమల్ మూవీని రూపొందించాడు' అని డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ చెప్పారు. హీరోయిన్ ఆరాధ్య దేవి మాట్లాడుతూ, 'ఈ సినిమా నాకొక డ్రీమ్ ప్రాజెక్ట్. ఈ పాత్రలో నటించేందుకు కావాల్సినంత ఫ్రీడమ్ ఇచ్చారు డైరెక్టర్ కృష్ణకమల్. ఈ సినిమా మీకు బాగా నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

'కమిటీ కుర్రోళ్లు' సెన్సేషనల్ హిట్ తర్వాత..



2024లో విడుదలైన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో నటి, నిర్మాత నిహారిక కొణిదెల మంచి విజయాన్ని సొంతం చేసుకుని తెలుగు చిత్రపరిశ్రమలో సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా తన మార్క్‌ను క్రియేట్ చేశారు. ఈ సినిమాలో నటించిన నటీనటుల్లో ఎక్కువ మంది కొత్తవారే కావటం విశేషం.

తాజాగా ఆమె తన సొంత నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై రెండో చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు రానున్న రోజుల్లో వెల్లడికానున్నాయి.

ఇది వరకే నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగమయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా.. సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి దర్శకురాలిగా పని చేశారు. తాజాగా ఈ సినిమాతో మానస శర్మ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా అంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రానికి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

మెప్పించే భిన్న కాన్సెప్ట్



రంజిత్ రామ్, అప్సర రాణి

కె.నాగన్న కె.లక్ష్మమ్మ సమర్పణలో టీబీఆర్ సినీ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కె. హరీష్ నిర్మిస్తున్న చిత్రం 'బ్లడ్ రోజెస్'.

ఎల్లప్ప కో ప్రొడ్యూసర్. ఎంజీఆర్ దీనికి రచయిత, దర్శకుడు. ఈ చిత్రం గురించి డైరెక్టర్ ఎంజీఆర్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో రంజిత్ రామ్, అప్సర రాణి చక్కగా నటించారు. శ్రీలు, క్రాంతి కిల్లి కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మణికుమార్ ద్వారా ఈ సినిమా చేసే అవకాశం వచ్చింది. కో ప్రొడ్యూసర్ ఎల్లప్ప సహకారం మరువలేనిది, నిర్మాత హరీష్ అభిరుచిగల ప్రొడ్యూసర్. సినిమాను రిచ్‌గా మంచి ప్రొడక్షన్ వ్యాల్యూస్‌లో నిర్మించారు' అని అన్నారు.

'సినిమా బాగా వచ్చింది. ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తీసిన ఈ సినిమా ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది' అని నిర్మాత హరీష్ కె చెప్పారు.

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మణికుమార్ మాట్లాడుతూ,'నిర్మాత హరీష్ నాకు మంచి మిత్రుడు. మంచి సినిమా చేయాలనే ఆలోచనతో ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాం. ఈ సినిమా అందరికి నచ్చే సినిమా అవుతుంది. త్వరలో రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం' అని తెలిపారు.

'కర్నాటకలో నేను కొన్ని సినిమాలు చేశాను. మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని హీరో రంజిత్ రామ్ చెప్పారు. హీరోయిన్ అప్సర రాణి మాట్లాడుతూ,' ఈ సినిమా నాకు కొత్త జోనర్. డైరెక్టర్ ఎంజీఆర్ డిఫరెంట్ కథతో ఆడియన్స్ ముందుకు వస్తున్నారు' అని అన్నారు.

విడుదల రోజు ఉచిత ప్రదర్శన



భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు భగవంతుని చేరే మార్గాలు. భక్తికి ఫలం జ్ఞానం, జ్ఞానం ద్వారా మనిషిలో దైవత్వం నిండుతుంది. మనసుకి శాంతి, ఆత్మకు శక్తి నింపే భక్తిరస చిత్రం 'శివాజ్ఞ'. సీనియర్ నటుడు భానుచందర్ అతిథి పాత్రలో నటించిన ఈ సినిమా ఈనెల 4న విడుదల కానుంది. శివ పరమాత్మ జ్ఞాన మందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో శివపరమాత్మ క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమా ఆధ్యాత్మికతతో కూడిన కథాంశంతో రూపొందింది.

ఆంధ్ర, తెలంగాణలోని 108 థియేటర్లలో మొదటి రోజు మొదటి నాలుగు ఆటలు ఈ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించనున్నారు. ఈ సినిమా ఆధ్యాత్మికతతో పాటు కుటుంబ కథాంశాన్ని కూడా సమన్వయం చేస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది. ప్రేక్షకులకు ఒక కొత్త ఆధ్యాత్మిక అనుభవాన్ని అందించేందుకు ఈ సినిమా ఈనెల 4న థియేటర్స్‌లోకి రాబోతోందని మేకర్స్ తెలిపారు.

వెంకట్ గోవాడ, అక్షిత వేముగంటి, కిరణ్, హర్షిణి, మాధవి, శ్రీనివాస్, శరత్, ప్రభావతి, జ్యోతి రాజ్, బ్రహ్మ కుమారి సిస్టర్ దీప్తి, హేమసుందర్ తదితరులు ఇందులోని ప్రధాన తారాగణం. కాగా శ్రీలక్ష్మి, తేజస్విని, అద్దేపల్లి శివ, విష్ణు తేజ, వర్ణ వంటి బాలనటీనటులు కీలక పాత్రలు పోషించారు.



15 రోజుల్లో సహాయక చర్యలు పూర్తి

రెండున్నర ఏండ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యల పర్యవేక్షణ

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మృతిచెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, సహాయక చర్యలు మరో 15 రోజుల్లో పూర్తవుతా యని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంటలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను బుధవారం మంత్రి సందర్శిం చారు. సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. సహాయక చర్యల గురించి ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంత్రికి వివరించారు. సొరంగంలో చిక్కుకున్న వారి ఆనవాళ్లు తెలుసుకునేందుకు కేరళకు చెందిన కడావర్ డాగ్స్ సేవలను ఉపయోగించుకుంటున్నట్టు వివరించారు. టన్నెల్‌లో సహాయక చర్యలు 15 రోజుల్లో పూర్తికానున్నట్టు మంత్రి తెలిపారు. మరో 105 -110 మీటర్ల మేర తవ్వకాలు పూర్తయితే సమస్య ఓ కొలిక్కి వస్తుందని తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 250 మీటర్ల మేర రాళ్లు, మట్టి, బురద కారణంగా సహాయక చర్యలకు అడ్డంకి ఏర్పడినట్టు చెప్పారు. ప్రస్తుతం సుమారు 550-560 మంది అత్యాధునిక పరికరాలతో సహాయక చర్యలను కొనసాగిస్తున్నా రన్నారు. టన్నెల్‌లో భారీ డ్రిల్లింగ్ యంత్రానికి ఇనుము, ఇతర వస్తువులు అతుక్కుపోవడం వల్ల బురద తొలగింపు కష్టంగా ఉందన్నారు. డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, ప్రత్యేక పర్యవేక్షణాధికారి శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నత అధికారులు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ పనులు చేయిస్తున్నారన్నారు. జలయజ్ఞంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును ఇందిరమ్మ ప్రభుత్వం రెండున్నరేండ్లలో పూర్తి చేయనున్నట్టు తెలిపారు. తద్వారా నల్లగొండ - ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేసే కృష్ణానది జలాలు అందుబాటు లోకి తీసుకొచ్చామన్నారు. ఈ సమావేశంలో, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి డాక్టర్ హరీష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి జయప్రకాష్, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి, నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసులు, ర్యాట్ హెూల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, జీఎస్ఐ అధికారులు రాజశేఖర్, కడావర్ డాగ్స్ ప్రతినిధి ప్రభాత్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మహనీయుల సేవలు మరిచిపోవద్దు

వారి ఆశయాలు కొనసాగించాలి : మంత్రి ధనసరి అనసూయ సీతక్క

ములుగులో సర్దార్ సర్వాయి పాపన్న 315 వ వర్ధంతి సభ

నవతెలంగాణ-ములుగు

దేశం కోసం, పేద, పీడిత వర్గాల కోసం అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుల సేవలను మరిచిపోవద్దని, వారి ఆశయ సాధనను కొనసాగించాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవిచందర్‌తో కలసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి సర్దార్ పాపన్న అని కొనియాడారు. మహనీయుల చరిత్రను భావితరాల వారికి అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహనీయులను ఆదర్శంగా తీసుకునే సీఎం బీసీలకు 42 శాతం రాజకీయ, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలో ధర్నా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మొగలు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో సర్దార్ పాపన్న ముందుండి పోరాడారని తెలిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పాపన్న ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ పూనుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, గౌడ సంఘం సభ్యులు రాజేందర్ గౌడ్, బండి శ్రీనివాస్ గౌడ్, ముంజాల భిక్షపతి గౌడ్, కునూరు అశోక్ , ముసినపెల్లి కుమార్ గౌడ్, గౌడ కుల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రియల్ రంగంపై మాస్టర్ ప్లాన్ దెబ్బ

నిలిచిన 'లే అవుట్ల' పర్మిషన్లు

రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో పర్మిషన్లు ఇవ్వలేమంటున్న డీటీసీపీ

మాస్టర్ ప్లాన్‌తోనే పర్మిషన్లు : హెచ్‌ఎమ్‌డీఏ

మరో ఏడాది వరకు ఇదే పరిస్థితి


ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు





నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

హెచ్‌ఎమ్‌డీఏను విస్తరిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో రియల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో భూములు కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు 'లే అవుట్లకు' సిద్ధమయ్యారు. పర్మిషన్ల కోసం డీటీసీపీకి వెళ్లితే.. రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న భూములకు, తమకు సంబంధం లేదని అధికారులు చెబుతున్నారు. హెచ్‌ఎమ్‌డీఏ అధికారుల వద్దకు వెళ్లితే ప్రస్తుతానికి తాము పర్మిషన్లు ఇచ్చే పరిస్థితి లేదని, మాస్టర్ ప్లాన్ రెడీ అయితేనే పర్మిషన్లు అంటోంది. దాంతో రియల్ వ్యాపారులకు దిక్కుతోచడం లేదు. ఇటు డీటీసీపీ పర్మిషన్లు ఇవ్వక.. అటు హెచ్‌ఎమ్‌డీఏ అనుమతులు రాకపోవడంతో రియల్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే రియల్ ఎస్టేట్ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం లేకపోలేదు. దీని ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడుతుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనికి తాత్కాలిక ఉపశమనం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని రియల్ వ్యాపారులు కోరుతున్నారు. హెచ్‌ఎమ్‌డీఏ (హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) విస్తరణలో భాగంగా ప్రభుత్వం ఇటీవల రీజినల్ రింగ్ రోడ్డు వరకు 7 నుంచి 11 జిల్లాల వరకు హెచ్‌ఎమ్‌డీఏను విస్తరిస్తూ ప్రభుత్వం జీవో తీసుకువచ్చింది. ప్రస్తుతం 104 మండలాల పరిధిలోని 1,355 గ్రామాల్లో హెచ్‌ఎమ్‌డీఏ పరిధి విస్తరించనుంది. 2050 విజన్ అంటూ మరో 25 ఏండ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తోంది. ఈ పనిని ప్రత్యేకంగా ఒక కంపెనీకి అప్పగించింది. అయితే ఈ మాస్టర్ ప్లాన్ రెడీ అయ్యేందుకు ఏడాది కాలం పట్టొచ్చు. ఇదిలా ఉంటే ప్రభుత్వం హెచ్‌ఎమ్‌డీఏ విస్తరణపై జీవో ఇవ్వడంతో రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న ప్రాంతమంతా హెచ్‌ఎమ్‌డీఏ పరిధిలోకి వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రీజినల్ రింగ్ రోడ్డు ప్రాంతంలోని గ్రామీణ ప్రాంతాల్లో లే అవుట్లకు డీటీసీపీ పర్మిషన్లు ఇవ్వలేమని డీటీసీపీ అధికారుల రియల్ వ్యాపారులకు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు వరకు హెచ్‌ఎమ్‌డీఏ పరిధిని విస్తరిస్తూ నిర్ణయం తీసుకుంది.. ఇక 'మా పరిధిలో లేదు.. డీటీసీపీ లే అవుట్లకు పర్మిషన్ ఇవ్వలేం. హెచ్‌ఎమ్‌డీఏకి వెళ్లాలి' అని డీటీసీపీ అధికారులు చెబుతున్నారు. అదే ఫైల్ పట్టుకుని పర్మిషన్లు ఇవ్వండని హెచ్‌ఎమ్ఎడీఏ అధికారులను అడిగితే.. ఇప్పట్లో ఈ ప్రాంతంలోని లే అవుట్లకు పర్మిషన్లు ఇవ్వలేమని చెబుతున్నారు. మాస్టర్ ప్లాన్ పూర్తి అయితే తప్ప లే అవుట్ పర్మిషన్లు ఇవ్వడానికి కుదరదని చెబుతున్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం హెచ్‌ఎమ్‌డీఏ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు, లే అవుట్లు వేయాలన్న హెచ్‌ఎమ్‌డీఏ మాస్టర్ ప్లాన్ ఆధారంగా పర్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే దీనికి ఏడాది కాలం పట్టొచ్చని అధికారిక వర్గాల సమాచారం. రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో వెంచర్లు చేయడం కష్టంగా మారింది.



రాష్ట్ర ఖజానాకు గండి

రాష్ట్రం ఖజానాకు అత్యధికంగా ఆదాయన్ని సమకూర్చే రంగాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఒకటి. ప్రస్తుత నిర్ణయంతో ఆ ప్రభావం రియల్ రంగంపై పడనుంది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీస్తుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో హెచ్‌ఎమ్‌డీఏ విస్తరణ.. లే అవుట్ల పర్మిషన్ల విషయంలో కొత్త పంచా యతీ తెరమీదికి రావడంతో ప్రభుత్వ ఆదాయానికీ గండి పడుతుందని వ్యాపార నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం అంతవరకు తెచ్చుకుంటుందని తాము అనుకోవడం లేదని వారంటున్నారు.

రియల్ వ్యాపారుల్లో ఆందోళన

రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల ప్రాంతంలో ఇప్పటికే భూములు కొనుగోలు చేసి.. వెంచర్లు వేయడానికి సిద్ధమైన రియల్ వ్యాపారులకు హెచ్‌ఎమ్‌డీఏ విస్తరణ ప్రక్రియ గుదిబండగా మారిందని వారు అంటున్నారు. అన్ని సిద్ధం చేసుకుని లే అవుట్ పర్మిషన్ కోసం డీటీసీపీకి వెళ్లితే ఇప్పుడు అక్కడ పర్మిషన్లు ఇవ్వడానికి తమకు అధికారం లేదని చెప్పడం..హెచ్‌ఎమ్‌డీఏ ఆఫీసుకు వెళ్లితే మాస్టర్ ప్లాన్ రెడీ అయ్యే వరకూ పర్మిషన్లు ఇవ్వలేమని చెప్పడంతో రియల్ వ్యాపారులు అయోమయంలో పడ్డారు. దీనికి ప్రభుత్వమే మార్గం చూపాలని కోరుతున్నారు.

శాంతి చర్చలకు మేము సిద్ధం

సీపీఐ(మావోయిస్టు) అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదల

కగార్ పేరుతో వివిధ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యకాండను నిలిపివేయాలి

సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలంటూ ప్రతిపాదనలు

నవతెలంగాణ-చర్ల

మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలనే అంశంపై మార్చి 24న హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించగా.. దీన్ని తాము స్వాగతిస్తున్నామని, శాంతి చర్చల పట్ల తమ పార్టీ వైఖరిని తెలియజేస్తున్నామని సీపీఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విలేకరులకు ఒక లేఖ విడుదలయింది.

ఆ లేఖలో.. "2024 జనవరిలో.. కేంద్రంలోని బ్రాహ్మణీయ, హిందుత్వ, ఫాసిస్టు ప్రభుత్వం, విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 'కగార్' పేరుతో విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాల ప్రజలపై ప్రతిఘాతక యుద్ధాన్ని ప్రారంభించాయని పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రజల్ని మోసగించడానికి ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి విజయ్ శర్మ.. తమ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపడానికి సిద్ధమేనని, మావోయిస్టులు చర్చలకు రావాలని పదే పదే ప్రకటనలు చేశారన్నారు. ఆ సందర్భంగా తమ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ వికల్ప్.. రెండు సార్లు తమ పార్టీ శాంతి చర్చలకు సిద్ధమేనని తెలియజేశారని తెలిపారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం, 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్‌లకే పరిమితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును నిలిపివేయాలని తమ పార్టీ ప్రతిపాదన చేసిందన్నారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నింటా, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయన్నారు. ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయిల కమాండర్లు, సభ్యులతో పాటు సాధారణ ఆదివాసీ ప్రజలను హత్య చేశారని పేర్కొన్నారు. వేలాది మందిని అరెస్టు చేసి అక్రమ కేసులు మోపి జైళ్ల పాలు చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారమే సాధారణ ప్రజానీకాన్ని హత్య చేస్తున్నాయని అన్నారు. మహిళా కామ్రేడ్స్‌పై సామూహిక లైంగికదాడికి పాల్పడి హత్య చేశారని, అందుకే ఈ యుద్ధాన్ని నరసంహారం (జీనోసైడ్) అంటున్నామని తెలిపారు. ఈ యుద్ధంలో కేంద్ర ప్రభుత్వం కమాండో బలగాల ముసుగులో భారత సైన్యాన్ని మోహరించిందని, విప్లవోద్యమ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించకుండానే అంతర్గత భద్రత కోసం సైన్యాన్ని ఉపయోగించడం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొన్నారు. ప్రజాపక్ష మేధావులపై భీమా కోరేగావ్ కుట్ర కేసును మోపి జైళ్లో బంధించాయన్నారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో ఆదివాసీ యువతి, యువకులను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకుని వారిచేతనే ఆదివాసీలను హత్యలు చేయిస్తున్నాయన్నారు. ఈ స్థితిలో ప్రజల ప్రయోజనాల కోసం మేము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే. అందుకే శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదన చేస్తున్నామని పేర్కొన్నారు.అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలీ), ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యకాండలను, నరసంహారాన్ని నిలిపివేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలని ప్రతిపాదిస్తున్నామన్నారు.



మావోయిస్టు రేణుకకు కడవెండి కన్నీటి వీడ్కోలు

అంతిమయాత్రలో అడుగడుగున జననీరాజనం..

మూగబోయిన ఉద్యమాల పురిటిగడ్డ

రేణుక మృతదేహానికి నివాళులు అర్పించిన ప్రజా సంఘాలు, అభిమానులు, మేధావులు, మాజీ మావోయిస్టులు

నవతెలంగాణ-దేవరుప్పుల

చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు స్పెషల్ జోన్ కమిటీ రాష్ట్ర నాయకులు గుమ్మడవెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ చైతు అలియాస్ సరస్వతికి జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. మంగళవారం అర్ధ రాత్రి కడవెండి గ్రామానికి చేరుకున్న రేణుక మృతదేహాన్ని చూసి కడవెండి గ్రామ ప్రజలంతా కన్నీటితో స్వాగతం పలుకుతూనే తన జీవిత ప్రస్థానాన్ని నెమరు వేసుకున్నారు. బుధవారం రేణుక మృతదేహానికి విప్లవ సంఘాల నాయకులు, నాయకులు, అభిమానులు, విప్లవ రచయితల సంఘం నాయ కులు, మాజీ మావోయిస్టులు ఘనంగా నివాళులు అర్పించారు. అంతిమ యాత్రలో దేవరప్పుల మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించా రు. రేణుక అంతిమయాత్రలో అడుగడుగున జనం నీరాజనం పలుకుతూ.. పాలకవర్గాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రేణుక స్ఫూర్తిని కొనసాగిస్తా మని ప్రతినబూనారు. అంతిమయాత్రలో ఐదు వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నివాళులు

కడవెండి గ్రామంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు స్థానిక టీఆర్ఎస్ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేణుక ఉన్నత చదువులు చదివినా.. నేడు విగతజీవిగా చూడటం బాధాకరమన్నారు. పదేండ్లలో ఏ ఒక్క ఎన్‌కౌంటర్ జరగలేదని, పక్క రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి నిలువరించాలని కోరారు. కాగా, అక్కడే ఉన్న విప్లవ, ఉద్యమకారులు.. పాలకులు ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ నిలదీశారు. వర్గాలకు ఇక్కడ స్థానం లేదని, వెంటనే వెళ్లి పోవాలని కోరారు.

రేణుక చితికి నిప్పటించిన కుటుంబ సభ్యులు..

కడవండి శ్మశాన వాటికలో రేణుక చితికి తల్లిదండ్రులు గుమ్మడవెల్లి సోమయ్య జయమ్మ, తోడబుట్టిన అన్నలు గుమ్మడవెల్లి వెంకట కిషన్ ప్రసాద్ అలియాస్ ఉసేండి, రాజశేఖర్‌తో పాటు కుటుంబ సభ్యులు నిప్పు అంటించి తుది వీడ్కోలు పలికారు. రేణుక అంతిమయాత్రలో బంధు మిత్రుల సంఘం అధ్యక్షురాలు పద్మ కుమారి, పౌర హక్కుల సంఘం అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్, శాంతక్క, విరసం నాయకులు పాణి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు అనురాధ, కళ, మొగిలిచర్ల భారతక్క, గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, గద్దర్ కొడుకు సూర్యం, వరవరరావు కూతుర్లు అనల, సహజ, పవన, ఉస్మానియా విద్యార్థి నాయకులు పృథ్వీ, స్టాలిన్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సుదర్శన్, ఇప్ప రాంరెడ్డి, మా భూమి సంధ్య, వేముల పుష్ప, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా కళామండలి కళాకారులు జర్నలిస్టు నాయకులు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, తెలంగాణ ఉద్యమకారుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి క్వారీలో ఇద్దరు విద్యార్థులు మృతి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో మునిగిపోయి మృతిచెందారు. ఈ ఘటన బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజ్ఞాన ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న గంధ జయను(18), బొడ్డు శ్యామ్‌చరణ్(18) మరో ఇద్దరి స్నేహితులతో కలిసి దేశ్‌ముఖ్ గ్రామ పరిధిలోని ఓ క్వారీలో ఈత కొట్టేందుకు మధ్యాహ్నాం వెళ్లారు. అయితే, శ్యామ్‌చరణ్, గంధ జయనుకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగారు. మిగతా ఇద్దరు విద్యార్థులు ఒడ్డుకు చేరారు. కాలేజీ యాజమాన్యానికి సమాచారం అందించగా, యాజమాన్యం పోలీసులకు తెలియ జేసింది. పోలీసులు ఘటనాస్థలం వద్దకు చేరుకుని మృతదేహాల కోసం గాలిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

రాష్ట్రంలో తగ్గిన ఉష్ణోగ్రతలు

భద్రాచలంలో అత్యధికంగా 39.4 డిగ్రీలు

ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగండ్ల వర్ష సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీల మేర తగ్గాయి. బుధవారం భద్రాచలంలో అత్యధికంగా 39.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. గురువారం ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందనీ, అక్కడక్కడా వడగండ్లు కూడా పడొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే సూచనలున్నాయి. ఈ మేరకు వాతావరణ శాఖ ఆ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటెండ్రు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడొచ్చు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల వరకు, కనిష్ట ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముంది.

నాలుగు విభాగాలకు అధిపతుల్లేరు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిలో కీలక పోస్టులు ఖాళీ

ప్రభుత్వ ఆదేశాలతో తప్పుకున్న ఉన్నతస్థాయి అధికారులు

రిటైర్డ్ ఉద్యోగులకు స్వస్తి నిర్ణయంతో ఈ పరిస్థితి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ పరిపాలనా వ్యవస్థ నిర్వహణలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కీలకమైనది. మిషన్‌భగీరథ ఈఎన్సీ, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి, స్త్రీనిధి ఎమ్‌డీ, పంచాయతీరాజ్ శాఖలో మరో ఉన్నతాధికారి పోస్టులు ప్రస్తుతం ఖాళీగా దర్శమిస్తున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీలోపు రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్నవారు తప్పనిసరిగా తప్పుకోవాలని రాష్ట్ర సర్కారు ఈ నెల 28న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖలో నాలుగు విభాగాలకు సంబంధించిన నలుగురు ఉన్నతాధికారులను విధుల్లో నుంచి తప్పుకోవాలని రాష్ట్ర సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్, స్త్రీనిధి ఎమ్‌డీ విద్యాసాగర్‌రెడ్డి, మరో ఉన్నతాధికారి తమ విధుల నుంచి తప్పుకున్నారు. వీరిలో కృపాకర్‌రెడ్డి రెడ్డి పదవీకాలం ఈ ఏడాది అక్టోబర్ వరకు ఉంది. విద్యాసాగర్‌రెడ్డి రిటైర్డ్ కావడానికి మరో ఏడాది సమయముంది. అయినా, వీరిని ఎందుకు తప్పించారన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సీఎం ఆదేశాల మేరకు వీరిద్దరిని తప్పించినట్టు, తదుపరి క్లారిటీ వచ్చేంతవరకు పోస్టు ఇవ్వకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. పంచాయతీరాజ్ ఈఎన్సీ కనకరత్నం మార్చి 31న రిటైర్డ్ అయ్యారు. ఇప్పుడు ఆ పోస్టుల్లో ఎవరిని నియమిస్తారనే దానిపై ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి క్లారిటీ లేదు. తాత్కాలికంగా ఇన్‌చార్జులను కూడా నియమించలేదు. వారిని తొలగించాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన సీఎం... నియామకాలపై మాత్రం ఇప్పటివరకు గైడ్‌లైన్స్ ఇవ్వలేదు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో కీలకమైన నాలుగు విభాగాలకు శాఖాధిపతులు లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశమున్నది. అసలే వేసవి కాలం. రాష్ట్రంలో తాగునీటి కొరత ఉన్నది. ఈ సమయంలో మిషన్‌భగీరథకు పెద్ద దిక్కు లేకపోతే ఏదైనా సమస్య వస్తే ఎలా ఎదుర్కోవాలనే ఆందోళనలో మిషన్‌భగీరథ అధికారులున్నారు. రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి ఇప్పటికే ఏడాది దాటిపోయింది. దీంతో పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా ఆగిపోయాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి అనివార్యంగా మారింది. జూన్, జులైలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే యోచనకు రాష్ట్ర సర్కారు వచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లేకపోతే ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఇబ్బందులు తప్పవా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో హ్యామ్ పద్ధతిలో కింద వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లను వేయించాలని నిర్ణయించినట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. దాంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరముంది. ఇలాంటి తరుణంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగానికి అధిపతి లేకపోతే ఎలా పనులవుతాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆయా శాఖలకు అధిపతులు లేకపోవడం వల్ల నివేదికలు, కీలకమైన సమాచారం ఇటు సీఎంకు, అటు ఉన్నతాధికారులకు ఎలా పంపుతారనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి.

ఊరుకొండ ఘటనలో నిందితుల రిమాండ్

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ

వివరాలు వెల్లడించిన ఎస్పీ వైభవ్ గైక్వాడ్

నవతెలంగాణ -కల్వకుర్తి

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఊరుకొండ మండలంలోని ఊరుకొండపేటలో ఈనెల 29న వివాహితపై జరిగిన సామూహిక లైంగికదాడి ఘటనలో ఏడుగురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ బుధవారం కల్వకుర్తిలో మీడియా సమావేశంలో వెల్లడించారు. 29న కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామి దేవాలయానికి వచ్చిన బాధిత మహిళ.. ఆ తర్వాత కాలకృత్యాల కోసం సమీప ప్రాంతానికి వెళ్లిందన్నారు. అది గమనించిన నలుగురు దుండగులు ఆమెను లాక్కెళ్తుండగా వెంట ఉన్న బంధువు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అతన్ని చెట్టుకు కట్టేశారని తెలిపారు. తర్వాత ఆమెపై ఆ నలుగురితోపాటు మరో ముగ్గురు కలిసి లైంగికదాడి చేశారన్నారు. వివాహిత, బంధువు వద్ద ఉన్న రూ.6 వేల నగదు తీసుకున్నారని చెప్పారు. విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ వారిని బెదిరించారన్నారు. దాంతో భయ పడిన బాధితులు మరుసటి రోజు కాకుండా సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎస్ఐ కృష్ణదేవరాయ, సిబ్బంది కేసు దర్యాప్తు చేశారన్నారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశామన్నారు. నిందితులందరూ 20 నుంచి 28 ఏండ్ల వయస్సు వారేనని, వారిలో ఇద్దరికి మాత్రమే వివాహం అయిందని తెలిపారు. నిందితులపై లైంగిక దాడి, దోపిడీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్పీ వెల్లడించారు. నిందితులు ఏడుగురు ఊరుకొండపేట గ్రామానికి చెందిన వారేనని, మహేష్ గౌడ్, హరీష్ గౌడ్, అంజిగౌడ్, మట్ట ఆంజనేయులు గౌడ్, మణికంఠ గౌడ్, సాదిక్ బాబా, ఎల్లికట్ల కార్తీక్ గౌడ్‌ను రిమాండ్‌కు తరలించామని అన్నారు.

బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

రౌడి షీటర్లకు అవగాహన కల్పించిన డీసీపీ సునీతా రెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ సునీతా రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ సునీతా రెడ్డి బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పలు కాలనీలలో నివాసం ఉంటున్న రౌడీ షీటర్లకు అవగాహన కల్పించారు. తర్వాత డీసీపీ మాట్లాడుతూ సమాజంలో సత్ప్రవర్తనతో మానవతా హృదయంతో పేద ప్రజలకు సేవ చేయడంతో రౌడీ షీటర్లకు ఉన్న చెడ్డ పేరు పోతుందని తెలిపారు. డీసీపీ వెంట మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎం. సుధాకర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో హ్యూమన్ రైట్ సెమినార్



నవతెలంగాణ-ఎల్బీనగర్

దిల్‌సుఖ్‌నగర్‌లో కోదండరా కమ్యూనిటీ హాల్లో హ్యూమన్ రైట్స్ సెమినార్‌ను బుధవారం నిర్వహించినారు. శశికల ఆధ్వర్యంలో మెగా లీగల్ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో సమాజంలో పౌరుల హక్కుల గురించి వివరించారు. లీగల్ పాయింట్స్ తెలియజేయడం జరిగింది. ఈ సమావేశంలో శశికళ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నేషనల్ ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ అయ్యప్ప అరుణాచలము, నేషనల్ బోర్డ్ మెంబర్ జయంతి రవి, తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ విమెన్ వింగ్ డాక్టర్ శ్రీలత, తెలంగాణ చీఫ్ సెక్రటరీ రవీందర్, రామచంద్ర, తెలంగాణ స్టేట్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్స్, కొత్తగా జాయిన్ అయిన మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములపై

అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి



సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-చంపాపేట్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి, తీర్మానం చేయాలని సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని ఐఎస్‌సదన్ డివిజన్ చౌరస్తా వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. విఠల్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అక్రమ అమ్మకానికి పెట్టి ఒక్క అంగుళం కూడా యూనివర్సిటీ స్థలంలోకి రాదనడం శోచనీయమన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను అమ్మొద్దని ఈ నెల 1న యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నా చేస్తే పోలీసులు అక్రమంగా అరెస్టులు చేసి సాయంత్రం 6 గంటల వరకు పోలీస్ స్టేషన్లో మన్నించడం అన్యాయం అన్నారు. నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టామని తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మీనా, ఎం. శ్రావణ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలు నాయక్, 5వ జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మమ్మ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్ మాట్లాడారు. యూనివర్సిటీ వాతావరణాన్ని, పర్యావరణాన్ని నాశనం చేయాలని చూస్తే.. విద్యార్థులను, యూనివర్సిటీ కార్మికులను ఏకం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అఖిలపక్ష పార్టీలను పిలిపించి సమావేశం నిర్వహించి సరైనటువంటి నిర్ణయం తీసుకొని తీర్మానించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ నాయకులు ఎం. బాలు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామ్ కుమార్, నాయక్, మహమూద్ అలీ, నసీర్ భాయ్, మహారాజ్ బేగం, కిషన్, జంగయ్య అలీముద్దీన్ పాల్గొన్నారు.

జలమండలికి వరల్డ్ వాటర్ అవార్డు





నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిని వరల్డ్ వాటర్ అవార్డు వరించింది. వాటర్ డైజెస్ట్ అనే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 2024-2025 సంవత్సరానికి వరల్డ్ వాటర్ అవార్డ్స్‌లో జలమండలికి గవర్నమెంట్ కేటగిరీలో ఉత్తమ ఎస్టీపీ అవార్డు లభించింది. యునెస్కో భాగస్వామ్యంతో నిర్వహించిన 19వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డ్స్ (2024-2025) సంవత్సరానికి ఎస్టీపీ/ మురుగు నీటి శుద్ధి అవార్డు లభించింది. ఈ అవార్డును జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ ప్రధాన కార్యాలయంలోని మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్‌లకు బుధవారం అందజేశారు. ఈ అవార్డు రావడంపై ఎండీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో అందరికీ తాగు నీరు అందించడంతో పాటు.. ఉత్పన్నమయ్యే మురుగును శుద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాగోల్ 320 ఎమ్మెల్డిల ఎస్టీపీ పర్యావరణ అనుకూలత, సమర్థవంతమైన మురుగు నీటి శుద్ధి మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విశేష ప్రాముఖ్యతను చూపినందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. మురుగు శుద్ధి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం, మరియు సమాజానికి పరిశుభ్రమైన.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. అలాగే అధునాతన నీటి నిర్వహణ, సర్క్యులార్ ఎకానమీ విధానాలు, మురుగు నీటి పునర్వినియోగం వంటి అంశాలలో చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది. నాగోల్ ఎస్టీపీ మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో పెద్ద ప్లాంట్ ప్రసిద్ధి చెందింది. చాదర్ ఘాట్ నుంచి ప్రారంభమయ్యే మురుగు నీరు.. నగరం లోని వివిధ ప్రాంతాల్లోని ఎన్నో నాలాలను కలు పుకుంటూ నాగోల్ వద్దకు చేరుకుంటుంది. ఇక్కడ నిర్మించిన ప్లాంట్ ద్వారా నిత్యం 320 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం మార్చ్ 31న ఢిల్లీలో జరిగిం ది. జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, డైరెక్టర్ (ప్రాజెక్ట్)-క్ష్మీ సుదర్శన్ ఈ పుర స్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ సీజీఎంలు పద్మజ, సుజాత, జీఎం కుమార్, డీజీఎం నిరుపమ మేనేజర్లు పాల్గొన్నారు.

రూ.219 కోట్ల ట్రైకార్

బకాయి రుణాలు విడుదల చేయాలి



గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్

నవతెలంగాణ-ఎల్బీనగర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ట్రైకార్ బకాయి రుణాలు 219 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. జేఏసీ ఆధ్వర్యంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ నాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మూడావత్ గోపి నాయక్‌ల అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండల కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులకు సంబంధించిన ట్రైకార్ 2019-2020-2021లో 30 వేల మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం గుర్తించి 219 కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఆ బకాయిలు క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ఈ నిధులు నేటికీ విడుదల చేయకుండా ప్రభుత్వం గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే గిరిజనులకు కేటాయించిన 219 కోట్ల రూపాయల బకాయి రుణాలను విడుదల చేసి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ 30 వేల మంది లబ్ధిదారులు ఇతర ఏ రుణాలకు దరఖాస్తు చేసినా ఆన్‌లైన్‌లో రిజెక్ట్ అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం సత్వరమే 219 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి ఈ 30 వేల మంది లబ్ధిదారులకు మేలు చేకూర్చి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పేర్కొన్నారు. గత పాలకుల ప్రభుత్వం ఈ నిధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే నేటి అధికార పక్షం అధికారంలోకి రాగానే ట్రైకార్లో బకాయి ఉన్న నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, వెంటనే 219 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని లేకపోతే లబ్ధిదారులతో, రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులను సమీకరించి మాసబ్ ట్యాంక్‌లో ఉన్న గిరిజన సంక్షేమ భవన్‌ను ఈ నెల 7వ తేదీన ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ ధర్మానాయక్, ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాణాపురం రఘు, ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కందాల వెంకటేశ్, గిరిజన సమాఖ్య రాష్ట్ర సీనియర్ నాయకులు శంకర్ నాయక్, గిరిజన సంఘాల నాయకులు మేడ సుశీల, బానోత్ భిక్షునాయక్, మూడావత్ లోక్య నాయక్, కృష్ణ నాయక్, సభావట్ రవి నాయక్, శివ నాయక్, వడిత్య సరిలాల్ నాయక్, రమావత్ చత్రునాయక్, జాటోత్ రెడ్యా నాయక్, ఉపేంద్ర, రాధిక, జె.బీరయ్య, జె. వీరన్న, వనం నాగయ్య, జె. శీను, జె. అర్జున్, వనం అంజి పాల్గొన్నారు.



ఘనంగా సర్వాయి పాపన్న వర్ధంతి

నవతెలంగాణ-నాగోల్

సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమతో ముందుకు సాగిన గొప్ప బహుజన నేత అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతిని పురస్కరించుకొని నాగోలులోని సిపి అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఉడతల మల్లేష్ అధ్యక్షతన సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశంలోని దక్కన్ పీఠభూమిలో మొగలాయ పాలకులు ఆక్రమించుకున్న తెలంగాణ ప్రాంతాల నుంచి విముక్తి చేయడానికి, దౌర్జన్యాలను అరాచకాలను తిప్పి కొట్టడానికి, మొట్టమొదటి సైన్యాన్ని ఏర్పాటు చేసిన బహుజన తిరుగుబాటు నాయకుడు సర్వాయి పాపన్న అని అన్నారు. వీరోచితమైన పోరాటపటిమతో ముందుకు సాగిన గొప్ప బహుజన నేత సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి.అఖిల్,పి. మల్లేష్, కే.రవి, జి.అంజనేయులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా వైశ్యా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అష్టలక్ష్మి ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైశ్య యూత్ అసోసియేషన్ పూర్వాధ్యక్షులు దండు రాజు, గౌరవ అతిథిగా అష్టలక్ష్మ ఆలయం చైర్మెన్ సురేష్ కుమార్ సోమ హాజరై జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైశాయూత్ అసోసియేషన్ అధ్యక్షులు దేవేందర్ సముద్రాల, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, దళిత కోశాధికారి బాలకృష్ణ, జిల్లా వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నరేష్ గుప్తా, మాడిశెట్టి ప్రధాన కార్యదర్శి నాగార్జున, ఆలయ కోశాధికారి ఉదయభాస్కర్ నరాబు, ప్రాజెక్ట్ అడ్వైజర్ బొగ్గారపు శరత్, బొగ్గారపు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొత్తపేట

'21, 22 తేదీల్లో శంషాబాద్‌లో

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు'



నవతెలంగాణ-ఎల్బీనగర్

తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్ పట్టణంలోని ఎలైట్ హోటల్లో నిర్వహించనున్న మహా సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ ఎస్‌ఏ డాంగే భవన్‌లో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్‌లతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఎలాంటి పనిలో భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయిన అంగవైకల్యం చెందిన వారిని ఆదుకునే నాథుడే లేకుండా పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది వలస కార్మికులు ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ నిర్మాణరంగంలో పనిచేస్తున్న వారికి సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా బహుళ అంతస్తులలో పనులు చేయిస్తూ అతి తక్కువ జీతాలు ఇస్తున్నారని ఆరోపించారు. వలస కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్న కార్పొరేట్ బహుళ నిర్మాణ కంపెనీల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులతో పనిచేస్తున్న కంపెనీలు ప్రమాదాలకు గురై కార్మికులు చనిపోతే ఎలాంటి నష్టపరిహారాలు ఇవ్వకుండా రాత్రికి రాత్రి వారి సొంత స్థలాలకు తరలించి, ఎలాంటి ఎక్స్ గ్రేషియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. అలాంటి కంపెనీలపైన రాబోయే కాలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని పర్వతాలు హెచ్చరించారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో నిర్మాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉందని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి అన్నారు. గతంలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు చనిపోతే వారికి న్యాయం చేయాలని పోరాడి ఎక్స్ గ్రేషియా ఇప్పించడం జరిగిందని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 21, 22 లో జరిగే రాష్ట్ర మహాసభలలో భవన నిర్మాణ రంగంలో ఎదురైతున్న సమస్యల మీద చర్చించి, భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ప్రవీణ్ గౌడ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యల మీద ఆందోళన పోరాటాలు నిర్వహించడానికి పిలుపునిస్తామని తెలిపారు. ఈ మహాసభల విజయవంతానికి జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకులు రాములు గౌడ్, మద్దిలేటి, అంకన్న, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

'యూనివర్సిటీ విద్యార్థుల అరెస్టులను ఖండిస్తున్నాం'



నవతెలంగాణ- అబ్దుల్లాపూర్‌మెట్

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్ మెట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో శివ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయకుండా ఆపాలని, పచ్చని ప్రకృతిని కాపాడాలని విద్యార్థుల కోరుతుంటే.. ప్రభుత్వం ఆ భూములను వేలం వేయాలని చూడడం విడ్డూరంగా ఉందన్నారు. పచ్చని ప్రకృతి, జీవరాశులు, పక్షులతో నిత్యం కిటకిటలాడే ప్రకృతి అందాన్ని అమ్ముకోవడం నిలిపి వేయాలన్నారు. ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. యూనివర్సిటీ భూములను వేలం వేయవద్దని నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం సరికాదన్నారు. యూనివర్సిటీ విద్యా ర్థులకు ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ అండగా నిలు స్తూ ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. యూని వర్సిటీ విద్యార్థులు ఛలో సెక్రెటేరియట్ ముట్టడికి మద్ద తుగా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయ కులు నాగేష్, శశాంక్, నితిన్, మారుతి ఎ పాల్గొన్నారు.

గ్రూపు-1 ఫలితాల విజేతలకు సన్మానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఇటీవల వెలువడిన గ్రూపు-1 ఫలితాలలో విజయం సాధించిన మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కే.అనూష రెడ్డి, కళ్యాణ్‌లను బుధవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పి.సరస్వతి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రూపు-1 ఫలితాలలో కే.అనూష రెడ్డి 524 మార్కులతో రాష్ట్ర ఏడవ ర్యాంకు సాధించగా, కళ్యాణ్ 173 ర్యాంక్ సాధించి రాష్ట్ర ర్యాంకర్‌గా విజయం సాధించారని తెలిపారు.

కష్టపడితే ఏదైన అసాధ్యం కాదని, అందుకు అనూష, కళ్యాణ్ నిదర్శనమన్నారు. గ్రూపు వన్ ఫలితాల్లో విజయం సాధించిన మీరు రానున్న కాలంలో విధి నిర్వహణలో ప్రజలకు మంచి సేవ చేసి, ప్రజల మన్న నలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేశ్వర్ రావు, ఆర్ఓ వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్ పనుల పరిశీలన



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో చేపట్టిన నూతన భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బుధవారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో మిగిలి ఉన్న వీధుల్లో కూడా భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్స్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో సమీక్షించి, వీలైనంత త్వరగా వెంకటేశ్వర కాలనీలో పూర్తిస్థాయిలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ సదుపాయం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రాచకొండలో

రేపు కాలం చెల్లిన/పనికిరాని వస్తువుల బహిరంగ వేలం

నవతెలంగాణ-హయత్ నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఫర్నిచర్ వస్తువులు టేబుల్స్, కుర్చీలు మొదలైనవి, ఎలక్ట్రానిక్ వస్తువులు అనగా UPS బ్యాటరీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, వాటి సంబంధిత ఉపకరణాలు, ట్రాఫిక్ వస్తువులు అనగా కోన్‌లు, బారికేడ్‌లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు, బొల్లార్డ్‌లు మొదలైనవి ఐటీ & కమ్యూనికేషన్స్ వీహెచ్ఎఫ్ సంబంధిత పరికరాలను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు రాచకొండ కమిషనర్ ఓ ప్రకటన విడుదల చేశారు. కొనుగోలుదారులు/బిడ్డర్లు కాలం చెల్లిన/పనికిరాని వస్తువులను అంబర్ పేటలోని డీసీపీ ,కార్ హెడ్ క్వార్టర్స్ లేదా పరేడ్ గ్రౌండ్, కార్ హెడ్ క్వార్టర్స్, నుండి ముందస్తు అనుమతి తీసుకుని, వ్యక్తిగతంగా పరిశీలన చేసుకునే అవకాశం కూడా కల్పించబడుతోందని తెలిపారు. ఆసక్తి కలవారు శుక్రవారం (ఈ నెల 4న)ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ





నవతెలంగాణ - కొత్తపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎక్కువ అయిపోయాయని, తెలియని వ్యక్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, ఇన్స్టాగ్రామ్, ఫేస్‌బుక్, స్నాప్ చాట్, వాట్సప్ వంటి వాటికి సంబంధించిన ఓటీపీలు చెప్పకూడదని విజ్ఞప్తి చేశారు. తెలియని వ్యక్తులతో చాటింగ్, ఇంకా ఫొటోలు షేర్ చేయకూడదని చెప్పారు. ఎలాంటి సైబర్ నేరాలకైనా 1930 కాల్ చేసి కంప్లైంట్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | ఏప్రిల్ 03, 2025 | www.navatelangana.com

హెచ్‌సీయూ భూముల వేలాన్ని విరమించుకోవాలి

- ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద



నవతెలంగాణ-ఉప్పల్
హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమి వేలాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ అవలంభిస్తున్న నియంతృత్వ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తా మని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనివర్సిటీ భూములను లాక్కోవడం అంటే, పేద విద్యార్థుల చదువులను నాశనం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని కోరారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనియమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజల దాహం తీర్చడానికి ప్రతి ఒక్కరూ చలివేంద్రాలను ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, జేఏసీ వెంకన్న, శ్రీనివాస్, ఖలీల్, చిన్న యాదవ్, సతీష్, గంగాధర్ కృష్ణ, శ్రీనివాస్, గణేష్, సత్యనారాయణ, లింగమన్న, సుధాకర్, జనార్ధన్, కోటేష్, రవీందర్, వేణు యాదవ్, తదితరులున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా
ఏప్రిల్ 21న నిర్వహించే తెలంగాణ ప్లీనరీ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. బుధవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించేలా అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, 25 వేల పెన్షన్స్ సౌకర్యం చేస్తామని చెప్పి రెండేండ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఉద్యమకారుల ప్లీనరీ సమావేశానికి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. .ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోల సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా స్వామి, అధికార ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, రాష్ట్ర మీడియా ప్రతినిధి దొమ్మాటి కిరణ్ కుమార్, భాస్కర్, ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-అల్వాల్
అల్వాల్ 135వ డివిజన్ వెంకటాపురంలోని సుభాష్ నగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు చల్లటి నీరు అందించాలనే ఉద్దేశ్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్, మాజీ ఎంబీసీ చైర్మెన్ నందికంటి శ్రీధర్, డోలి రమేష్, మోసిన్, శ్రీనివాస్, సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అశోక్ కుమార్ మృతి



- నివాళులర్పించిన నీలంరెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి
బీఆర్ఎస్ నాయకులు చిటకోర్ అశోక్ కుమార్ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సోదరుడు బండారి నీలంరెడ్డి బుధవారం అశోక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్, ప్రీతిరెడ్డి, భాగ్య, విఠల్ యాదవ్, దాసరి కర్ణ, భాను, టేకులపల్లి రామచందర్, చంద్రశేఖర్, ఖాదర్, సంతోష్, ఈశ్వర్ గౌడ్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలం నిలిపేయాలి



- మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసుల రాంమూర్తి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్
ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల వేలం నిలిపి వేయాలని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసుల రాంమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్ మల్లికార్జున నగర్‌లో బుధవారం మేడ్చల్ ప్రదేశ్ జిల్లా అధ్యక్షులు నరహరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులపై పోలీసు దౌర్జన్యం ఖండిస్తున్నామన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. భూముల వేలం అడ్డుకున్న విద్యార్థులను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. వారిని బేషరతుగా విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. పేదలు గుడిసెలు వేసుకుంటే వాటిని తగలబెట్టి వారిపై కేసులు పెట్టి నిర్బంధించి ఇప్పుడు ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ ఎవరు కల్పిస్తారని తెలిపారు. అఖిలపక్షంతో చర్చలు జరిపి హెచ్‌సీయూ లాంటి మరో విద్యా సంస్థను 400 ఎకరాలల్లో ఏర్పాటు చేయాలని కోరారు. వేలం ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల అష్ తోష్, బైరు అనిల్ కుమార్, బండారి రవి, పోర్కా శ్రీధర్, రామ్ మోహన్, దత్తాత్రేయ, నారా హరి రావు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు చామకూర గోపాల్‌రెడ్డి పరామర్శ



నవతెలంగాణ- మేడ్చల్
గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకొయ్యలో ఉన్న సీఎంఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఆస్పత్రి చైర్మెన్ చామకూర గోపాల్ రెడ్డి బుధవారం పరామర్శించారు. మూడేండ్లుగా సీఎంఆర్ ఆస్పత్రికి 60 నుండి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామీణ ప్రజలు సైతం వచ్చి ఉచిత వైద్య సేవలను ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఉచితంగా వివిధ పరీక్షలు, సర్జరీలు, సిటీ అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు తదితర సౌకర్యాలు అందిస్తున్నట్లుగా తెలిపారు. ఇప్పటికే సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తెచ్చామని, మరికొద్ది రోజుల్లో ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతాం

- మేడ్చల్ ఇన్‌చార్జి తహాశీల్దార్ సునీల్ కుమార్
- సుతారిగూడ, గౌడవెల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ మండల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపుతామని మండల ఇన్‌చార్జి తహశీల్దార్ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం మేడ్చల్ మండల పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో ఆయన



పర్యటించి జనప్రియ వెంచర్ పేరుతో ఏర్పాటు చేసిన నిర్మాణాలలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్టు తెలిపారు. అట్టి స్థలంలో ప్రభుత్వ స్థలమని బోర్డు సైతం ఏర్పాటు చేయించినట్లుగా ఆయన తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని గౌడవెల్లి, సుతారిగూడ గ్రామాల మధ్యలో ఉన్న చెరువు ఎఫ్‌టీఎల్ సర్వే నంబర్ 208లో ఏర్పాటు చేసిన కాంపౌండ్ వాల్ నిర్మాణాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జేసీబీ సహాయంతో కూల్చి వేశారు. చెరువు శిఖంలో మట్టి పోసిన వెంచర్ నిర్వాహకులపై సైతం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టిని పోసిన వెంచర్ నిర్వాకులు తక్షణమే అట్టి మట్టిని తీసివేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దీంతోపాటు గుడ్లపోచంపల్లిలోని ప్రభుత్వ స్థలంలో ఓ ప్రయివేట్ వెంచర్ నిర్వాహకులు అక్రమంగా ఆక్రమించుకొని 5గుంటల ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అట్టి స్థలాన్ని బుధవారం పరిశీలించినట్టుగా సునీల్ కుమార్ తెలిపారు. విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.



సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు భవిష్యత్తు కర్తవ్యాలు నిర్దేశిస్తాయి

- పార్టీ జిల్లా ఆఫీసు కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు



నవతెలంగాణ-కాప్రా
మధురైలో జరుగుతున్న సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు భవిష్యత్ కర్తవ్యాలు నిర్దేశిస్తాయని పార్టీ జిల్లా ఆఫీసు కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు తమిళనాడు మధురై నగరంలో ప్రారంభమవుతున్న సందర్భంగా సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో కమలానగర్ పార్టీ ఆఫీసు వద్ద పార్టీ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అఖిలభారత మహాసభలు భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకోవడానికి ఏప్రిల్ 2 నుంచి ఆరో తేదీ వరకు మధురైలో నిర్వహించే సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో పార్టీని ముందుకు నడిపిస్తాయన్నారు. అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. పార్టీ విడుదల చేసిన ముసాయిదాల్లో ఆత్మ విమర్శ పూర్వకంగా రూపొందించుకొని భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించిందన్నారు. వాటిని చర్చించి పార్టీ నిర్ణయాలు చేస్తుందని, దానికి కట్టుబడి ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. పార్టీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ మాట్లాడుతూ.. పార్టీ నిర్దేశించుకున్న కర్తవ్యాలను ఇంకా మెరుగైన విధంగా ముందుకు నడిపించడం కొరకు పార్టీ మహాసభలు దిశా నిర్దేశం చేస్తాయన్నారు. సీనియర్ పాత్రికేయులు గుమ్మడి హరి ప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో అవినీతి రహిత పార్టీ సీపీఐ(ఎం) అని ఒక నివేదికలో వచ్చిందన్నారు. అటువంటి గొప్ప పార్టీని బలోపేతం చేసుకుని ముందుకు నడవాలని కోరారు. మహిళా ఉద్యమ నాయకురాలు శారద మాట్లాడుతూ..పార్టీ నిర్ణయాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జెండా ఆవిష్కరణ అనంతరం అందరూ పార్టీ పతాకానికి రెడ్ సెల్యూట్ చెప్పారు. కాగా గొడుగు యాదగిరిరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, వెంకట్, గద్దల నరసింహారావు, పి బి చారి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



నవతెలంగాణ -శామీర్‌పేట
ఆర్టీసీ బస్సు ఓ వృద్ధ మహిళను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన చీరబోయిన శివమ్మ (70) శామీర్ పేట బస్టాండు వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కడానికి వెళు తుండగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగ నడుపుతూ వృద్ధురాలిని ఢీ కొట్టాడు. ఆమెపైకి ముందు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీ రామ నవమికి ఏర్పాట్లు చేయండి



- కార్పొరేటర్ శ్రవణ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్
శ్రీరామనవమి పండుగ సందర్భంగా రోడ్ల పై గుంతలు పుడ్చాలని, చెట్ల కొమ్మలు ట్రిమ్మింగ్ చెయ్యాలని, వీధి దీపాల ను ఏర్పాటు చెయ్యాలని బుధవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ రాజు, ఇంజనీరింగ్ అధికారులకు మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా దేవాలయాల వద్ద ప్రత్యేకంగా శానిటైజషన్ ఏర్పాట్లు చెయ్యాలని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, సఫిల్ గూడ చెరువు గుర్రపు డెక్క తీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ ఆశ లత, ఈఈ లక్ష్మణ్ డీఈ మహేష్, బీజేపీ నాయకులు సునీల్, నాగరాజు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ పనులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం



- కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి
- రూ.6 కోట్ల 20 లక్షలతో బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్
ఎంప్లాయిస్ కాలనీ నుంచి సాయి కృష్ణ ఎన్ క్లేవ్ వరకు జరిగే బాక్స్ డ్రైన్ పనులు పూర్తి అయితే ఎన్నో ఏండ్లుగా వర్షాకాలంలో ప్రజలు పడే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ నుంచి సాయికృష్ణ ఎన్‌క్లేవ్‌కు బాక్స్ డ్రైన్ పనులకు అనుమతి రావడంతో రూ.6 కోట్ల 20 లక్షలతో జరిగే పనులను బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డితో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతంలో ఎస్ఎన్‌డీపీ కింద రూ.40 కోట్లతో యాప్రాల్‌లో పనులు పూర్తి చేశామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఇక్కడ కాలనీ ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఆదిత్య, పరమేష్, శర్మ, సత్యనారాయణ, రాజి రెడ్డి, సుధాకర్, బాస్కర్ గౌడ్ పర్వతాలు, శ్యామ్, అకారం సాయి, పవన్, నవీన్ గౌడ్, హరీష్, ఆల్బర్ట్, పంకజం, సుదర్శిని, గీతా మూర్తి, షాలిని, ఎస్ఎన్‌డీపీ అధికారులు, కాలనీ సభ్యులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



ఐపీఎల్‌లో బ్లాక్ టిక్కెట్ల సమస్యపై విచారణ జరపాలి

- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును తొలగించి, కేసు నమోదు చేయాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్



నవతెలంగాణ-ఉప్పల్
ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల టిక్కెట్ల విషయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్‌ఓ) నిర్వాహకులు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును తీరు సిగ్గు చేటని, ఆయనను అధ్యక్ష పదవి నుండి తొలగించి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతిపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లతో కలిసి మాట్లాడుతూ.. హెచ్‌సీఏ తీరుపై గతంలో ప్రత్యక్ష పోరాటాలు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో అలసత్వంతోనే ఆరోపణలు అంశం తెరమీదకు వచ్చిందన్నారు. చర్యలు తీసుకోవాల్సిన పాలకవర్గం అదే పాలకవర్గ అనుబంధ సంఘాలు నేడు ఉప్పల్ స్టేడియం ముందు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ టికెట్లను అమ్ముకుం టున్నారని, అతని వైఖరితోనే వేరే ప్రాంతానికి ఐపీఎల్ మ్యాచ్‌లను తరలిస్తామని సన్ రైజర్స్ చెబుతుందన్నారు. హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) నిర్వాహకులు మాత్రం టికెట్లను బ్లాక్ చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించారని ఆరోపించారు. హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్‌ల మధ్య సమన్వయం కొరవడిందని ధ్వజమెత్తారు. ఉప్పల్ స్టేడియానికి వచ్చే అభిమానులకు తాగునీరు అందించడంలో హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్‌లు విఫలమయ్యాయన్నారు. స్టేడియంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అమ్మడం లేదని ధ్వజమెత్తారు. రెగ్యులర్ స్టాండ్లలో ఫుడ్ స్టాల్స్‌లో ఏది కొనాలన్నా రెట్టింపు ధరలను చెల్లిస్తున్నారన్నారు. స్టేడియంలో ధరలు షాకింగ్‌గా ఉన్నాయని అభిమానులు వాపోతున్నారన్నారు. స్టేడియంలో అధిక ధరలను కట్టడికి వినియోగదారుల ఫోరం తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీఏ బోర్డ్ యంత్రాంగం నాణ్యమైన ఆహారం, కూల్ డ్రింక్స్ అమ్మకుండా ప్రేక్షకుల జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. అందుకే హెచ్‌సీఏ బోర్డు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యజమానులు ఐపీఎల్ టిక్కెట్ల విక్రయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ టిక్కెట్లను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మల్కాజిగిరి కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఐఎస్ నగర్‌లో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకోని వెళ్లే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్ జితేంద్రనాథ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, టీకే. శ్రీనివాస్, వైనాల ప్రవీణ్, రాంచందర్, నాగరాజు, సత్యనారాయణ, ఫరీద్, యూసుఫ్, కొమురయ్య బాల్ రాజ్ యాదవ్, సంపత్ గౌడ్, పంజా శ్రీనివాస్ యాదవ్, ధర్మేష్ యాదవ్, ఇస్తారి, శ్రీనివాస చారి, విజయ లక్ష్మి, కనక లక్ష్మి, అగమయ్య, ఆర్వ రాజు, సిరిగిరి రాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రి సీజ్

- చెంగిచెర్ల భవిష్యా వెల్ విషర్ హాస్పిటల్‌పై చర్యలు



నవతెలంగాణ-బోడుప్పల్
నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సి.ఉమా గౌరి అన్నారు. బుధవారం బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో ఉన్న భవిష్యా వెల్ విషర్ ఆస్పత్రిపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టిన వైద్య అధికారుల బృందం విచారణలో ఆస్పత్రిలో అర్హతలు కలిగిన వైద్యులు, మెడికల్ డైరెక్టర్ లేకపోవడం, అధిక మోతాదులో మెడిసిన్ ఇవ్వడం లాంటివి బయపడ్డాయని, తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేసి రూ.5,00,000/-లు జరిమానా విధించారు. అనంతరం వైద్య అధికారులు మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా ఆస్పత్రులు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే ఆస్పత్రుల పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దర్యాప్తులో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీతా, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వినోద్, స్థానిక పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ - జవహర్ నగర్
ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీ నగర్ దమ్మాయిగూడకు చెందిన శివరాత్రి హరీష్ (26) సోమవారం ఉదయం ఇంటర్వ్యూకి వెళ్లి వచ్చాడు. తిరిగి అతడి అన్న రాకేష్ బైక్ తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లాడు. రాకేష్ తల్లి జ్యోతి ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మరోసారి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా కనిపించకపోవడంతో శివరాత్రి జ్యోతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వికలాంగుడికి మెడిసిన్స్ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో
పేదలు, వృద్ధులు, విద్యార్థులకు సెవెన్ రేస్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ సారా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో నివాసం ఉండే వికలాంగుడికి అవసరమైన మెడిసిన్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలిసిన వెంటనే తనకు తోచిన విధంగా సహాయం చేస్తున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లోనూ కొనసాగిస్తానని డాక్టర్ సారా తెలిపారు.


ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రేమ విఫలమైందని ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీడిమెట్ల పోలీ స్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సూరారం డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన ఇమ్రాన్ పాషా (27) పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళరాత్రి భోజనం చేసి తన రూమ్‌లోకి వెళ్ళాడు. బుధవారం ఉదయం ఎంతకీ తలుపు తీయకపోవడంతో కిటికీలో నుంచి తన సోదరి ఫర్హానా చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్న దృశ్యం కనిపించింది. డోర్ పగలగొట్టి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. గత సంవత్సరం ఇమ్రాన్ పాషాకు ఓ యువతితో ఎంగేజ్‌మెంట్ అయింది. ఆ యువతితో ప్రేమలో ఉన్నాడని... సదరు యువతి ప్రేమను నిరంకరించ డంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని సోదరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

'విద్యార్థులపై కేసులు పెట్టడం దుర్మార్గం'



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టడం వారిపై కేసులు పెట్టడం దుర్మార్గమని జనసేన కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హెచ్‌సీయూ విద్యార్థులపై దుర్మార్గంగా వ్యవహరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. హెచ్‌సీయూ భూములను అమ్మితేనే ఖజానా నిండుతుందా అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వానికి బాధ్యత లేదా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూముల కోసం పోరాడుతున్న విద్యార్థులపై వెంటనే కేసులు కొట్టివేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ 400 ఎకరాల ఆక్రమణ ఆపివేయాలని, లేనిచో జనసైనికులు ఉద్యమించడం తప్పదన్నారు.

వృద్ధురాలు అదృశ్యం...



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వృద్ధురాలు అదృష్టమైన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం, స్కంద నగర్‌కు చెందిన ధనమ్మ, కుటుంబ సభ్యులకు చెప్ప కుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తమ కుటుంబ సభ్యులు తెలిసినవారు, బంధువుల దగ్గర వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం తన కొడుకు చేజెర్ల శీను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

డ్రయినేజీ నిర్మాణం ఏర్పాటు చేయాలి



● కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

ఫతేనగర్ శివాలయం కాలనీలో రోడ్డు డ్రయినేజీ నిర్మాణం ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. మూసాపేట సర్కిల్ ఫతే నగర్ డివిజన్ పరిధిలోని శివాలయానికి అనుకుని ఉన్న కాలనీ, శివాలయ పరిసరాల్లోని ప్రాంతంలో రోడ్డు నిర్మాణం కొరకు స్థానికుల వినతి మేరకు.. బుధవారం కార్పొరేటర్, ఏఈ రాధాకృష్ణతో కలిసి పర్యటించారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్ పరిధిలోని శివాలయ కాలనీలో గతంలో డ్రయినేజీ వ్యవస్థ కోసం కాలనీ వాసులు కోరడంతో డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. అదే విధంగా రోడ్డు పనులను కూడా వేస్తే త్వరితగతిన పనులు పూర్తవుతాయని స్థానికులు కోరారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులతో సమీక్షించి శివాలయం కాలనీలో వెంటనే నెల రోజుల్లో రోడ్డు, డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, ప్రవీణ్, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకరం..



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి కోర్టు బార్ సోసియేషన్‌కు గత నెల 27న జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గం బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికైన పి.గోవర్ధన్ రెడ్డి మొదటగాపదవీ ప్రమాణం చేశారు. కాగా మొదటిసారి ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది కే భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏ సుదర్శన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎన్నికైన హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా ఎన్నికైన సైపుల్ల షరీఫ్‌ల చేత సీనియర్ న్యాయవాది రామచంద్రం పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన అఖిలారావు, సిహెచ్ అర్చన గౌడ్, కళ్యాణి, తన్నీరు శ్రీకాంత్, రామకృష్ణ, పద్మావతి, భాను ప్రకాష్‌లు పదవి ప్రమాణం చేశారు. కోర్టులో వసతులను మరింత మెరుగు పరుస్తామని, న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డిలు తెలిపారు. తమ మీద నమ్మకంతో గెలిపించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరిని కలుపుకుపోతూ కూకట్పల్లి కోర్టు ఔన్నత్యాన్ని పెంచడానికి పాటుపడతామని, నిబంధనల మేరకు తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని తెలిపారు. కాగా ఎన్నికలను సజావుగా నిర్వహించిన చీఫ్ ఎన్నికల అధికారి సుభాష్ గుప్తతో పాటు సహాయ ఎన్నికల అధికారులను కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ మెమొంటోలతో ఘనంగా సత్కరించింది.

మ్యాక్స్ ఫ్యాషన్ స్టోర్ రీ లాంచ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ మ్యాక్స్ ఫ్యాషన్ నగరంలోని హిమాయత్ నగర్ ఓం అర్జున్ టవర్స్‌లో బుధవారం ప్రారంభమైంది. సువిశాలమైన విస్తీర్ణం గల ఈ నూతన మ్యాక్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో మంచి నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉంది. అలాగే ఈ స్టోర్ హైదరాబాద్ ఫ్యాషన్ వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా ఉంది. ఇక్కడ అన్ని వర్గాల వారికి అందుబాటులో ధరలు ఉండటం విశేషం. వినియోగదారులు తాము చెల్లించిన ధరకు తగిన నాణ్యమైన దుస్తులను మ్యాక్స్ స్టోర్లలో పొందొచ్చు. కస్టమర్లు సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం, విలక్షణమైన, ప్రత్యేక గొప్ప షాపింగ్ అనుభవం కోసం మ్యాక్స్ స్టోర్‌ను సందర్శించవచ్చు. 2004లో మిడిల్-ఈస్ట్‌లో తన మొదటి స్టోర్‌ని ప్రారంభించిన ఈ బ్రాండ్ అసాధారణ వేగంతో పుంజుకుంది. మన దేశంలో ప్రస్తుతం 210 నగరాల్లో 520 స్టోర్స్‌ను కలిగి ఉంది. సమకాలీన మధ్యతరగతి ప్రజల కోసం అత్యుత్తమ ఫ్యాషన్‌ను పరిచయం చేసింది. ప్రపంచ ఫ్యాషన్ పోకడలకు అనుగుణంగా, సరసమైన ధరలకు అందించడం ద్వారా.. ఉత్తమ స్టోర్‌గా నిలిచింది. వీరు ఫ్యాషన్ స్పృహతో పాటు టెక్-అవగాహన కలిగి ఉన్నారు. ఎందుకంటే పురుషులు, మహిళలు, పిల్లల కోసం దుస్తులు, పాదరక్షలు వంటివి మ్యాక్స్‌లో సరస మైన ధరలకు పొందవచ్చు. మరింత సమాచారం కోసం, https://www.maxfashion.in/in/en ను సంప్రదించవచ్చు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పాపన్న గౌడ్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జేఎల్‌బీ.హరిప్రియ, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎల్.రామ్మోహన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి, ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.వినోద్‌కుమార్, డిస్ట్రిక్ ట్రెజరీ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట నర్సయ్య, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దొడ్డి కొమురయ్య జయంతి

నేడు కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల ప్రజా ప్రతినిధులు, కురుమ కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత..



● కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ హైదర్ నగర్ గ్రామ సర్వే నంబర్ 145, 163 పార్ట్‌లలో ఇండ్ల నిర్మాణం కోసం అనుమతులు జారీ చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కలిసి వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మార్చి నెల నుంచి ఇక్కడి సర్వే నంబర్‌లో సాయి నగర్, సర్దార్ పటేల్ నగర్, వసంత నగర్, భగత్ సింగ్ నగర్, సీబీసీఐడీ కాలనీ, ఎన్ఆర్ఎస్ఏ కాలనీ, ఎస్ఎస్.కాలనీలలో గత నలభై ఏండ్ల కిందటనే లే అవుట్ చేసి ఇండ్ల స్థలాలుగా అభివృద్ధి చేసారన్నారు. అప్పటి నుంచి గత మార్చి నెల వరకు ఇండ్ల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ మొదలుకొని మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీ వరకు అనుమతులను జారీ చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంత వరకు ఇండ్ల నిర్మాణం కోసం అనుమతులను మంజూరు చేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు కలెక్టర్ వద్దకు ఫైల్ పంపుతున్నారన్నారు. అకస్మాత్తుగా అనుమతులను నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేక సంవత్సరాలుగా లేని సమస్యలు అకస్మాత్తుగా ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాలి..

● విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ పార్టీ : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

● నగరానికి స్వచ్ఛమైన గాలిని అందించే వృక్ష సంపదను కాపాడుకోవాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలోని తన నివాస క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్ సీయూ(హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) భూముల రక్షణకై యూనివర్సిటీ విద్యార్థులు పోరాటానికి, ప్రతి ఒక్కరు మద్దతు తెలియజేయాలన్నారు. పోరాటం చేస్తున్న విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ మహానగరానికి స్వచ్ఛమైన గాలిని అందిస్తూ.. అనేక జీవరాశులకు ఆవాసంగా ఉన్నాయని తెలిపారు.

అలాగే కూకట్‌పల్లిలోని 517 ఎకరాల ఉదా సీన్ మఠం వారి భూమిని, పర్యావరణానికి ఉపయోగపడేలా ఆ భూమిని పక్షులకు జంతువులకు, కొంతమేర వదిలేసి మిగతా భూమిని కూడా ప్రకృతి సోయగాలతో అందంగా తీర్చిదిద్దేటట్టు ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. హెచ్‌సీయూ భూముల రక్షణకై సోషల్ మీడియా ద్వారా, యువత కూడా మన భావి భవిష్యత్ తరాల గురించి పర్యావరణం గురించి పోరాడాలి అని పిలుపునిచ్చారు.


బీవీఆర్ఐటీలో సాంకేతిక-సాంస్కృతిక మహోత్సవం



నవతెలంగాణ-నిజాంపేట్

బాచుపల్లిలోని బి.వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బివిఆర్ఐటి) మహిళా కళాశాలలో బుధవారం సాంకేతిక -సాంస్కృతిక మహోత్సవం 2025 ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంకేతిక విషయాలపై అవగాహన పెంపొందించుకోవడానికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 'విఅనేబుల్-వీ హబ్' ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డైరెక్టర్ అన్ని విజయ, తన అధ్యక్ష ఉపన్యాసంతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంటర్ ప్రెన్యూర్ పిప్ జర్నీలోని సాధక బాధకాలను ఆమె వివరించారు. మహిళా విద్యార్థులు భవిష్యత్తులో తమకు ఎదురయ్యే సవాళ్లను ఒక అవకాశంగా మలచుకుని పురోభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ప్రారంభ ఉపన్యాసం ఇచ్చిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి. ఎన్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విద్యార్థుల వ్యవహారాల మండలి అధ్యక్షురాలు ఖ్యాతి మాట్లాడుతూ ఈ సంవత్సరం కళాశాలలో నిర్వహిస్తున్న వాటిలో ప్రధానంగా 35 ఈవెంట్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇందులో రోబోటిక్స్, ఏఆర్‌వీఆర్ త్రిడీ ప్రింటింగ్ లాట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ తదితర కార్యక్రమాల్లో విద్యార్థుల మధ్య పోటీలను కూడా నిర్వహిస్తున్నట్టు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న, ఉదయం 10:00గం॥కు ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో జరుగు మున్నూరుకాపు రణభేరి పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్, మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు బుర్గ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా, చైతన్యవంతులు కావాలని సమాజానికి దిక్సూచిగా నిలువాలన్నారు. రాజకీయంగా ఎదగాలంటే ముందుగా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13న రణభేరి కార్యక్రమాని మున్నూరు కాపు కుల సభ్యులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్లు బత్తుల రాములు, పుప్పాల ప్రభాకర్, ముకుంద రావు, తాటి రవి కుమార్, కృష్ణంగారి ప్రకాష్, రామిని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని విరమించుకోవాలి



● సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ భూముల వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని, సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. అలాగే భూ ముల పరిరక్షణకు ఉద్యమాలు చేస్తున్న విద్యార్థులు, సీపీఐ(ఎం) నాయకులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని తెలిపారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ దగ్గర నుంచి సాగర్ హెూటల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ, రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు ఈ.దేవదానం పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైపోయింది, విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకుంటున్నారు చివరికి విద్యాసంస్థల భూములను కూడా వదలడం లేదన్నారు. ఉత్తర భారత దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలలో హెచ్‌సీయూ ఒకటి అలాంటి యూనివర్సిటీ భూములను గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వేలం వేసి అమ్మే ఆలోచనలో ఉందని, యూనివర్సిటీ విద్యార్థులు ఆ భూములను కాపాడుకోవాలని అక్కడ ఉన్న ప్రకృతిని రక్షించుకోవాలని, పక్షులు, జంతువులకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సామరస్యంగా నిరసన కార్యక్రమం తెలియజేశారు. కానీ ప్రభుత్వం పోలీస్ బలగాలతో విద్యార్థులను చాలా కిరాతకంగా ఈడ్చుకుంటూ పోలీస్ వాహనాలలో ఎక్కించుకొని అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెట్టింది. సీపీఐ(ఎం) నాయకుల అక్రమ అరెస్టులను ఆపాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు, పసుల అంజయ్య, డి.కరుణాకర్, రావుల స్వాతి, పార్టీ నాయకులు మల్లారెడ్డి, పాషా, ఆంజనేయులు, దుర్గా నాయక్, కె.శీను , మధు, తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే భావితరాల సమాజ నిర్దేశకులు



● శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం. శివరామకృష్ణ

● ఐఎన్‌టీఎస్ ఒలంపియాడ్ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి విద్యార్థులే భావితరాల సమాజ నిర్దేశకులని శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం.శివరామకృష్ణ అన్నారు. ఇటీవల జరిగిన ఐఎన్‌టీఎస్ ఒలంపియాడ్ పరీక్షల్లో తమ చింతల్ బ్రాంచ్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించడం ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. ఐఎన్‌టీఎస్‌ఒ లంపియాడ్ ఫైనల్ పరీక్షల్లో లక్ష్మీసంస్కృతికి(గ్రాండ్ ప్రైజ్)అత్యుత్తమ బహుమతి లభించింది. ఏడవ తరగతి చదివే అభినవ్ తేజ మొదటి స్థానంలోనూ, ఆరవ తరగతి చదివే దేవాంక్ ద్వితీయ స్థానంలోనూ ప్రతిభ కనబరిచదంతో పాటు మూడో బహుమతి ముగ్గురు విద్యార్థులు, నాలుగో బహుమతి ఒక విద్యార్థి, ఐదవ బహుమతి ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఆదరహెూ అనిపించారు. మొత్తం 184 విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించి ఈ ప్రాంతానికి తలమానికంగా నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం పాఠశాల క్యాంపస్ హాల్లో ఆర్ఐ.వి.పద్మజ, జోనల్ కోఆర్డినేటర్ వెంకట శివ, ప్రిన్సిపల్ శ్వేతారెడ్డి,డీన్. అశోక్, ఒలంపియాడ్ ఇన్‌చార్జి నరసింహులు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తి కొనసాగించి ఉన్నత శిఖరాలధిరోహించాలని విద్యార్థులను వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ అడ్మిషన్ డైరెక్టర్‌గా బి.బాలు నాయక్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో నూతనంగా అడ్మిషన్ డైరెక్టర్‌గా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ బి.బాలు నాయక్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బంజారా విద్యార్ధి సంఘం నాయకులు, విద్యార్థులు వారి ఛాంబర్‌లో కలిసి పూల కుండిని అందించి శుభాకాంక్షలు తెలియ జేశారు. బంజారా విద్యార్థి సంఘం నాయకులు భాను ప్రకాశ్ నాయక్, ఆకాశ్ నాయక్‌లు మాట్లాడుతూ జెఎన్‌టీయూ హెచ్ యూనివర్సిటిలో సీనియరిటీనీ గుర్తించి సీనియర్ ప్రొఫెసర్‌కు డైరెక్టర్‌గా నియమించిన వైస్ ఛాన్సలర్ టీ.కిషన్ కుమార్ రెడ్డికి బంజారా విద్యార్థి సంఘం తరుపున, బంజార విద్యార్థుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యూనిర్సిటీలో అడ్మిషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి.. పిహెడ్ అడ్మిషన్‌లో మిగిలిన పిహెడ్ సీట్లు బ్యాక్లాగ్ చేసి తరువాతి నోటిఫికేషన్‌లో ఇస్తే ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనారిటీ విద్యార్థులకు న్యాయం చేసినవారవుతారని అడ్మిషన్ డైరెక్టర్‌ని కోరారు. దీంతో అడ్మిషన్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బంజారా విద్యార్థి సంఘం నాయకులు ఎన్.శశి కుమార్, టీ.రాహుల్,డీఎస్ సురేష్ కుమార్, సాయి కిరణ్, జగన్, నాయక్ పాల్గొన్నారు.

జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7, 8, 9 డివిజన్‌లో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై భీమ్, జైబాపు, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ఉజుమా షాకీర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలను హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం జాతీయస్థాయిలో తీసుకున్న నిర్ణయం అని ప్రతి ఇంటికి కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లి స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవలు గుర్తుచేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని ఆయన కోరారు. కేంద్ర బి.జె.పి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మాజీ సర్పంచ్ నగేష్ చారి, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలను జీవన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చౌదరి, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | ఏప్రిల్ 03, 2025 | www.navatelangana.com

కేంద్ర విద్యా శాఖ మంత్రికి బీఆర్ఎస్ ఫిర్యాదు



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హెచ్‌సీయూలో భూ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కే సురేష్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ కలిసారు. కాంగ్రెస్ సర్కార్ విద్యార్థుల మీద చేస్తున్న దమనకాండపై ఫిర్యాదు.



రంజాన్ మాసం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఈద్ మిలాప్‌లో బాగంగా ఎస్ఆర్ఆర్‌పురం సైట్-1 అక్షరి మస్జిదు కమిటీ సభ్యులు, ఎండీ. బాబా ఫసియుద్దిన్ కార్పొరేటర్ బోరబండ మాజీ డిప్యూటీ మేయర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తార్, జహంగీర్, గులాం అలీ, ఎండీ.ఇషక్, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

- కొత్త టీచర్ల తరహాలో పదోన్నతి పొందిన వారికి..
- ఆరు కేంద్రాల్లో రెండు రోజుల పాటు వివిధ అంశాలపై ట్రైనింగ్
- జిల్లాలో 759 మంది గెజిటెడ్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్స్..



నవతెలంగాణ-సిటీబ్యూరో

డీఎస్సీ-2024లో నియమితులైన కొత్త ఉపాధ్యాయులకు బోధన, శాఖపరంగా అవసరమైన అంశాలపై రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల శిక్షణ ఇప్పించిన విషయం తెలిసిందే.. ఇప్పుడు అదే తరహాలో గతేడాది విద్య సంవత్సరం ప్రారంభంలో జిల్లాలోని అన్ని కేటగిరిల్లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో గెజిటెడ్ హెచ్ఎంలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతో పాటు ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్ పొందిన 759 మందికి రెండు రోజుల పాటు(3,4వ తేదీల్లో) శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో స్పెషల్ ఎడ్యూకేషన్ టీచర్లకు మినహాయించారు. ఇక ఈ శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు పాఠ్యప్రణాళిక, విద్యా ప్రమాణాలు, బోధన సోపానాలు, అభ్యసన ఫలితాలు తదితర అంశాలపై వారికి విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించనున్నారు.

ఆరు కేంద్రాల్లో శిక్షణ

జిల్లావ్యాప్తంగా మొత్తం ఆరు కేంద్రాల్లో రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరింటిలో నాంపల్లిలో(2), సికింద్రాబాద్‌లో(2), ముషీరాబాద్‌లో ఒక్క కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతేడాది జూన్‌లో హైదరాబాద్ జిల్లాలోని అన్ని కేటగిరిలలో 771 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. వీరిలో ప్రస్తుతం 759 మంది శిక్షణలో పాల్గొంటారు. వీరిలో గెజిటెడ్ హెచ్ఎంలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలతోపాటు అన్ని కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందిన వారున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలల్లో పాఠ్యాంశాలకు అనుగుణంగా బోధన తీరును మెరుగు పరచుకునేలా శిక్షణ ఇస్తారు. శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను నేరుగా పాఠశాలల్లో అమలు చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు.

సీనియర్ ఉపాధ్యాయులతో కలిసి నిరంతరం కొత్త విషయాలను తెలుసుకుని సమగ్ర విద్య అందించేలా సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ తరగతులు ఉండనున్నాయి.

శిక్షణ పొందే ఉపాధ్యాయుల వివరాలు..	
గెజిటెడ్ హెచ్ఎంలు	74
ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు	66
ఎస్జీటీ టు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ పొందినవారు..	
ఎస్ఏ(సోషల్)	73
ఫిజిక్స్	12
ఇంగ్లీష్	33
జీవశాస్త్రం	63
మ్యాథ్స్	42
తెలుగు	163
హిందీ	74
ఫిజికల్ డైరెక్టర్లు	71
ఎస్ఏ(ఉర్దూ)	88
మొత్తం	759

ఓయూలో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం



నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జికి వ్యతిరేకంగా బుధవారం ఓయూలో బీఆర్ఎస్వీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. హెచ్‌సీయూ 400 ఎకరాల భూమి అమ్మకాలపై ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం, అలాగే ఓయూలో ధర్నాలు, నినాదాలకు నిషేధం విధిస్తూ సర్క్యులర్ జారీచేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ రమేష్ ముదిరాజ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శిబొల్లు నాగరాజు యాదవ్, శ్రీమాన్ గౌడ్, నాగేందర్ రావు, అవినాష్, నరేష్ పాల్గొన్నారు.

బోరబండలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మహరాజ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగ, బోరబండలోని ఎస్ఆర్ఆర్‌పురం సైట్-2లోగల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న విగ్రహానికి కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దిన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, గణేష్, కాసుల మహేష్ గౌడ్, ప్రభు గౌడ్, పి.శంకర్ గౌడ్, జంగయ్య గౌడ్, వెంకటేశ్ గౌడ్, పలు బస్తీ అధ్యక్షులు అనంద్, చేట్టి దేవెందర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఏర్పాట్లు పరిశీలన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో 6న జరిగే శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లను కార్పొరేటర్ సీఎన్.రెడ్డి, యంగ్ స్టార్ హనుమాన్ యూత్ అసోసియేషన్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి అభయ ఆంజనేయస్వామి కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించి ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరామనవమి ఘనంగా నిర్వహిస్తున్నట్టు కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి తెలిపారు. శ్రీరామనవమి సంధించిన పలు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

7 నుంచి మహా కుంభాభిషేక పూజలు



నవతెలంగాణ-బేగంపేట్

శివాజీ నగర్‌లో ఎంతో ప్రాముఖ్యత ఉన్న పెరుమాళ్ దేవాలయము 200 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఏప్రిల్ 7 నుంచి మహా కుంభాభిషేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ఈఓ సత్యమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు మహంకాళి ట్రాఫిక్ సీఐ ఉపాశంకర్, శానిటేషన్ విభాగం నుంచి సూపర్వైజర్ స్థానిక జవాన్ అనిల్ కుమార్, జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ హరి, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ అధికారి మనోహర్‌తో కోఆర్డినేషన్ ఇన్‌స్పెక్షన్ పెట్టుకొని ఈ వారం రోజులు జరిగే పూజ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళికలు మీద చర్చించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌కి ఐరన్ ఫెన్సింగ్ వేయ్యాలని ఆదేశించారు. అక్కడున్న మ్యాన్ హోల్స్‌ని డీసెంట్ చేయాలన్నారు. అలాగే ట్రాఫిక్‌ని కంట్రోల్ చేయడానికి సీఐతో పలెచోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు స్థానికులు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జితేంద్ర గుప్తా, ప్రశాంత్, రఘు, నర్సింగ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో జై బాపు, జై భీమ్ ర్యాలీ





నవతెలంగాణ-కంటోన్మెంట్

బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ చేపట్టిన జై బాపు-జై భీమ్- జై సంవిధాన్ అభియాన్‌లో భాగంగా బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ర్యాలీ నిర్వహించారు.. కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఆర్యవైశ్య చైర్‌పర్సన్ కల్వ సుజాత ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బాపూజీ నగర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి శ్రీ గణేష్ పూల మాల వేసి ర్యాలీని ప్రారంభించారు. పాదయాత్ర బోయిన్‌పల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ విధానాలు రాజ్యాంగ దళిత వ్యతిరేక విధానాలని, 400 సీట్లు వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామని అనడంతో పాటు, అంబేద్కర్‌ని పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీ కులం పేరుతో మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి విభజన రాజకీయాలు చేస్తుందని, రాజ్యాంగ విలువలను కాలరాస్తుందని ఎమ్మెల్యే విమర్శించారు. కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు జరిగి పదేండ్లు దాటినా మళ్లీ ఎన్నికలు పెట్టకుండా నామినేటెట్ మెంబర్‌తో నడుపుతూ ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేస్తున్నారని శ్రీ గణేష్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే బీజేపీ మాయలో పడకుండా దేశాన్ని, దేశ ప్రజలను కాపాడుకోవడానికి వాడవాడలా తిరుగుతూ ప్రజలకు రాజ్యాంగం పట్ల అవగాహన కల్పిస్తూ రాజ్యాంగ విలువలను తెలియ చేస్తూ చేపట్టిందే జై బాపూ- జై భీం- జై సంవిధాన్ అభియాన్ పాదయాత్ర అన్నారు. ఈ కార్యక్రమం కంటోన్మెంట్ వ్యాప్తంగా చేపడుతామని కాంగ్రెస్ కార్య కర్తలు ఇంటిఇంటికి వెళ్లి ప్రజలను చైతన్యపరుస్తారని ఎమ్మెల్యే అన్నారు.

ఈ కార్య్ర కమంలో కాంగ్రెస్ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మాదిగలకు రెండు మంత్రి పదవులివ్వాలి



- ప్రొ. గాలి వినోద్ కుమార్, వేల్పుల సంజయ్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో సుమారు 42 లక్షల జనాభా కల్గిన మాదిగలకు ఒక్క మంత్రి కూడా లేదని మంత్రి వర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులు మాదిగలకు ఇవ్వాల్సిందేనని దక్షిణాది జేఏసీ చైర్మెన్ ప్రొ. డా. గాలి వినోద్ కుమార్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు రెండు ఎంపీ, నాలుగు ఎమ్మెల్యే పదవుల్లో అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మాలలకే అవకాశం ఇచ్చారని చివరకు మంత్రి వర్గంలో కూడా ఆరుగురు మాదిగ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అన్యాయం చేస్తే జాతి ఊర్కోదని వర్గీకరణ చట్టం పేపర్లు మాకు మంత్రి పదవులు ఉద్యోగాలు మాల సోదరులకు అయితే కాంగ్రెస్ మాలల పార్టీ అవుతుందని అన్నారు. కాని తెలంగాణలో సింగిల్ మెజార్టీ కులమైన మాదిగల ఓట్ల తోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అందుకే మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దరువు రమేష్, నాగరాజు, సత్యం అంబేద్కర్, రవితేజ, పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగం



- డా. కోటా నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్

సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. కోటా నీలిమ అన్నారు. అమీర్‌పేట్ డివిజన్ పరిధిలోని బీజేఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, నిర్వహణ పనులు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరయ్యారు. పునరుద్ధరించబడిన హాల్‌ను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జీహెచ్ఎంసీ నిధుల నుంచి రూ.12.50 లక్షలతో ఈ పనులకు మంజూరైనట్టు చెప్పారు. అనంతరం, అమీర్‌పేట్ కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ప్రజలకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజా సేవలో కాంగ్రెస్ పార్టీ అంకిత భావంతో ముందుకు సాగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

సీసీఐ సెక్రెటరీగా ఆయుబ్ ఖాన్ ఎన్నిక



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఫిబ్రవరి 10న జరిగిన కన్స్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీగా, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల ఇన్‌చార్జిగా వెంకటగిరిలోని గుడ్ సిటిజన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఆయుబ్ ఖాన్‌ను, మార్చి ఒకటిన ఫలితాలు వెల్లడించి ఆమోదించారు. ఈ ఫలితాలను మంగళవారం రిటైర్డ్ డిస్ట్రిక్ట్, సుప్రీంకోర్టు అడ్వకేట్ నేరెళ్ల మాల్యాద్రి, నేషనల్ సెక్రెటరీ సీసీఐ సతీష్ బాబు సమక్షంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డా. హరిప్రియ రెడ్డి నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీసీఐ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్ భీమ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఏవి రావు, కేఎస్ సుప్రభా సీసీఐ జనరల్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేధించిన పోలీసులు



నవతెలంగాణ-ఓయూ

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ కేసును ఓయూ పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీసీపీ డా. బి. బాలస్వామి వెల్లడించారు. హబ్సిగూడలోని రవీంద్ర నగర్ కాలనీలో ఆశా ఠాకూర్ నివసిస్తోంది. సమీపంలోనే ఆమె అల్లుడైన రంజన్ కుమార్ ఝా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 22న ఆమె బీహార్‌లోని తన స్వగ్రామానికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి, మెయిన్ గేటు తాళం చేతులను వాచ్‌మెన్ శంకర్ దాస్‌కు అప్పగించారు. గత నెల 28న సాయంత్రం ఐదు గంటలకు వాచ్‌మెన్ మొక్కలకు నీరు పోస్తుండగా ఇంటి ప్రధాన డోరు తాళం పగలగొట్టి ఉండడాన్ని గుర్తించారు. కిటికీలోంచి పరిశీలించగా సామాన్లన్నీ చిందరవందరగా కనిపించాయి. వెంటనే రంజన్ కుమార్ ఝాకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన రంజన్ ఇల్లు మొత్తం చూసి రెండు జతల బంగారు గాజులు, రెండు బంగారు గొలుసులు, 8 ఉంగరాలు, ఆరు జతల చెవి రింగులు, రెండు లాకెట్లు, రూ. 12 వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారణ చేపట్టిన పోలీసులు తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్గా చేసుకొని చోరీ చేసే బృందమే నేరం చేసినట్టు నిర్ధారించుకున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పది తులాల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నేరం అంగీకరించారు. మహేష్ (24), ప్రవీణ్ (25), శ్రీకాంత్ (24) ముగ్గురు జప్టోలు డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్నారు. అంబర్‌పేట్‌లోని చెన్నారెడ్డి నగర్‌లో నివాసముండే ఈ ముగ్గురు కలిసి చోరీకి పాల్పడ్డాడు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ నరసయ్య, ఏసీపీ జగన్, సీఐ రాజేందర్, డిటెక్టివ్ ఎస్సై యాసిన్ షరీఫ్, పాల్గొన్నారు.

మున్నూరుకాపులంటే అంత చిన్న చూపా..

- డా. కొండా దేవయ్య పటేల్



నవతెలంగాణ-బంజారాహిల్స్

మున్నూరు కాపులను మోసగించి, చిన్న చూపు చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైనట్టు తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు డా. కొండా దేవయ్య పటేల్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్నూరుకాపు పోర్టు గర్జన సన్నాహక కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్లు కొత్త లక్ష్మణ్, చందు జనార్ధన్, మున్నూరుకాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తం పటేల్లాతో కలిసి ఆయన మాట్లాడారు. మున్నూరుకాపులపై ప్రభుత్వ తీరును నిరుస్తూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే మున్నూరుకాపుల జనాభా 40లక్షల వరకు ఉందని, గడిచిన పదేండ్లలో మరో పది లక్షలకుపైగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 4.20 కోట్ల జనాభాలో కాపు, మున్నూరుకాపుల జనాభా 60 లక్షల వరకు ఉందనీ మున్నూరుకాపుల సంఖ్య అత్యధికంగా ఉందని సాక్షాత్తు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్నా విషయాన్ని వెల్లడించారు. కార్పొరేషన్, హాస్టళ్లు, నిధుల గురించి ప్రస్తావించారని గుర్తు చేశారు. కానీ అవి వట్టి నీటి మూటలేనని గడిచిన ఏడాది కాలంలో అది స్పష్టంగా అర్థమైతుందాని ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి మున్నూరుకాపుల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సామాజికవర్గాన్ని పూర్తిగా విస్మరించిందనీ విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్నూరుకాపులకు సముచిత స్థానం కల్పించారని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి పదువులు కేటాయించారని, మున్నూరుకాపు మహిళలకు సైతం ప్రాధాన్యతన కల్పించడంతో పాటు కోట్లాది రూపాయల బడ్జెట్ సైతం కేటాయించిందనీ అన్నారు. కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో మున్నూరుకాపుల సంక్షేమానికి రూపాయి కూడా ఇవ్వలేదని, రెండు బడ్జెట్‌లో కేటాయించింది గుండు సున్నాలేనని విమర్శించారు. జనాభా దామాషా ప్రకారం కనీసం మూడు మంత్రి పదవులతో పాటు కనీసం కార్పొరేషన్ చైర్మెన్‌కు కూడా నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ సామాజికవర్గంపై కక్షగట్టిందని ఆరోపిస్తూ.. సమగ్ర కులగణనలో మున్నూరుకాపులకు జరిగిన అన్యాయం మరే సామాజికవర్గానికి జరుగలేదని, సుమారు 60లక్షల వరకు జనాభా ఉంటే కేవలం 13 లక్షలని లెక్కలు చూపించారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తన సామాజికవర్గంపై ఉన్న శ్రద్ధ బీసీ కులాలపై లేదన్నారు. ఈ నెల 13న జలవిహార్లో మున్నూరుకాపుగర్జన సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి అన్ని పార్టీలకు చెందిన వార్డు సభ్యుడి మొదలు ఎంపీ వరకు హాజరవుతున్నారని తెలిపారు. అలాగే మేలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో పది లక్షల మందితో మున్నూరుకాపుల గర్జన నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్ సామల వేణు, తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర్లు, మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫక్షరం అధ్యక్షులు ఎడ్ల రవి పటేల్, మున్నూరుకాపు మహిళా సంఘం అధ్యక్షురాలు బండి పద్మ, బండి సంజీవ పటేల్, వనమాల ప్రవీణ్ పటేల్, ఆకుల వెంకట్రావు, మంగళారపు లక్ష్మణ్ పటేల్, హరిశంకర్, నాయకోటి రాజు, సుంకరి నరహరి తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండీలో పాపన్న గౌడ్ వర్ధంతి



నవతెలంగాణ-ఓయూ

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా సీతాఫల్‌మండీలో ఆకారం రమేష్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహంకాళి సికంద్రాబాద్ జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి విచ్చేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ దేశం కోసం రాజ్యం కోసం ఆయన చేసిన పోరాటాలను త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు మొగల్ సామ్రాజ్యాన్ని నిజాం నవాబులను ఎదిరించి పోరాడిన ఘనుడు సర్దార్ పాపన్న అని కొనియాడారు. దేశం కోసం ధర్మం కోసం అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి మొగల్ సామ్రాజవాదులను తరిమికొట్టిన ఘనత పాపన్నది అని తెలిపారు. మొగులను ఎదిరించిన మొట్టమొదటి వ్యక్తిని, గోల్కొండను కైవాసం చేసుకొని పరిపాలించిన ఘనుడు సర్దార్ పాపన్న గౌడని వారి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని మనమంతా ధర్మం వైపు నిలబడాలని దేశం కోసం పనిచేయాలని భరత్ గౌడ్, మేకల సారంగపాణి అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, వెంకటేష్ గౌడ్, పోచయ్య, భాస్కర్ గిరి, శారద మల్లేష్, మేకల కీర్తి హర్ష కిరణ్, వీరన్న, అంబాల రాజు, హనుమంతు ముదిరాజ్, రాము వర్మ, ఇవి నరేష్, ఉపేందర్ యాదవ్, ఆదర్శ్ కుమార్, సౌందర్య, సాయి గౌడ్, అనూష, సరోజినీ గౌడ్, భానుమతి, ప్రభు గుప్తా, సతీష్ ముదిరాజ్, బిక్షపతి యాదవ్ స్థానికులు పాల్గొన్నారు.

ఆలయంలో శ్రీ రామనవమి వేడుకలు

- ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ



నవతెలంగాణ-బేగంపేట్

ఎస్పీరోడ్డు హనుమాన్ ఆలయంలో ప్రతి ఏదాదిలాగే ఈ ఏడాది కూడా శ్రీరామ నవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నామని హనుమాన్ ఆలయ ఈవో ఎం. శ్రీనివాస్ శర్మ అన్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10:30 నిమిషాలకు సీతారామ కల్యాణం జరుగుతుందన్నారు. 12న హనుమాన్ జయంతి ఉందని ఆరోజు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ఆయన తెలిపారు. దేవాలయానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరవుతారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బం దులు కలగకుండా సౌకర్యాలు, చలువ పందిళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేయనున్నట్టు ఆలయ ఈవో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

నవతెలంగాణ- నాగోల్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నాగోలు నువ్వులబండలో నివాసం ఉండే నేనవాత్ ఉషారాం నాయక్(50) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 26న జైపురికాలనీ నుండి నాగోలు వైపు వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనాన్ని ఉషారాం నాయక్ రాంగ్ రూట్లో వెళ్లి ఢీ కొట్టాడు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం వివిధ హాస్పిటల్లో చేర్పించారు. గాయపడిన శ్రీను నాగోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అలాగే ఉషారాం నాయక్ కుటుంబ సభ్యులు మరో రెండు రోజుల తర్వాత ఫిర్యాదు చేసేందుకు వెళ్తే రాంగ్ రూట్‌లో వచ్చి ఢీ కొట్టి మళ్లీ ఎలా ఫిర్యాదు చేస్తారని ప్రశ్నించి.. ఫిర్యాదు తీసుకులేదని ఉషారాం నాయక్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గాంధీ హాస్పిటల్ చికిత్స పొందుతున్న ఉషారాం నాయక్ బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో ఉషారాం నాయక్ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ చేరుకుని ఆందోళనకు దిగారు. తర్వాత పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి ఉషారాం నాయక్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఒప్పందం చేశారు.

జలమండలిలో 10 మంది ఉద్యోగుల పదవీ విరమణ

నవతెలంగాణ-సిటీబ్యూరో



జలమండలిలో 10 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. బోర్డులో వివిధ స్థాయుల్లో పని చేస్తూ రిటైర్ అయిన వీరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాల్ని చెక్కు రూపంలో అందజేశారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో నాణ్యమైన సమయం గడపాలని, జీవితం సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంబర్‌పేట ఆస్పత్రి
భవన నిర్మాణ పనులను త్వరగా చేపట్టండి



- ఆస్పత్రి ఆవరణలో చెత్త వేసేవారికి పెనాల్టీ వేయండి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఎంసీహెచ్ కాలనీలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంబర్‌పేట పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం అంబర్‌పేట్ ఎంసీహెచ్ కాలనీలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు కోసం ఆస్పత్రికి వచ్చిన గర్భిణీలతో వైద్య సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, ఇంజక్షన్ రూమ్ తనిఖీ చేసి.. రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆవరణలోని చెట్లను వేరే చోటికి తరలించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు సూచించారు. ఆస్పత్రి పక్కన గల భవన యజమానులు ఆస్పత్రి ఆవరణలో చెత్త వేసే వారిపై పెనాల్టీ వేయాలని, వినకపోతే క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆస్పత్రిలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ పని చేసేలా చూడాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. ఆస్పత్రికి కావలసిన పరికరాల గురించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో సానిటేషన్ మెరుగ్గా ఉండేలా జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, డీసీహెచ్ఎస్ రాజేందర్, ఆర్డీవో రామకృష్ణ, డీఈఈ జగదీష్ ప్రసాద్, శివ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ దక్షిని, రేంజ్ ఆఫీసర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో
డీఈవో ఆఫీస్‌లో ఘనంగా రంజాన్, ఉగాది వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్. రాజ్ కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, ఈసీ ప్రియాదేవ్ ఠాకూర్, ముజాహిద్, వారి కార్యవర్గంతో పాటు ఫోరం జాయింట్ సెక్రటరీ సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ, పబ్లిక్ సెక్రటరీ అరుణజ్యోతి, ఈసీ శివరాజ్ ఆధ్వర్యంలో బుధవారం గన్‌ఫ్రౌండీలోని డీఈవో కార్యాలయంలో రంజాన్, ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ముస్లిం ఉద్యోగులకు రంజాన్ ఈద్ ముబారక్ విషెస్ తెలియజేశారు.



అనంతరం కార్యాలయ ఏడీ బి. శ్రీనివాస్ రెడ్డికి పూలబోకే అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యూకేషన్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, సెక్రటరీ భాస్కర్, జె.సెక్రటరీ జయంతి రెడ్డి, సూపరిటెండెంట్ జి.రాజ్‌కుమార్, సుగుణా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అర్చన, బబ్లూ, ఖాజా సోహేల్ అహ్మద్‌లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బషీర్ అహ్మద్, ఫయాజ్, విజయలక్ష్మి, రాజేందర్, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, హైమావతి, శశిరత్న, సీపీ రెడ్డి, ఇమ్రాన్, గిరిజ, మధుకర్, అజ్మత్, హనీఫ్, శ్రీకాంత్, సంతోష్, వెంకటేష్, లావణ్య, దేవిప్రసాద్, నుస్రత్, అనిల్, విజయ కుమార్, కృష్ణ, గౌసియా, జాంబయ్య, చైతన్య, కృష్ణ, లక్ష్మీపతి, రియాజ్, పరమేష్, దామోదర్, ఐజాజ్, రవి, సర్ఫరాజ్, రాజేశ్వర్, శశికల, సునీత, శ్రీలత పాల్గొన్నారు.

5న గజల్, నృత్య, సంగీత ఉత్సవాలు

పరిచాయ్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ జైవంత్ నాయుడు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఈ నెల 5న హైదరాబాద్, చారిత్రాత్మక చౌమహల్లా ప్యాలెస్ లో జంట నగరాల కళా ప్రియుల కోసం గజల్, నృత్య, సంగీత ఉత్సవాలు చౌమహల్లా ప్యాలెస్ సౌజన్యంతో పరిచాయ్ ఆర్ట్స్ ఫౌండేషన్ నిర్వహిస్తుందని ఫౌండర్ ట్రస్టీ జైవంత్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ శాస్త్రీయ సంగీతం, గజల్, నృత్యం ద్వారా సాంప్రదాయాన్ని కాపాడటం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రచారం చేయడమే లక్ష్యంగా ఒక రోజు ఉత్సవాలు భారతదేశంలోని ప్రఖ్యాత కళాకారులచే నిర్వహిస్తున్నామన్నారు. 5న సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమవుతాయని, భారతదేశ ప్రముఖ కళాకారులు న్యూఢిల్లీ నుంచి పండిట్ రాజేంద్ర గంగాని (కథక్), భోపాల్ నుంచి పండిట్ ఉమాకాంత్, అనంత్ గుండెచా (ధ్రుపద్), హైదరాబాద్ నుంచి యువ సంచలనం జ్యోతి శర్మ (గజల్) ఈ ఉత్సవంలో ప్రదర్శనలు ఇస్తున్నారని వెల్లడించారు. సంగీతం, నృత్యం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని గుర్తించి చౌమహల్లా ప్యాలెస్ యాజమాన్యం హైదరాబాద్ కళా ప్రియుల కోసం ఇకపై తరచుగా దాని ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించిందని, అందులో భాగమే ఈ ఉత్సవాలు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 3,4 తేదీల్లో ప్యాలెస్ ప్రవేశ ద్వారం రిసెప్షన్ కౌంటర్ వద్ద ఉచిత ఆహ్వాన కార్డులను తీసుకుని రావాలని ఆయన తెలిపారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులు ప్రారంభం



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో భారీ కాంస్య విగ్రహ ఏర్పాటు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గతంలో ఇక్కడ చిన్న విగ్రహం ఉండేది. ఫ్లైఓవర్ నిర్మాణంతో ఆ విగ్రహం చిన్నదై కనిపించకుండా పోతోంది. అదికాక రోడ్డుకు మధ్యలోకి వచ్చింది. దాంతో దాని స్థానంలో మరో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బాగ్ అంబర్‌పేట అంబేద్కర్ నగర్ బస్తీవాసులు మాజీ రాజ్య సభసభ్యుడు వి.హనుమంతరావుకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండడంతో వీహెచ్ సంబంధిత అధికారులతో మాట్లాడి విగ్రహం ఎక్కడ పెట్టాలనేది రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకొని దానికనుగుణంగా పనులకు శ్రీకారం చుట్టారు. పంజాగుట్టలో ఏర్పాటు చేయడానికి తీసుకువచ్చిన అంబేద్కర్ విగ్రహాన్ని తీసుకువచ్చి ఇక్కడ పెట్టడానికి నిశ్చయించారు. బుధవారం అక్కడ నుంచి విగ్రహాన్ని తీసుకువచ్చి శ్రీరమణ చౌరస్తాలో ఏర్పాటు చేసేందుకు పనులను మొదలుపెట్టారు. ఈనెల 14వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. విగ్రహ ఏర్పాటు పనులను టీపీసీసీ కార్యదర్శి శుంభుల శ్రీకాంత్ గౌడ్, అంబేద్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటం అనిల్ కుమార్, కన్వీనర్ ఆర్.బాల్ రాజ్, కుంకుమ నరేందర్, కుంకుమ బలరామ్, కె.శివకుమార్, సభ్యులు కూరన్న కిషన్, పి.అశోక్ కుమార్, ఎస్. ప్రేంకుమార్, రావుల ప్రదీప్, సుంకం మన్మోహన్, కుంకుమ శ్రీకాంత్, సుంకం క్రాంతికుమార్, ఏడెల్లి రాకేష్, కుంకుమ మనీష్, ఎన్.శ్రీహరి తదితరులు పరిశీలించారు.

వక్ఫ్ బోర్డు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ రాష్ట్ర వ్యవస్థాపకులు జాతీయ కార్యదర్శి బి. పురుషోత్తం

నవతెలంగాణ - ముషీరాబాద్

వక్ఫ్ బోర్డు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, వ్యవసాయ సాగుకు పేదలకు అందించాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ రాష్ట్ర వ్యవస్థాపకులు జాతీయ కార్యదర్శి బి. పురుషోత్తం తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ రాష్ట్ర సెంటర్ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. అటు దేశంలో ఇటు రాష్ట్రంలో కొన్ని వేలాది ఎకరాల భూములు వక్ఫ్ బోర్డు కింద ఆక్రమానికి గురయ్యాయని.. ఈ భూములన్నింటిని సవరణ చేసి పేదలు వ్యవసాయం సాగు చేస్తూ జీవించడానికి అందించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కొన్ని దశాబ్దాల క్రితం భారతదేశం నుంచి వెళ్లిపోయిన ముస్లిం పేదల భూములను వక్ఫ్ బోర్డు పేరుతో కొందరు ముస్లిం సోదరులు ఆక్రమించారని ఆరోపించారు.

2014లో బాలాపూర్ మండల పరిధిలోగల కురుమలు కూడా గ్రామంలో 100 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డ్ పేరుతో ఆక్రమించుకున్నారని తెలిపారు. ఇందులో గత 78 సంవత్సరాల నుండి వ్యవసాయం సాగు చేస్తూ జీవిస్తున్నటువంటి పొద్దంతా కష్టపడి పని చేస్తే కడుపునిండని పరిస్థితి ఉన్న పేద రైతుల నుంచి ఈ భూములు లాక్కొని అక్కడక్కడ ఈ స్థలంలో ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్నారన్నారు. దీనినే సర్వే చేసి నిజమైన లబ్దిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 80/3-80/6-80/4-80/24 భూములలో బ్రాహ్మణ ట్రస్టులకు, క్రిస్టియన్ స్మశాకు ఎలాంటి ఒక్క రూపాయి నష్టపరిహారం చెల్లించకుండా స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓట్ల లబ్ది కోసం ట్రస్టులకు కేటాయించడం చాలా సిగ్గుచేటన్నారు. వీటిని సర్వే చేసి నిజమైన లబ్దిదారులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE CUM VIII, AJM OF FIRST CLASS, RANGAREDDY DISTRICT, AT KUKATPALLY
O.S.No. 899 OF 2022

Between:
D.Satish Babu & another .... Plaintiffs
And
K.Gopi Prasad & another .... Defendants

NOTICE TO DEFENDANT No.2
K. Ravindra Babu S/o.K.Ramanaiah, R/o.Flat No.303, Gayathri Devi Nilayam, Kukatpally, Nizampet Road, Medchal Malkajgiri District
Take notice that the above named Plaintiff filed the above suit against defendants and the said case is posted to **16.04.2025** for your appearance either in person or through an Advocate, duly instructed by you otherwise the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
K.V.JANARDHAN RAO
Advocate
Plot No.9, Durganagar Colony, Panjagutta, Hyderabad – 82.
Counsel for the Plaintiff

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ క్రిష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M O.P NO. 189/2024

Between:
సామినేని మల్లిక @ నాంచారమ్మ తల్లి ...పిటీషనర్
మరియు
సామినేని జగన్నాథ ప్రభాకర్ ...రెస్పాండెంటు

To, రెస్పాండెంటు :
సామినేని జగన్నాథ ప్రభాకర్, తండ్రి : శ్రీరామారావు, డోర్ నెం. 3-4-23/1, 1వ అంతస్తు, సాయి గార్డెన్ ఫంక్షన్ హాలు దగ్గర, నరసింహనగర్, మల్లాపూర్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు O.P. లో పిటీషనరు, రెస్పాండెంటు పైన విడాకుల నిమిత్తం పై నెంబరు గల పిటీషన్‌ను పై కోర్టులో దాఖలు చేసియున్నారు, కావున సదరు పై అడ్రస్సు గల రెస్పాండెంటుకు ఎట్టి అభ్యంతరములు అయిననూ వున్న యెడల ది: 22-04-2025న పై కోర్టు వారి యెదుట ఉదయం. గం.10.30 లకు స్వయముగా గానీ లేదా అడ్వకేటు గారి ద్వారాగానీ హాజరై తెలుపుకొనవలయును, లేని యెడల మీ పరోక్షము నందు తదుపరి గ్రంథములు జరుపబడునని ఇందు మూలముగా తెలియజేయుటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 22-04-2025
మచిలీపట్నం
ది: 02-04-2025
జె.ఎం. ప్రసాద్ (జె.పి)
పిటీషనరు తరఫున న్యాయవాది
సెల్: 9848089851

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT SANGAREDDY
AS.No. 05 OF 2025

BETWEEN:
Smt.Santha Bai Sarda ...Appellant
AND
Thummanapally Sri Venkatesh & Others ...Respondents

To
Thummanapally Sri Narayana S/o. Sanganna, aged about 55 years, Occ: Service, R/o H.No.6-3-788/14, 1st Floor, Opposite lane to Gold spot, Ameerpet, Hyderabad.
(Respondent No.6)

Take notice that, the above case vide AS.No.05/2025 stands posted to 28-04-2025 at 10.30 A.M for your appearance before the Hon'ble I Additional District and Sessions Judge, Sangareddy. In default of your appearance on that day the matter will be heard ex-parte and decided accordingly.

//BY ORDER OF THE COURT//
B.ANIL REDDY
ADVOCATE,
SANGAREDDY
Cell: 9490221753

LOST OF DOCUMENT
I Annam Srinivasulu S/o Annam Venkata Ramanaiah, R/o Bitragunta, Bogole, Gowravaram, Kavali, Nellore, A.P.-524142. I have lost my original Sale deed Document 9210/1989 SRO Uppal while travelling from Chengicherla to Medipally. If found please contact me: 9246968909

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT SANGAREDDY
IA.No.62 OF 2025
IN
AS.No. 05 OF 2025

BETWEEN:
Smt.Santha Bai Sarda ...Petitioner/Appellant
AND
Thummanapally Sri Venkatesh & Others ...Respondents/Respondents

To
Thummanapally Sri Narayana S/o. Sanganna, aged about 55 years, Occ: Service, R/o H.No.6-3-788/14, 1st Floor, Opposite lane to Gold spot, Ameerpet, Hyderabad.
(Respondent No.6)

Take notice that, the above case vide IA.No.62/2025 in AS.No. 05/2025 stands posted to 28-04-2025 at 10.30 A.M for your appearance before the Hon'ble I Additional District and Sessions Judge, Sangareddy. In default of your appearance on that day the matter will be heard ex-parte and decided accordingly.

//BY ORDER OF THE COURT//
B.ANIL REDDY
ADVOCATE,
SANGAREDDY
Cell: 9490221753

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
O.S.No.504 of 2015

Between:
Ragi Upender Reddy and other ...Plaintiffs
And
Smt.R.Janaki Reddy & others ...Defendants

To
D-11. T.L.Ramanmurthy S/o. T.B.N.Subbarayudu, Aged about 50 years, Occ: Employee, R/o.Flat No.403, GK Anushka Apartments, Maniksai Enclave, Sainikpuri Secunderabad-500094
D-13.K.A.S.B.P.Kiran S/o.Late K.Tirupataiah, Aged about 44 yrs, Occ: Business, R/o.148-A, Eswaripuri Colony, Sainikpuri, Secunderabad.
D-14.Smt.K.Kalyani D/o.Late K.Tirupataiah, Aged about 47 yrs, Occ: Housewife, R/o.148-A, Eswaripuri Colony, Sainikpuri, Secunderabad.
D-15. Smt. K.Srilatha D/o.Late K.Tirupataiah, Aged about 45 yrs, Occ: Private Service, R/o.148-A, Eswaripuri Colony, Sainikpuri, Secunderabad.
D-17. S.K. Afsar S/o.Aziz Mohd., Aged about 51 years, Occ; Business, R/o.3-138, Mocha Bollarum, Secunderabad

Take notice that the plaintiffs herein have filed the above suit for declaration, partition and separate possession and rectification of revenue entries and consequential relief in respect of suit schedule properties. The above suit is posted on 08-04-2025 at 10:30 A.M. for your appearance. You may appear in person or through Advocate, otherwise the proceedings may proceed in your absence.

// BY ORDER OF THE COURT //
A.KESHAV REDDY,
Advocate,
H.No.3-4-129/A, Barkatpura, Hyderabad-27
Counsel for the Plaintiffs

IN THE COURT OF THE II ADDL. J.F.C.M. AT KOTHAGUDEM
C.C. NO. 73/2016

Between:
Dr.C.R.P.S.Krishna ...Complainant
And
Sky Tech Elevators, rep. by K.Sekhar ...Accused

To
Accused: Sky Tech Elevators, rep. by K.Sekhar, D.No. 8-2-272/31, Shoukat Nagar, Brand Factory, Adjacent to Lot Mobiles Lane, Road No.2, Banjara hills, Hyderabad-500 034.

Whereas the Complainant has filed the above case against the Accused Under Sec.138 of N.I.Act , you have appeared before the court and failed to furnish surety, consequently non-bailable warrant issued against you and the case is posted to **23-04-2025** Hence, you are hereby informed to appear before this court on **23-04-2025 at 10.30 A.M.** either by yourself or through your Council. Failing which you will be declined as proclaimed offender by this court.

// BY ORDER OF THE COURT / /
MSR RAVI CHANDRA
SK KHADAR
Advocates
Kothagudem Kothagudem
Dt:02-04-2025 Cell : 9866344930

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: Hyderabad
O.S.No. 4510 Of 2023

Between:
Jaya Surgical & Pharma Pvt.Ltd., rep.by its Manager Mr.B.Madhu Gopal ...Plaintiff
And
Sree Lakshmi Gayatri Hospitals pvt.ltd, rep.by its Director cum GPA holder Dandu Kasi Annapurna and others ...Defendants

To
1.Chamarthi Valli Gayatri D/o. Not known to plaintiff, aged :Major, Occ: Director, O/o. Sy.No.306, Lower Ground Room No.6, Nizampet Road, Bachupally, Qutubullapur Mandal, Medchal-Malkajgiri District-500090.
2.Chamarthi Mallikarjun S/o. Not known to plaintiff, aged :Major, Occ: Director O/o. Sy.No.306, Lower Ground Room No.6, Nizampet Road, Bachupally, Qutubullapur Mandal, Medchal-Malkajgiri District-500090.

The Plaintiff filed the above suit No.4510 of 2023, against you along with other Defendants for recovery of an amount of Rs. 7,88,415/ for the Medicines supplied to you and the Hon'ble court ordered service of notice to you by way of paper publication in Telugu daily newspaper, and the said case is posted on: 16-04-2025 at 10.30 A.M. for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble XIX Junior Civil Judge Citi Civil Courts, Hyderabad on: 16-04-2025 at 10.30 A.M., either in person or through Advocate, failing which the case will be adjudicate in your absence according to law.

//By order of the Hon'ble court//
N.RAMAPPA
& Smt.G.Mamatha
Advocates
Flat No.103, H.No.1-8-528, Janakirama Apartments, St.No.7, Chikkadpally, Hyderabad-500020, Cell No.9849471781

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE, AT: MEDCHAL
O.S.No. 181 OF 2025

BETWEEN:
1. Edara Usha Sree @ Inturi Usha Sree, W/o. Late. Edara Lakshmi Sekhar Babu, aged about: 55 years, Occ: HouseWife,
2.Edara Deepak Chowdary, S/o.Late.Edara Lakshmi Sekhar Babu, aged about: 27 years, Occ: Business, Both are R/o. Plot No. 158/159, Praneet Nature Bounty, Shambipur, Tirumalagiri, Hyd Telangana – 500 043. presently known as Shambipur Village, Bowrampet Grampanchayat, Dundigal-Gandimaisamma Mandal, Medchal-Malkajgiri District - 43 ...PLAINTIFFS
AND
1.The Tahasildar/Mandal Revenue Officer, Dundigal-Gandimaisamma Mandal, Medchal-Malkajgiri District.
2.All Concerned. ....Defendants.

Whereas the above named Plaintiff has filed a suit for declaration of legal heir vide OS No.181 of 2025 against Tahasildar/MRO, Dundigal-Gandimaisamma Mandal & All concerned. The above O.S. is posted on 30/04/2025 at 10.30 am praying to declare the plaintiffs are legal heirs of Late. Edara Lakshmi Sekhar Babu. If any person, persons or any Lending institutions statutory authorities are having any claim over the above having any objections are hereby called upon to appear before the Hon'ble Court on the above mentioned date with all details and legally valid documents on which they rely upon., failing which Hon'ble Court shall proceed without any further notice and that subsequently thereafter No claims whatsoever and any objections shall be valid nor entertained.

(By order of the Hon'ble Court)
K.RAMA LAKSHMI
ADVOCATE
Plot No. 605, HMT Hills, Kukatpally, Hyderabad (TG)

IN THE HON'BLE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT: HYDERABAD
F.A.No.601/2024

Between:
Sri.A.V.S.Prasad ...Appellant/Complainant
A N D
1)Sri Satya Sai Constructions, Rep by its Managing Partners Sri.V.L.N.Bharadwaj, And Sri.G.Santharam, Road No.1, Haripuri Colony, Saroor Nagar, Ranga Reddy Dist & others ...Respondents/opposite parties

To
Sri Satya Sai Constructions, Rep by its Managing Partners Sri.V.L.N.Bharadwaj, And Sri.G.Santharam, Road No.1, Haripuri Colony, Saroor Nagar, Ranga Reddy Dist ...Respondent No.1

Please take notice that the above named Appellant have filed the above said appeal before this Hon'ble Commission to aggrieved by the orders in CC No.376/2019 dated 21.05.2024 passed by the District Consumer Disputes Redressal Commission, Ranga Reddy dist at L.B.Nagar and please take notice on behalf of commission appear through person or any advocate on 24.04.2025 before the above mentioned Hon'ble Commission at 10.30 AM and if no objection is received on that day, then the Hon'ble Court will decide / adjudicate the matter on merits.

// By Order of the Hon'ble Court //
M/s.V.S.R.M.V.PRASAD SANAKA
Harika Ralli
D.Venkatesh, Advocates
FLAT NO.206, Anuradha Apartments, H.NO.8-3-982/5, Srinagar Colony Yellareddyguda,Hyderabad.
(COUNSEL FOR THE APPELLANTS), Ph:9951097468

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE: CITY CIVIL COURT :: AT: HYDERABAD
A.S.S.R No. 24504 OF 2024

BETWEEN:-
M.Devi Sravanthi, W/o M.Santhosh, R/o Flat No. 404, H.No.17-119/87, Sahitha Abode Apartment, Annapurna Cooperative Housing Society, Malkajgiri, Secunderabad. .... Appellant / Defendant
AND
Smt.Sriram Manjula W/o late S.Venugopal, R/o H.No.1-2-387/14, Domalguda, Near A.V College, Unda Bagh, Hyderabad-500029. ....Respondents/Plaintiff

NOTICES
To
Smt.Sriram Manjula,
Please take notice that the above-named plaintiff filed the Appeal Suit IA 6733/24 IN ASSR 24504 /2024 against the Judgement and decree dated 23.04.2024 in OS No 2697 of 2020 passed by THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, Hyderabad. And the matter is posted on 11 TH APRIL 2025. For appearance and counter, any concern, as such if any persons is/ are having any objections, they may appear before this Court on 11 TH APRIL 2025 at 10:30 A.M either in person or through an ADVOCATE, duly instructed by you, failing which the matter will be decided by setting you ex-parte.

//By order of the Court //
G C RAJ KIRAN
ADVOCATE
6-2-537 , Chintal Basthi, Khairatabad Hyderabad, Cell No 8309501420

IN THE COURT OF THE HON'BLE X ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
MV OP No. 1463 OF 2024

Between: -
Rathlavath Bhuramma and four others ...Petitioners
And
Parthasarathy Logistics Private Limited & two others ...Respondents

To
R-1.PARTHASARATHY LOGISTICS PRIVATE LIMITED Represented by its Sudhini Vinod Reddy, Occ: Owner of Crime vehicle Lorry bearing No.TS 34 TB 0499 R/o Survey No 23 & 24, Gopanpally, Goutapur, Grampanchayathi, Thandur, Vikarabad Dist,Telangana State.
R-2 Venkat Reddy M S/o Badra Reddy Age 51 years, Occ: Driver of Crime vehicle Lorry bearing No.TS 34 TB 0499 R/o H.No.1-65 Post office Kotapahad, Athakr S, Atmakur (S) Suryapet-508212.

NOTICE
Whereas the petitioners have filed the above Motor Vehicle Compensation Claim Petition against you, you are hereby directed to appear before this Hon'ble Court in person or through an Advocate on 04/04/2025 at 10:30 AM, to answer the claim. You are further directed to produce all documents upon which you intend to rely in support of your defense on the said date.
Take notice that, in case of your failure to appear on the said date, the above-mentioned MVOP No. 1463 of 2024 will be heard and decided in your absence.

(BY ORDER OF THE COURT)
E.KISHORE KUMAR
Advocate
Flat No 503, Samyuktha Sun Rise Vista Apartment, Vinay Nagar Colony, Saidabad Hyderabad -500 059, Mobile Phone No. 98489 33639

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 908 of 2024

BETWEEN:
Shaik Karimunnisa ...PLAINTIFF
AND
Sri.Shankar & Others ...DEFENDANTS

NOTICE
To:
1.Sri.Shankar S/o. Not Known to plaintiff Aged about 40 years, Occ: working in PNR Events, R/o. Plot No. 4, Rte X Road, Mahila Sabha road, Hyderabad-500044
2.Sailu Nagamaiah Kunta Kumar S/o. Not Known to plaintiff Aged about 43 years, Occ: Business R/o. Plot No.2, Near by X Road 2, Vidya Nagar, Hanuman Nagar, Hyderabad-500044
3. Palagar Masuma Kumar S/o. Not Known to plaintiff Aged about 45 years, Occ: Business, R/o. H.No.1-9-164/5/10, Laxmi Nagar, Hyderabad-500071 ...DEFENDANTS No.1-3

Please take notice that the above named plaintiff filed the above said case for Perpectual Injunction, which is posted on 02.05.2025, for your appearance, therefore you are hereby advised to appear before the above said Hon'ble court on 02.05.2025 at 10.30AM either in person or through an Advocate, failing which the matter will be decided exparte.

(BY ORDER OF THE COURT)
Sd/-
N. Bojjaiah (Ganesh)
Advocate,
Ph.No.9440484059
Counsel for the Plaintiffs

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM X ADDI CHIEF JUDGE COURT CITY CIVIL CORT AT: HYDERABAD
M V O P. NO.1075 OF 2024

Between
Musunuri Ramanujamma and Others. ...Petitioner
And
Anil Kumar and Others. ....Respondents

To,
1.Anil Kumar,S/o.Padma Kanth Occ:Driver,R/o.Tyoga Bhoganipur, Debair ,Kanpur Dehat , Uttar Pradesh. ....Respondent 1

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 20-5-2025 .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s.V.Venkateshwara Rao,
Advocate
Uppal ,Hyderabad

IN THE HONOURABLE COURT OF THE IInd DISTRICT CONSUMER REDRESSAL COMMISSION, AT: VISAKHAPATNAM
C.C.No.354/2024

Between:
1. Malireddy Venkata Srinivasa rao s/o Narayana murthy, age 52, resident of D.no.17/15, besides Santhi Kalyana mandapam, Vegivari veedhi, Pendurthi -531 173, Visakhapatnam GVMC. Cell:9441569131, Aadhar : 782011745580. ...Complainant.
And
1.Dawntech Electronics Private Limited, rep.by its Authorized Signatory, situated at Sy.No.34/2 AA, Bahadurguda Nagaram, Rangareddy, Telangana, Hyderabad, Telangana 501218.
2.Amazon.in represented by Authorized Signatory, having its registered office Navghar Post, JNPT Taruran, Dist Raigad, Navi Mumbai, Maharastra 400707, India. ...Opposite Parties

NOTICE
TO
Opposite Parties
1.Dawntech Electronics Private Limited, rep.by its Authorized Signatory, situated at Sy.No.34/2 AA, Bahadurguda Nagaram, Rangareddy, Telangana, Hyderabad, Telangana - 501218.
2.Amazon.in represented by Authorized Signatory, having its registered. office Navghar Post, JNPT Taruran, Dist Raigad, Navi Mumbai, Maharastra-400707, India.

Please take Notice that the above named complainants has Instituted. The above case against you and the above matter is stands posted to 16-04-2025 for your appeared before the Honorable district Consumer - 2 at Visakhapatnam at VUDA complex, Siripuram, Visakhapatnam at 10.30 A.M, either yourself in person or any person Authorized by you failing which the Honorable Commission, will proceed with the matter as per Law.

"BY ORDER OF THE HONOURABLE 2nd COMMISSION"
Sd/-
B.V.R.M.Benarjee
Advocate,
Visakha Bar & High Court Advocate, Amaravathi. A.P.
Ph: 9014327233/9490156449

బైక్‌లపై స్టంట్స్ చేస్తూ యువకుల హల్‌చల్

- ముగ్గురిపై కేసు నమోదు

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ద్విచక్ర వాహనాలపై స్టంట్స్ చేస్తూ ఓ మహిళను భయభ్రాంతులకు గురిచేసిన ముగ్గురు యువకులపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. సుల్తాన్ బజార్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం ..కోఠి ఇసామియా బజార్‌లో అజయ్ కుమార్ తుల్షాన్ అనే వృద్ధుడు ఆయన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో ముగ్గురు గుర్తుతెలియని యువకులు బైక్ లపై స్టంట్స్ చేసుకుంటూ ఆ మార్గంలో వెళ్తున్న మహిళను భయభ్రాంతులకు గురి చేశారు. దీనితో వృద్ధుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు దాంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా 12 గంటల్లో చాదర్ ఘాట్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షోయబ్, ఎండి. ఇర్ఫాన్ అలీ, మహమ్మద్ అక్బర్‌లు ద్విచక్ర వాహనాలపై స్టంట్స్ చేస్తూ దూషించారని గుర్తించారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేశారు.



ఢిల్లీలో మాజీ రాజ్యసభ సభ్యులు వీ హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ భద్రయ్య, లేబర్ మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం,పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కష్ణ గౌడ్ తదితరులు.
నవతెలంగాణ -అంబర్‌పేట

మండుతున్న ఎండలు



పెరిగిన వాటర్ ట్యాంకర్ల డిమాండ్
గ్రేటర్‌లో 3500 మిలియన్ లీటర్ల డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో ఎండలు మండుతున్నాయి.... భూగర్భ జలాల పరిస్థితి ఆందోళకరంగా ఉన్నాయి....దాదాపు కోటీ 30 లక్షల జనాభ కలిగిన హైదరాబాద్‌కు రోజూ తాగునీరు సరఫరా చేయడం పెద్ద సవాలుతో కూడుకుంది. ఇందుకుతోడు గ్రేటర్ పరిధిలో సుమారు 3.29లక్షల వరకు చిన్న, పెద్ద అపార్టుమెంట్స్ వరకు ఉన్నాయి. గ్రేటెడ్ కమ్యూనిటీలతోపాటు సుమారు 72వేలకుపైగా బహుళ అంతస్తులున్నాయి. నగరంలో తగినంత స్థాయిలో భూగర్భ జలాలు లేకపోవడంతో 150 కిలో మీటర్ల నుంచి పెద్ద పంపులు, భారీ పైపుల ద్వారా నగర పౌరులకు జలమండలి తాగునీటి తరలిస్తోంది. గ్రేటర్‌తో పాటు ఔటర్ పరిధిలోని ప్రాంతాల్లో రోజుకు 3500 మిలియన్ లీటర్ల నీటి డిమాండ్ ఉండగా, వాటర్‌బోర్డు సుమారు 2,600మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తోంది. అయితే నగరంలో అవసరానికి మించి నీటిని వినియోగించడంతో తాగునీటికి మరింత డిమాండ్ ఏర్పడింది. కొందరు నల్లాలకు మోటార్లు బిగించి నీటిని లాగేస్తున్నారు. దాంతో ట్యాంకర్ల నీటిపై ఆధారపడక తప్పని పరిస్థితి నెకొంది. జలమండలి సరఫారా చేస్తున్న ట్యాంకర్లతోపాటు ప్రయివేటు ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో వాటర్‌బోర్డు ట్యాంకర్లకు తక్కువ ధర ఛార్జ్‌చేస్తున్నా, ప్రైవేట్ నీటి వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది.

22వేల మంది 90 శాతం ట్యాంకర్ల బుకింగ్

గతేడాదితో పోల్చితే ట్యాంకర్ల బుకింగ్ 60శాతం పెరిగింది. నగరంలో 955లకుపైగా ట్యాంకర్లుండగా, 80ఫిల్లింగ్ స్టేషన్లున్నాయి. 127 ఫిల్లింగ్ పాయింట్స్ ఉన్నాయి. అయితే 13.52 లక్షల కనెక్షన్లలో 42 వేల గృహాలు రోజువారీగా 6వేలకు పైగా వాటర్ ట్యాంకర్లను బుకింగ్ చేస్తున్నారు. అందులో. 22వేల మంది 90 శాతం ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. 5000లీటర్ల వాటర్ ట్యాంకర్‌ను వాటర్‌బోర్డు కస్టమర్ అకౌంట్ నంబర్ (సీఏఎన్) ద్వారా బుక్ చేసినవారికి రూ.500లకు సరఫరా చేస్తున్నారు. సీఏఎన్ లేని వారికి మాత్రం అదే ట్యాంకర్‌ను రూ.850కి సరఫరా చేస్తోంది. కానీ అదే ట్యాంకర్ ప్రయివేటులో తెప్పించుకోవాలంటే ప్రాంతాన్ని బట్టీ డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. అయితే వేసవిని దృష్టిలో పెట్టుకుని జలమండలి ఎండీ అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరాచేసే దాంట్లో ఎక్కడ నీటి సరఫరాలో జాప్యం జరగకుండా అధికారులకు అన్ని సూచనలు సలహాలను అందించారు. వెయిటింగ్ పిరియడ్, పెండెన్సీ తగించే విధంగా ఆదేశాలించారు. ట్యాంకర్ మేనేజ్‌మెంట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ బుకింగ్ మొదలు, డెలివరీ వరకు సమాచారాన్ని తెలుసుకునే విధంగా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం 955 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. వాటిస్థానంలో 1000 ట్యాంకర్లతో సరఫరా చేయాలని ఎండీ లక్ష్యంగా పెట్టుకున్నారు.



ప్రతి బొట్టును ఒడిసిపట్టి, భవిష్యత్తు తరాలకు అందించాలి

ప్రపంచంలో జీవకోటికి ఆక్సిజన్ తర్వాత అంతటి విలువైంది నీరు మాత్రమే అని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఆక్సిన్ లేకపోతే ఒక నిమి షం కంటే ఎక్కువ సేపు బతకలేమని, అదే నీరు లేకపోతే ఒకట్రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు బతకడం కష్టమని చెప్పారు. నీరు అనేది విలాసవం తమైనది (లగ్జరీ) కాదని, అది అత్యవసరమైనది (నెస్సెసిటీ) అని చెప్పారు. అందుకు ఇంతటి ప్రాముఖ్యమైన నీటిని వృథా చేయకూడదన్నారు. ప్రతి బొట్టును ఒడిసిపట్టి, భవిష్యత్తు తరాలకు అందించాలని కోరారు. జలమండలి సరఫరా చేస్తును తాగునీటిని కొందరు వృథా చేస్తున్నారని, మరికొందరు వాహనాను శుభ్రంచేసేందుకు వినియోగిస్తున్నారని తెలిపారు. నీటిని వృద్ధా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి

- ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- నాంపల్లి ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌ఎన్ మారనత

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యుని సంప్రదించాలని నాంపల్లి ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌ఎన్ మారనత అన్నారు. బుధవారం నాంపల్లి ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతూ... ఎండాకాలంలో ప్రజల ఇండ్ల వద్దకు తమ ఆశ కార్యకర్తలు వెళ్లి ఓఆర్‌ఎస్ పాకెట్లు అందిస్తున్నారని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయ వంతం చేస్తున్నామన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు, మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధ టీకాలను తమ ఏఎన్‌ఎంలు అందిస్తున్నారని చెప్పారు. మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, ఎండాకాలంలో ముఖ్యంగా నీరు కలుషితం వలన టైఫాయిడ్ వస్తుందని ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి టీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. లెప్రసీ సర్వే పూర్తయిందని చెప్పారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నామన్నారు. ఎండకు నీలవిరేచనాలు అయితే, వడదెబ్బ తలిగితే వెంటనే ప్రజలు వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు జి మాధవి, కే శారద, ఆర్ దీప, ఎం శారద, అకౌంటెంట్ సందీప్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అణచివేత చర్యలతో ఉద్యమాలను ఆపలేరు



- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జే.వెంకటేష్
- పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలి : ఎం. వెంకటేష్
- ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద నిరసన

నవతెలంగాణ-ముషీరాబాద్

అణచివేత చర్యల ద్వారా ఉద్యమాలను ఆపలేరని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జే.వెంకటేష్ అన్నారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను కాపాడుకునేందుకు స్థానిక విద్యార్థి సంఘం వీరోచితంగా పోరాడుతున్నదని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా ధర్నా చేస్తున్న పార్టీ రాష్ట్ర నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి అణచివేత చర్యల ద్వారా ఉద్యమాలను ఆపలేరని, ఇప్పటికైనా తప్పును గ్రహించి, సవరించుకొని 400 ఎకరాల హెచ్‌సీయూ భూములను వెంటనే యూనివర్సిటీకి అప్పజెప్పాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్ మాట్లాడుతూ నగరానికి తలమానికంగా, పర్యావరణ కేంద్రంగా సెంట్రల్ యూనివర్సిటీ ఉండడం గర్వకారణమన్నారు. అయితే పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ 400 ఎకరాలలో భూమి చదును చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆ భూమి నుంచి వైదొలగాలని, పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలని, లేనియెడల ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ జ్యోతి, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, ఎం.మహేందర్, కే.ఎస్ రాజన్న, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్, జే. కుమారస్వామి, జి. కిరణ్, జి. నరేష్, అశోక్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ సీతారామ కల్యాణానికి గవర్నర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సీతారాం బాగ్ లోని సీతారామ మందిరంలో శ్రీ సీతారామ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు.. ఈ మహోత్సవానికి రావాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మను నిర్వాహకులు ఆహ్వానించారు. భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానం పలికారు. దాదాపు 300 సంవత్సరాల చరిత్ర గల సీతారాం బాగ్ లోని సీతారామ మందిరంలో ప్రతి సంవత్సరం వైభవంగా రాముల వారి కళ్యాణం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తనకు ఆహ్వానం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అనంతరం సభ్యులందరినీ పేరుపేరునా పరిచయం చేసుకొని అభినందించారు. ఉత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ భగవంతురావు, ప్రధాన కార్యదర్శి గోవిందరాఠి, ఉపాధ్యక్షులు మెట్టు వైకుంఠం, కోశాధికారి శ్రీరామ్ వ్యాస్, సభ్యులు రామరాజు, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముక్ పగుడాకుల బాలస్వామి గవర్నర్ ను కలిసిన వారిలో ఉన్నారు.



గ్రామ పంచాయతీ కార్మిక రాష్ట్ర మహాసభ గోడ పత్రికావిష్కరణ

నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టీయుసీఐ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జి.పి. కార్మికులు హాజరై భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవాలని పిలుపునిస్తూ బుధవారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో గోడ పత్రికను టీయుసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్. పద్మ, ఎం. హన్మేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. వెంకటేష్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు పెరిగిపోతున్న ధరలతో చాలీచాలని జీతభత్యాలు నెలకు కేవలం రూ.9,500తో మ పంచాయతీ కార్మికులు జీవించడం గగనంగా మారిందన్నారు. జి.పి. కార్మికులకు మున్సిపల్ కార్మికుల మాదిరి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పి.ఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలని సాగే ఉద్యమంలో పాలు పంచుకోవాలని, దానికై మహాసభలలో చర్చించనున్నట్టు చెప్పారు. కనుక మహసభలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ప్రమాదభరితంగా సంజయ్ గాంధీనగర్ మున్సిపల్ క్వార్టర్స్

- మెట్లు కూలి రేకుల ఇంటిపై పడిన సిమెంటు గడ్డలు
- మంచంపై ఉన్న చిన్నారికి తృటిలో తప్పిన ప్రమాదం
- సంఘటన స్థలాన్ని సందర్శించిన జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు

నవతెలంగాణ-అంబర్‌పేట

గోల్నాక డివిజన్ సంజయ్ గాంధీనగర్ లో గల మున్సిపల్ క్వార్టర్స్ ప్రమాదభరితంగా తయారయ్యాయి. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం అక్కడి వారికి పట్టుకుంది. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఈ క్వార్టర్స్‌ను ఆనుకొని రేకుల ఇండ్లలో ఉంటున్న వారు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా బుధవారం శిథిలావస్థకు చేరిన ఓ క్వార్టర్స్‌కు చెందిన మెట్టు కూలి సిమెంటు గడ్డలు కింద ఉన్న రేకుల ఇంటిపై పడి రేకులు విరిగి లోపల పడ్డాయి. అయితే ఎక్కడైతే ఆ సిమెంటు గడ్డలు పడ్డాయో దాని పక్కనే మంచంపై ఓ చిన్నారి పడుకొని ఉంది. అదృష్టవశాత్తు ఏమీ కాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే కటుంబం పెద్ద దిక్కును కోల్పోయి ఇబ్బందుల్లో ఉండగా ఈ సంఘటన వారిని మరింత భయభ్రాంతులకు గురిచేసింది.

బుధవారం ఉదయం 10 గంటల సమయంలో రేకుల ఇంటి ఇంట్లో నివసిస్తున్న చంద్రమణిభాయి అనే మహిళ డికాషన్ తాగుతూ ఉంది. తన కూతురు వందసింగ్ రెండు రోజుల క్రితమే ఇంటికి వచ్చింది. అలాగే ఏడాది లోపు గల మనుమరాలు నిత్యాసింగ్‌ను ఉదయం ఇంట్లో మంచంపై పడుకోబెట్టారు. అదే సమయంలో ఆకస్మాత్తుగా పై నుంచి ధమాల్ అంటూ పెద్ద సిమెంటు గడ్డ రేకులను పగులగొట్టుకుంటూ ఇంట్లో పడింది. అయితే అదృష్టవశాత్తు ఆ గడ్డ చిన్నారి ఉన్న మంచం పక్కనే పడింది. అదే పెద్ద ఆ చిన్నారిపై పడితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య తమ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. శిథిలావస్థకు చేరిన ఆ క్వార్టర్స్ ను పరిశీలించారు. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో నోటీసులు ఇచ్చి వారిని అక్కడ నుంచి ఖాళీ చేయిస్తామని చెప్పారు. అలాగే గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ సంజయ్ గాంధీనగర్ కీ వచ్చి విషయాన్ని తెలుసుకున్నారు. పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. అయితే క్వార్టర్స్ పురాతనమైనవి కావడంతో ప్రభుత్వం వీటిని కూల్చివేసి అక్కడ పక్కా ఇండ్లను కట్టించాలని, అందుకు స్థానికులు కూడా సహకరించాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకుడు కన్నె రమేష్ యాదవ్ కూడా ఘటనా స్థలాన్ని సందర్శించి వారిని పరామర్శించారు.

భూముల వేలం పోరు విద్యా వాతావరణాన్ని దెబ్బ తీసింది

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత 15 రోజులుగా హెచ్‌సీయూలో భూముల వేలంపై జరుగుతున్న పోరు విద్యా వాతావరణాన్ని పూర్తిగా దెబ్బ తీసిందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదర్ గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు సి.హెచ్.భద్ర, పీడీఎస్‌యూ (విజంభణ) రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. గచ్చిబౌలి కంచ హెచ్‌సీయూ భూములను యధాతధంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం విశ్వవిద్యాలయాల భూములపై కన్నెసిందని ఆరోపించారు. ప్రకతి విధ్వంసం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు దీనిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ జీవ వైవిధ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు.విద్యార్థులపై లాఠిచార్జ్, అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి వెంటనే హెచ్‌సీయూలో ఉన్న పోలీసులను వెనక్కి రప్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సమాఖ్య నగర అధ్యక్షులు రాకేష్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, కార్యదర్శులు సురేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

హార్డ్‌వర్క్ చేసేవారు ఎంతటి లక్ష్యాన్నైనా చేధిస్తారు

- ఐఏఎస్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆర్.సి.రెడ్డి



నవతెలంగాణ - ముషీరాబాద్

ఒకే లక్ష్యం దిశగా స్థిరంగా హార్డ్‌వర్క్ చేసేవారు ఎంతటి లక్ష్యాన్నైనా సాధించి తీరతారని ఐఏఎస్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆర్.సి.రెడ్డి అన్నారు. తెలంగాణా గ్రూప్-1 ఫలితాల నేపథ్యంలో 'విజేతలతో ముఖాముఖి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "సిలబస్‌ను అనుసరించి కచ్చితమైన ప్లానింగ్ తో చదవడం ముఖ్యం" అన్నారు. ఈ సందర్భంగా ఆర్.సి. రెడ్డి స్టడీ సర్కిల్ నుంచి తెలంగాణా గ్రూప్-1 టాపర్లుగా నిలిచిన పలువురు విజేతలను ఆయన అభినందించారు. డిప్యూటి కలెక్టర్, డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ తదితర టాప్ సర్వీసులకు ఎంపికయ్యే అవకాశం ఉన్న అనేక మంది విజేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "సబ్జెక్ట్ నాలెడ్జ్ పాటు, ఎగ్జామ్స్‌లో టాప్‌మార్క్స్ స్కోర్ చేయడానికి అవసరమైన ఎన్నో విలువైన అంశాలు ఆర్.సి.రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ కోచింగ్ ద్వారా తెలుసుకున్నామని. ఆర్.సి.రెడ్డి అందించిన విలువైన సేవల కారణంగానే తాము గ్రూప్-1 విజయాన్ని అందుకోగలిగామని పలువురు విజేతలు చెప్పారు.

వై. నిఖిత మాట్లాడుతూ ఐఏఎస్ లక్ష్యంతో ఆర్.సి.రెడ్డి ఐ.ఏ.ఎస్ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకోవడం తనకు స్ట్రాంగ్ ఫౌండేషన్ అయిందన్నారు. అది ఇప్పుడు గ్రూప్-1 విజయానికి కారణమైందని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఎనిమిదో ర్యాంక్‌తో టాపర్ల లలో ఒకరుగా వచ్చిన నిఖిత డిప్యూటి కలెక్టర్ పోస్టు ఎంపికయ్యే అవకాశం ఉంది. "గ్రూప్-1 మెయిన్స్ కోసం నేను మూడు నెలల పాటు సీరియస్‌గా ప్రిపేరయ్యా. ఇంత తక్కువ కాలమే చదివినా నేను విజేతను అయ్యానంటే, అది ఆర్.సి.రెడ్డి స్టడీ సర్కిల్ కోచింగ్ ద్వారా సాధ్యం అయింది" అని ఎస్ జస్వంత్రాజ్ అన్నారు. తెలంగాణ గ్రూప్-1 విజయంతో ఆయన డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యే అవకాశం ఉంది. "ఆర్.సి. రెడ్డి స్టడీ సర్కిల్ కోచింగ్ వలన మెయిన్స్‌లో మంచిమార్కులు స్కోర్ చేయగలిగాను. దీనివలన గ్రూప్-1 విజేతగా ఇప్పుడు నేను డిప్యూటి కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యే అవకాశం ఉంది" అని ఎస్. వీణ తెలియజేసారు. "సివిల్స్, గ్రూప్-1 లాంటి అత్యున్నతస్థాయి పోటీ పరీక్షల్లో సక్సెస్ కావాలంటే ఏది చదవాలో తెలియడంతో పాటూ ఏది చదవనవసరం లేదో కూడా తెలియాలి. ఆర్.సి.రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ కోచింగ్ వలనే ఈ రెండూ నాకు తెలిసాయి. ఈ పరిణతి సాధించడం వలనే గ్రూప్-1 విజయం సాధ్యం అయింది" అని బి.సాత్విక యాదవ్ అన్నారు. సాత్విక యాదవ్ డీఎస్పీగా ఎంపికయ్యే అవకాశం ఉంది. తెలంగాణా గ్రూప్-1 ఫలితాల్లో అత్యధిక శాతం మంది విజేతలు తమ సంస్థలో శిక్షణ తీసుకున్న వారే కావడం చాలా సంతోషంగా ఉందని ఆర్.సి.రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ బి. సంఘమిత్ర అన్నారు.

శ్రీ చైతన్య కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి




- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ చైర్మెన్‌కు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఫిర్యాదు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దళిత ఉద్యోగిపై అక్రమ కేసులు పెట్టిన శ్రీ చైతన్య కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డా.పబ్బతి శ్రీకష్ణ రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ, ఎస్టీ చైర్మెన్ బక్కి వెంకటయ్యను కోరారు. బుధవారం చైర్మెన్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శ్రీకష్ణ మాట్లాడుతూ ఎస్సీ మాల కులానికి చెందిన రెబ్బ నాగరాజు గతంలో కూకట్ పల్లిలోని శ్రీ చైతన్య కాలేజీ, కేపీహెచ్‌బీ వాగ్దేవి భవన్‌లో ప్రిన్సిపాల్ గా పని చేసేవాడని గుర్తు చేశారు. ఇందులో భాగంగా ఏజీఎం జి.రవికుమార్, డీన్ డి.శంకర్ రావు కలిసి ఆయనను స్టాఫ్ ఎదుట కులం పేరుతో తిట్టారని, ఆ బ్రాంచీ నుంచి తొలగించేందుకు ఒక మహిళా చేత తప్పుడు కేసులు పెట్టించి వేధించారని ఆరోపించారు.సదరు వ్యక్తులపై కూకట్ పల్లి, హౌసింగ్ బోర్డు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇద్దరు వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యిందని, కానీ ఏజీఎం జి.రవికుమార్ పేరును ఛార్జ్ షీట్ నుంచి తొలగించారని చెప్పారు. నాగరాజుపై అక్రమంగా కాలేజీ వైస్-ప్రిన్సిపాల్ వి.లక్ష్మీ చందన చేత కౌంటర్ కేసులు పెట్టించి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెర నుంచి ఆయనను కాపాడాలని కోరారు.ఈ కేసులో ప్రధాన ముద్దాయిని తప్పించుకోకుండా చర్యలు తీసుకోవాలని, బాధితుడికి తగిన న్యాయం చేయాలని కోరారు.రెబ్బ నాగరాజు, అతని కుటుంబానికి ఎలాంటి హాని జరిగిన శ్రీ చైతన్య కాలేజీ యజమాన్యానిదే పూర్తి బాధ్యతని హెచ్చరించారు.

రెండు దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న చైర్మెన్

- ధన్వంతరి బాధితుల ఫోరం కన్వీనర్ కళ్ళే గిరిప్రసాద్ శర్మ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత రెండు దశాబ్దాలుగా 3 వేల మందికి పైగా ప్రజలను మోసం చేస్తున్న ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నే షనల్ ట్రస్ట్ చైర్మెన్ కమలాకర్ శర్మ, అతని భార్యపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని, ఇప్పటికైనా వారిని రిమాండ్‌కు తరలించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ ట్రస్ట్ ఏర్పాటు చేసుకుని అధిక వడ్డీలతో కోట్ల రూపాయలను 3 వేల మందికి పైగా ప్రజల నుంచి పెట్టుబడులు సేకరించి రెండు దశాబ్దాలుగా మోసం చేస్తున్న కమలాకర్ శర్మ జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చినా తిరిగి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అతడిని ప్రశ్నిస్తే మీరు కోర్టులో చూసుకోండి అంటూ పెట్టుబడిదారులను మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని వాపోయారు. కమలాకర్ శర్మ ఆర్థిక నేరాలకు పాల్పడిన వైనంపై సీసీఎస్ ఆయన అకౌంట్లు సీజ్ చేశాయని, అయితే జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. అంబర్ పేట్‌లోని ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ కార్యాలయాన్ని సీసీఎస్ సీజ్ చేసినప్పటికీ సదరు కమలాకర్ శర్మ నడిపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఓ వైపు సీసీఎస్ కమలాకర్ శర్మను హెచ్చరిస్తున్నప్పటికీ ఆయన ఓరిజినల్ భూమి పత్రాలు ఇస్తాను డెవలప్మెంట్ చార్జీలు కట్టాలని బాధితులైన పెట్టుబడిదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏడాది క్రితం రూ.1,400 కోట్ల అవినీతికి పాల్పడిన కమలాకర్ శర్మ, ఆయన భార్య జైలు నుంచి బెయిల్ పై బయటకు వచ్చి ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వానికి వంద కోట్ల రూపాయలు చెల్లించి, ఈ కేసు నుంచి తమను విడిపించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. కమలాకర్ శర్మపై సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద యూత్ కాంగ్రెస్ ధర్నా


నవతెలంగాణ-ఉప్పల్



ఐపీఎల్ టికెట్ల విక్రయాలలో అక్రమాలకు పాల్పడుతున్న హెచ్‌సీఏ అధ్యక్షులు జగన్మోహన్ రావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ టికెట్ల అమ్మకాల్లో అక్రమాలు జరిగాయని , హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ టికెట్స్ ను బ్లాక్ మార్కెట్ లో అమ్ముకుంటున్నదని ఆరోపించారు. అక్షర స్కూల్ యాజమాన్యం టికెట్స్ కు అక్రమంగా అమ్మకాలు చేస్తున్నదన్నారు.

తక్షణ శక్తికోసం..

ఎండలు మండిపోతున్నాయి. ఈ ఎండలకు నీరసం, చిరాకు వస్తుంటుంది. శరీరంలోని శక్తి మొత్తం సూర్యుడు లాగేసుకుంటాడు. ఇలాంటి సమయంలో చల్లని పానీయాలు ఎంతో హాయినిస్తాయి. అందుకే వేసవి తాపం నుంచి రిలీఫ్ పొందేందుకు డీహైడ్రేషన్ బారిన పడకుండా చాలామంది మజ్జిగ, నిమ్మరసం, చెరుకు రసం వంటివి తాగుతుంటారు. అలాగే మరికొందరు నిమ్మకాయతో షర్బత్ తయారు చేసి సేవిస్తుంటారు. ఎన్ని తాగినా వేసవి తాపం అంత తేలిగ్గా తగ్గేది కాదు. కాబట్టి దాహం తీరడంతో పాటు తక్షణ శక్తిని, ఆరోగ్యాన్ని కూడా ఇచ్చే ఇలాంటి పానీయాలు ప్రయత్నిస్తే మంచిది.



సోంపుతో షర్బత్



కావాల్సిన పదార్థాలు: సోంపు - కప్పు, పటిక బెల్లం ముక్కలు - అరకిలో, యాలకుల పొడి - అరటీస్పూన్, నిమ్మ ఉప్పు - చిటికెడు, నానబెట్టిన సబ్జా గింజలు - తగినన్ని.

తయారు చేసే విధానం: ముందుగా ఒక చిన్న గిన్నెలో సోంపు తీసుకొని బాగా కడగాలి. తర్వాత అందులో 750ఎంఎల్ వరకు నీరు పోసి రాత్రంతా నానబెట్టుకోవాలి. తర్వాతి రోజు నానబెట్టుకున్న సోంపు నీటిని మరో బౌల్‌లోకి వడకట్టుకోవాలి.

ఆ తర్వాత మిక్సీ జార్ తీసుకొని అందులో వడకట్టిన సోంపుని వేసుకోవాలి. ఆపై సోంపు నానబెట్టుకున్న నీటిని వేసుకొని మెత్తని పేస్ట్‌లా మిక్సీ పట్టుకోవాలి. తర్వాత ఒక గిన్నెపై జాలీగంటెలో శుభ్రమైన పల్చని క్లాత్ ఉంచి దానిలో మిక్సీ పట్టుకున్న సోంపు పేస్ట్‌ని వేసి బాగా పిండితే అందులోని సారమంతా దిగిపోతుంది. సోంపు పేస్ట్‌లోని సారాన్నంతా బాగా పిండుకున్నాక ఆ పిప్పిని పడేయాలి. ఇప్పుడు స్టౌ మీద కడాయి పెట్టుకొని వడకట్టిన సోంపు సారాన్ని పోసుకోవాలి. ఆపై అందులో పటిక బెల్లం ముక్కలు వేసుకొని కలుపుతూ లేత తీగ పాకం వచ్చే వరకు మరిగించుకోవాలి. ఇలా మరిగించుకునేటప్పుడు మిశ్రమం పైన మురికిలా ఒక తేట వస్తుంది. దాన్ని గరిటెతో తీసేస్తుండాలి. అప్పుడే పాకం చక్కగా వస్తుంది. అది మరిగి కాస్త చిక్కగా మారిందనుకున్నాక యాలకుల పొడి వేసుకొని కలిపి మరికాసేపు మరిగించుకోవాలి. మిశ్రమం మరిగి పర్ఫెక్ట్ కన్సిస్టెన్సీ రావడానికి 20 నిమిషాల సమయం పట్టొచ్చు. సోంపు మిశ్రమం చక్కగా మరిగి లేత తీగ పాకం వచ్చిందనుకున్నాక చివర్లో నిమ్మ ఉప్పు వేసుకొని కలిపి దింపేసుకోవాలి. ఆ తర్వాత పాకాన్ని పూర్తిగా చల్లార్చుకుంటే సోంపు షర్బత్‌కి కావాల్సిన స్క్వాష్ రెడీ అయినట్లే. అనంతరం దీన్ని ఏదైనా గ్లాస్ జార్‌లో స్టోర్ చేసుకొని పెట్టుకున్నారంటే కనీసం రెండు నెలల పాటు నిల్వ ఉంటుంది.

సోంపు షర్బత్ ఎలా చేసుకోవాలంటే?

గాజు గ్లాసులో రెండు టేబుల్ స్పూన్ల సోంపు స్క్వాష్ తీసుకోవాలి. అందులో టేబుల్ స్పూన్ నానబెట్టిన సబ్జా గింజలు, చల్లని నీరు పోసుకొని కలుపుకోవాలి. చివర్లో ఐస్ ముక్కలు వేసుకొని సర్వ్ చేసుకున్నారంటే చాలు. ఒకవేళ మీకు నచ్చితే కలర్ ఫుల్‌గా కనిపించడానికి కొద్దిగా గ్రీన్ కలర్ కూడా వేసుకోవచ్చు. అంతే, మండుటెండల్లో కూల్ కూల్‌గా పొట్టకు హాయినిచ్చే సోంపు షర్బత్ రెడీ!

రాగి అంబలి



రాగి అంబలి కోసం ముందురోజు రాత్రే రాగిపిండిని నానబెట్టుకోవాలి. రాగిపిండి చక్కగా ఉడికిందో లేదో తెలుసుకోవడానికి తడి చేతితో చిన్న రాగిముద్దను చేతిలోకి తీసుకోవాలి. అప్పుడు రాగిపిండి చేతికి అంటనట్లయితే అది పర్ఫెక్ట్‌గా ఉడికినట్టు. రాగిపిండిని మట్టిపాత్రల్లో రాత్రంతా ఊరనివ్వడం వల్ల అంబలి చల్లగా, రుచికరంగా ఉండి వేసవిలో తాగేకొద్దీ తాగాలనిపిస్తుంది. అదే రాగి ముద్దలను స్టీలు గిన్నెల్లో నానబెడితే పిండి కాస్త పులుపెక్కే ఛాన్స్ ఉంటుంది.

కావల్సిన పదార్థాలు: రాగి పిండి - కప్పు, పెరుగు - కప్పు, ఉప్పు - రుచికి సరిపడా, సన్నని కొత్తిమీర తరుగు - రెండు టేబుల్ స్పూన్లు, సన్నని కరివేపాకు తరుగు - కొద్దిగా, ఉల్లిగడ్డ తరుగు - పిడికెడు, అల్లం తరుగు - కొద్దిగా, పచ్చిమిర్చి సన్నని తరుగు - టేబుల్ స్పూను.

తయారు చేసే విధానం: ముందుగా ఒక గిన్నెలో రాగి పిండిని తీసుకొని నాలుగు కప్పుల వరకు వాటర్ పోసుకొని ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి. తర్వాత స్టౌ మీద ఆ గిన్నెను ఉంచి పాత్రను రాగి పిండి వదిలేసే వరకు కలుపుతూ ఉడికించుకోవాలి. వాస్తవానికి రాగిపిండి మూడు నాలుగు పొంగులు రాగానే చిక్కగా మారుతుంది. అంత మాత్రాన పిండి చక్కగా ఉడికినట్టు కాదు. ఇలా తాగడం వల్లనే కడుపులో మంట, పుల్లటి తేన్పులు, అరగనట్టు అనిపిస్తుంది. కాబట్టి నిదానంగా మధ్యమధ్యలో కలుపుతూ రాగి పిండి పాత్రను వదిలేసే వరకు చక్కగా ఉడికించుకోవాలి. అందుకోసం 15 నుంచి 18 నిమిషాల సమయం పట్టొచ్చు. రాగిపిండి చక్కగా ఉడికి, కలిపితే గరిటెకు అంటుకోకుండా జారిపోతుందో అప్పుడు గిన్నెను దింపి పిండిని పూర్తిగా చల్లారనివ్వాలి.

ఇప్పుడు ఒక మట్టిపాత్రలో ముప్పావు భాగం వరకు(ఒకటిం పావు లీటర్) నీరు తీసుకోవాలి. తర్వాత చల్లారిన రాగి పిండిని చిన్న చిన్న ముద్దలుగా చేసుకొని, మట్టిపాత్రలో తీసుకున్న నీటిలో వేసుకోవాలి. ఆపై మూతపెట్టి రాత్రంతా ఊరనివ్వాలి. ఇలా ఊరనివ్వడం ద్వారా శరీరానికి, పొట్టకు మేలు చేసే మంచి బ్యాక్టీరియా ఉత్పత్తి అవుతుంది. తర్వాత రోజు నానబెట్టుకున్న ఆ ముద్దలను చేతితో ఎక్కడా ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి. వీలైతే జాలీ గంటెతో వడకట్టుకొని మరో గిన్నెలోకి పోసుకోవాలి.

ఇప్పుడు ఒక గిన్నెలో పెరుగు తీసుకొని తరకలు లేకుండా బాగా చిలుక్కోవాలి. తర్వాత దాన్ని ముందుగా ప్రిపేర్ చేసుకున్న జావలో వేసుకొని కలుపుకోవాలి. అలాగే ఉప్పు కూడా వేసి రెండు మూడుసార్లు బాగా చిలుక్కోవాలి. తర్వాత సన్నని కొత్తిమీర, కరివేపాకు తరుగు వేసుకోవాలి. అలాగే చాలా సన్నగా కట్ చేసుకున్న ఉల్లిగడ్డను చేతితో నలిపి వేసుకోవాలి. ఇక చివర్లో సన్నగా కట్ చేసుకున్న అల్లం, పచ్చిమిర్చి తరుగు వేసుకొని అన్నీ కలిసేలా బాగా కలుపుకోవాలి.

తర్వాత గ్లాసులలో పోసుకొని సర్వ్ చేసుకుంటే చాలు. ఎంతో రుచికరమైన, ఆరోగ్యవంతమైన రాగి అంబలి మీ ముందు ఉంటుంది. ఈ అంబలిని క్రమంతప్పకుండా రోజూ తాగి చూడండి. శరీరంలోని వేడి చాలా వరకు తగ్గిపోతుంది.

పచ్చిమామిడితో



కావాల్సిన పదార్థాలు: పచ్చిమామిడి కాయలు - రెండు, బెల్లం తురుము - ఒకటిన్నర కప్పులు, యాలకుల పొడి - అరటీస్పూను, ఐస్ క్యూబ్స్ - కొన్ని.

తయారీ విధానం: ఇందుకోసం ముందుగా తాజా, గట్టిగా ఉండే పచ్చిమామిడి కాయలను శుభ్రంగా కడిగి ఓ గిన్నెలోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ప్రెషర్ కుక్కర్ తీసుకొని రెండు గ్లాసుల వరకు వాటర్ పోసుకోవాలి. తర్వాత అందులో స్టాండ్‌ని ఉంచి దానిపై మామిడి కాయలు ఉన్న గిన్నె పెట్టాలి. ఆపై మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించుకోవాలి. మామిడికాయలు ఉడికేలోపు మిక్సీలో బెల్లం తురుము వేసుకొని మెత్తగా గ్రైండ్ చేసుకొని పక్కన పెట్టుకోవాలి. కుక్కర్‌లోని ప్రెషర్ మొత్తం పోయాక మూత తీసి గిన్నెలో ఉడికించుకున్న మామిడికాయలను ప్లేట్‌లోకి తీసుకొని కాస్త చల్లారనివ్వాలి. అవి చల్లారాక టెంక తీసేసి మెత్తగా ఉడికిన మామిడి గుజ్జును చేతితో బాగా మాష్ చేసుకోవాలి. ఆ తర్వాత అందులో ముందుగా మిక్సీ పట్టుకున్న బెల్లం పేస్ట్‌ని వేసి మొత్తం కలిసేలా బాగా కలుపుకోవాలి. ఆవిధంగా మిక్స్ చేసుకున్నాక అందులో యాలకుల పొడి వేసుకొని మరోసారి చక్కగా మిక్స్ చేసుకోవాలి. మీరు కావాలనుకుంటే ఈ స్టేజ్‌లో కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి కూడా యాడ్ చేసుకోవచ్చు. ఈవిధంగా ప్రిపేర్ చేసుకున్న మామిడికాయ గుజ్జును ఎయిర్ కంటైనర్‌లో వేసుకొని మూతపెట్టి ఫ్రిడ్జ్‌లో స్టోర్ చేసుకుంటే కనీసం 20 రోజుల పాటు తాజాగా ఉంటుంది.

డ్రింక్ తయారీ: ముందుగా గ్లాసులలో కొన్ని ఐస్ క్యూబ్స్ వేసుకోవాలి. తర్వాత ముందుగా ప్రిపేర్ చేసుకున్న మ్యాంగో మిక్స్‌ని ఒకటి లేదా రెండు టీస్పూన్లు వేసుకొని కూల్ వాటర్ పోసి బాగా కలిపి సర్వ్ చేసుకుంటే చాలు. అంతే ఎంతో టేస్టీగా ఉండే చల్లచల్లని 'పచ్చిమామిడికాయ డ్రింక్' రెడీ!

తాటి ముంజలతో మ్యాంగో స్మూతీ



కావాల్సిన పదార్థాలు: తాటి ముంజలు - నాలుగు, మామిడి పండు - ఒకటి, పాలు - కప్పు, పంచదార - రెండు చెంచాలు, ఐస్‌క్రీం - రెండు స్పూన్లు, ఐస్‌ముక్కలు - ఎనిమిది.

తయారీ విధానం: ఇందు కోసం ముందుగా తాటి ముంజలపై ఉండే పొట్టు తీసుకొని చిన్న చిన్న ముక్కలు గా కోసి పక్కన పెట్టుకోవాలి. అలాగే మామిడి పండుని కూడా చెక్కు తీసి ముక్కలుగా కట్ చేసు కొని పక్కనుంచాలి. ఇప్పుడు మిక్సీజార్ తీసు కొని అందులో ముందుగా కట్ చేసి పెట్టుకున్న మామిడి పండు ముక్కలు, ముంజలు సగం, పాలు, పంచదార, ఐస్‌క్రీం వేసుకొని చక్కగా బ్లెండ్ చేసుకోవాలి. తర్వాత దాన్ని గ్లాసుల్లోకి తీసుకొని మిగిలిన ముంజల ముక్కలు, కొద్దిగా ఐస్‌క్రీం, ఐస్ ముక్కలు వేసుకొని సర్వ్ చేసుకుంటే చాలు. అంతే కూల్ కూల్‌గా కమ్మని 'ముంజల మ్యాంగో స్మూతీ' రెడీ!

నైట్‌షిఫ్టులు చేస్తున్నారా..?

ఐటీ, మీడియా, ఫార్మా వంటి సంస్థల్లో ఉద్యోగులకు.. ఒకే షిఫ్టుకు పరిమితం కాకుండా వేర్వేరు షిఫ్టుల్లో పనిచేయాల్సి వస్తోంది. కొంతమంది రోజుల తరబడి నైట్‌షిఫ్టులకే అంకితమైపోతుంటారు. నైట్‌షిఫ్టుల కారణంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందంటున్నారు నిపుణులు. రాత్రిపూట పని చేసేవారికి.. డయాబెటిస్, అధిక బరువు, జీర్ణకోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత, జీవక్రియ సమస్యలు వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, షిఫ్ట్ ప్రకారం పనిచేసే వారికి.. ఛాయిస్ ఉండకపోవచ్చు. వారి ఉద్యోగ పరిస్థితుల ప్రకారం పనిచేయాల్సి ఉంటుంది. నైట్‌షిఫ్ట్‌లో పని చేసే వారు.. ప్రతికూల ప్రభావాలను తగ్గించుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇవి తింటే మంచిది..

నైట్‌షిఫ్ట్‌కు వెళ్లే ముందు రాగి రొట్టె, జొన్న రొట్టె, మిల్లెట్ జావ, రాగి జావ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చిరుధాన్యాలలో విటమిన్ బి12, బి6 , కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్స్, జింక్, ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. మాంసాహారంతో పోలిస్తే చిరుధాన్యాల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. మిల్లెట్స్‌లో జింక్, ఫైబర్, ప్రొటీన్ పుష్కలంగా ఉంటాయి.. ఇవి మీ కడుపును సంతృప్తిగా ఉంచుతాయి. చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. నైట్‌షిఫ్ట్‌లో ఫుడ్ క్రేవింగ్స్ ఎక్కువగా ఉంటాయి. మిల్లెట్స్ తీసుకుంటే.. తినాలనే కోరిక తగ్గుతుంది, శక్తి స్థాయిలను పెంచుతాయి. ఇవి బరువును కూడా కంట్రోల్‌లో ఉంచుతాయి.

హైడ్రేట్‌గా ఉండండి..

నైట్ షిఫ్ట్ చేసే వారు హైడ్రేటెడ్‌గా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. రాత్రి పూట నిద్ర రాకుండా చాలా మంది కాఫీ, టీలు ఎక్కువగా తాగుతూ ఉంటారు. ఇవి ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతాయి. వీటికి బదులుగా... మజ్జిగా, సోంపు నీరు, నీరు తాగడం మంచిది. ఇవి మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. కడుపు ఉబ్బరం, ఎసిడిటీ, తలనొప్పి, వికారం, చిరాకు వంటి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి.

ఈ జాగ్రత్తలు పాటించండి..

ఎముకలు ధృడంగా ఉండటంలో విటమిన్ డి కీలకపాత్ర పోషిస్తుంది. నైట్ షిఫ్టులలో పనిచేసేవారిలో విటమిన్ డి లోపానికి గురయ్యే అవకాశం ఉంది. రోజూ ఉదయం శరీరానికి సూర్యరశ్మి తగిలేలా కాసేపు ఎండలో నడవండి.

నైట్ షిఫ్టుల్లో పనిచేసే వారు ముందుగా పగటి పూట నిద్ర పోవడానికి ఒక సమయాన్ని కేటాయించుకోవాలి. రోజూ అదే సమయానికి నిద్రపోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

సొంతిల్లు కల కల్లే

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడో? కొత్తగా కడుతున్న ప్రతి ఆరు ఇండ్లలోనూ ఒక ఇంటి ధర ఆ రేటు పలుకుతోంది. 2021లో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో కొత్తగా నిర్మించిన ఇండ్లలో 9 శాతం మాత్రమే కోటిన్నర రూపాయల కంటే ఎక్కువ ధర పలికాయి. ఇప్పుడు ఆ వాటా 30 శాతం దాటిపోయింది.

నగరాలకు దూరంగా నిర్మాణాలు

అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఆస్తుల విలువ పెరిగింది కానీ ఆదాయం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది. ఇండ్ల ధరలు రోజురోజుకూ పెరిగి పోతుండడంతో మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. నాలుగేండ్ల క్రితం యాభై లక్షల రూపాయలకు సొంతమైన ఇల్లు ఇప్పుడు రూ.75 లక్షల పెడితే కానీ దొరకడం లేదు. అంత ధర పెట్టి ఇల్లు కొనాలంటే నెలకు రూ. 45,000-60,000 ఈఎంఐ చెల్లించాల్సి వస్తుంది. ప్రస్తుతం వైట్ కాలర్ ఉద్యోగాలు చేస్తున్న వారికి లభిస్తున్న జీతాల ప్రకారం చూస్తే వాటిలో 50 నుంచి 70 శాతం వరకూ ఈఎంఐలు కట్టడానికే పోతుంది. ఇప్పుడు నగరాల మధ్యలో ఇండ్లను నిర్మించడానికి అంగుళం కూడా చోటు దొరకడం లేదు. దీంతో నగరాలు, వ్యాపార కేంద్రాలకు దూరంగా ఇండ్ల నిర్మాణం జరుగుతోంది. అంత డబ్బు పోసి అక్కడ ఇల్లు కొనుగోలు చేసినా సమీపంలో మంచి పాఠశాలలు, ఆస్పత్రులు ఉండవు. ఇలాంటి పరిస్థితులలో సొంత ఇంటి ఆశలకు స్వస్తి చెబుతున్న మధ్య తరగతి ప్రజానీకం అద్దె ఇండ్లల్లో సర్దుకుపోతోంది.

డిమాండ్-సరఫరాల మధ్య అంతరం

సొంతింటి కలలకు సమాధి కట్టి అద్దె ఇండ్ల వైపు ప్రజలు మొగ్గు చూపుతుండడంతో వాటి అద్దెలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అద్దెలు ఎక్కువగా ఉన్నా నగరం మధ్యలో ఉంటే ఇండ్లను ఇష్టపడుతున్నారు. ఎందుకంటే అవి వారి ఆఫీసులకు, పిల్లల పాఠశాలలకు, మార్కెట్లకు, మాల్స్‌కు దగ్గరగా ఉంటాయి. కానీ దీనికి భిన్నంగా శివారు ప్రాంతాలలోనే ఇండ్లు ఎక్కువగా లభిస్తున్నాయి. ఫలితంగా డిమాండ్, సప్లయ్ మధ్య అంతరం పెరుగుతోంది. ఇంటి అద్దెలు పెరగడానికి ఇది కూడా ఓ కారణమే. ముఖ్యంగా పెద్ద నగరాలు, మెట్రోలలో నగరం నడిబొడ్డున ఇల్లు అద్దెకు దొరకాలంటే లక్షలు పోయాల్సిందే. వాటిని భరించే శక్తి లేని వారు శివారు ప్రాంతాల వైపు వెళుతున్నారు. దీంతో అక్కడ కూడా అద్దెలు పెరిగిపోతున్నాయి.

రహస్య ద్రవ్యోల్బణం

పెరుగుతున్న జీవన వ్యయం అధికారిక ద్రవ్యోల్బణ గణాంకాలలో ప్రతిబింబించడం లేదు. ఎందుకంటే వినియోగ ధరల సూచీలో (సీపీఐ) హౌసింగ్ వ్యయం కేవలం 22 శాతంగా మాత్రమే ఉంది. సీపీఐ ఆధారంగానే ద్రవ్యోల్బణాన్ని లెక్కిస్తారు. పెద్ద నగరాలలో నివసిస్తున్న మధ్య తరగతి ప్రజానీకానికి ఇంటి అద్దెలు వారి నెలసరి ఖర్చులో 30 శాతం దాకా ఉంటున్నాయి. ఇప్పుడవి మరింతగా పెరుగుతున్నాయి. గత నాలుగు సంవత్సరాలలో ఇండ్ల ధరలు అధికారికంగానే 17 శాతం పెరిగాయి. వాస్తవానికి అవి యాభై శాతానికి పైగానే పెరిగాయి. అదే కాలంలో భారత రిటైల్ ద్రవ్యోల్బణం ఏడాదికి ఐదు శాతంగా నమోదైంది. వాస్తవ అద్దె ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేస్తే అది ఏడు శాతం వరకూ ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే అద్దె ఇండ్లలో నివసిస్తున్న మధ్య తరగతి కుటుంబాలు కనీసం ఏడు శాతం వార్షిక ద్రవ్యోల్బణ రేటును ఎదుర్కొంటున్నాయి. కానీ వారి జీతాల్లో పెరుగుదల మాత్రం చాలా నామమాత్రంగా ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం జీతంలో 40 శాతంగా ఉన్న ఇంటి అద్దె ఇప్పుడు సుమారు 35 శాతానికి చేరువగా ఉంది. పెరుగుతున్న అద్దె భారాన్ని దృష్టిలో పెట్టుకొని మధ్య తరగతి ప్రజలు తమ ఖర్చులను తగ్గించుకుంటున్నారు. వేతన జీవుల నెలవారీ ఖర్చులో అద్దె, ఆరోగ్యం, విద్య...ఈ మూడే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మధ్య తరగతి ప్రజానీకం చేతిలో తగినంత డబ్బు అందుబాటులో లేకపోతే వ్యాపారాలు కూడా దెబ్బతింటాయని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. చేతిలో సొమ్మే లేనప్పుడు వస్తువులు, సేవలు ఎలా పొందగలరు? వ్యాపారాలు దెబ్బతింటే ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. కార్పొరేట్ లాభాల మార్జిన్ కూడా తగ్గుతుంది. తిరిగి కోలుకోవడం స్టాక్ మార్కెట్లకు కష్టమవుతుంది.

ఏదేమైనా ఇవాళ మధ్య తరగతి ప్రజానీకం తీవ్రమైన ఇబ్బందులు పడుతోంది. హౌసింగ్ ద్రవ్యోల్బణంలో తగ్గుదల కొంత ఊరట కల్పించినప్పటికీ ఆదాయాలు పెరిగినప్పుడు మాత్రమే వారు నిజమైన సంతోషాన్ని పొందుతారు. అయితే సమీప భవిష్యత్తులో అలా జరిగే అవకాశాలు ఏ కోశానా కన్పించడం లేదు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర అటవీ శాఖకు లేఖ రాసిన కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హెచ్‌సీయూలో పర్యావరణ విఘాతానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ రాష్ట్ర అటవీశాఖకు ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై కేంద్ర అటవీ పర్యావరణ శాఖ స్పందించింది. బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. యూనివర్సిటీలో పర్యావరణానికి విఘాతం కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అక్కడ చెట్లు, జంతుజాలానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రానికి సూచించింది. జానిజాలపై విచారణ సాగించి పూర్తి నివేదికను అందించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శిని లేఖ ద్వారా కోరింది. అటవీ చట్టం, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు టీజీఐఐసీపై నిజనిర్ధారణ నివేదికను సమర్పించి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

బీసీ రిజర్వేషన్లు అమోదించకపోతే

కేంద్రంపై ధర్మ యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మోడీ దిగిరావాలని, లేకపోతే అధికారం నుంచి దిగిపోవాలని అన్నారు. ఇసుమంత సాయం చేస్తే...జీవితాంతం గుర్తు పెట్టుకునే జాతి బిసిలదన్నారు. ఈ జాతికి అన్యాయం చేస్తే వాళ్లు మర్చిపోరనే విషయాన్ని మోడీ గుర్తుచుంకోవాలని హితవు పలికారు. రిజర్వేషన్ల సాధనలో రాష్ట్ర సీఎంగా బీసీలకు అండగా నిలబడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈ విషయంలో గల్లీ నుంచి డిల్లీ వరకు అన్ని రాష్ట్రాలను ఏకం చేసి బలహీన వర్గాలకు రిజర్వేషన్లు చేయించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ దన్నారు. పరేడ్ గ్రౌండ్స్ వేదికగా చేపట్టే ధర్మ యుద్ధంలో బీసీల శక్తి ఏంటో ప్రధానికి చూపాలన్నారు. కమ్యూనిస్టు నుంచి కాంగ్రెస్ వరకు, ఎంఐఎం నుంచి బీఎస్పీ, సీపీఐ(ఎం) నుంచి సీపీఐ వరకు అన్ని పార్టీలు అనుకూలంగా ఉన్నా బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడానికి మోడీకి వచ్చిన బాధేంటని ప్రశ్నించారు. ఈ రిజర్వేషన్లకు మద్దతుగా దాదాపు 17 పార్టీల నుంచి సుమారు 60 మంది ఎంపీలు జంతర్ మంతర్‌లో నిర్వహించిన బీసీల పోరు గర్జనకు సంఘీభావం తెలిపాయన్నారు.

సంఘీభావం తెలిపిన వివిధ పార్టీలు

కాంగ్రెస్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, గడ్డం ,వంశీక ష్ణ, చామల, కావ్య, సురేశ్ షట్కర్, రేణుకా చౌదరి, రఘురాం రెడ్డి, కుమారి షెల్జా, ప్రీతీ షిండే, అమర్ సింగ్, ప్రభా (కర్నాటక), కాంగ్రెస్ నేతలు విజయ శాంతి, అద్దంకి దయాకర్, సంపత్ కుమార్, వి. హనుమంతురావు, ఎమ్మెల్సీ కొదండ రామ్, సినీ నటుడు సుమన్, సీపీఐ నుంచి నారాయణ, డీఎంకే నుంచి విల్సన్, కళిమెళి, నరేష్ ఉత్తమ్ పాటిల్(ఎస్‌పీ), సుప్రియా సూలే (ఎన్‌సీపీ), ఎంపీ అసదుద్దీన్ (ఎంఐఎం), మనోజ్ ఝా(ఆర్జేడీ), మహారాష్ట్ర నుంచి ఎంపీ గైక్వాడ్, పంజాబ్ పీసీసీ చీఫ్ అమరస్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఆగని నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి, అటుగా విద్యార్థులు వెళ్లలేని పరిస్థితులను సృష్టించారు. విద్యార్థులు క్యాంపస్‌లోకి సాధారణంగా వెళ్లే పరిస్థితులు లేకుండా భారీ బందోబస్తుతో కట్టుదిట్టంగా పోలీసు వలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపేందుకు బయటి నుంచి రాజకీయ, ప్రజా సంఘాల, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఎవ్వరూ రాకుండా భారీ బలగంతో మోహరించారు. ఆందోళనలో భాగంగా బుధవారం వర్సిటీలోని అంబేద్కర్ ఆడిటోరియం నుంచి ఈస్ట్ క్యాంపస్ మీదుగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులపై విచక్షణారహితంగా పోలీసులు లాఠీచార్జీ చేశారు. తమ క్యాంపస్‌లో తాము ప్రశాంతంగా ఉండకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, టెర్రరిస్టుల మాదిరిగా చూస్తూ తమపై లాఠీచార్జిలు చేయడం ఏంటంటూ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు, బుల్డోజర్లతో క్యాంపస్ నుంచి బయటకు వెళ్లి పోవాలంటూ, క్యాంపస్ భూములను యూనివర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు.

వర్సిటీ భూములను అకడమిక్ సేవలకు మాత్రమే వినియోగించాలి : భాంఘ్య భూక్య, హెచ్‌సీయూ టీచర్స్ యూనియన్ ప్రెసిడెంట్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కోసం నాటి ప్రధాని ఇందిరా గాంధీ 1975లో 2300 ఎకరాల భూములను కేటాయించింది. ఈ భూములను కేవలం అకడమిక్ సేవల కోసం మాత్రమే వినియోగించాలని, ఇతర కమర్షియల్, వ్యాపార అవసరాలకు వినియోగించి నట్లయితే ప్రభుత్వం తిరిగి తీసుకునేలా నిబంధనలున్నాయి. కానీ ఈ నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల్లోని ఆకుపచ్చని అడవులను తొలగిస్తూ, అక్రమంగా అమ్ముకునేందుకు ప్రయత్ని స్తున్నారని తెలిపారు. గతంలో యూనివర్సిటీ అభివృద్ధిలో భాగంగా ట్రిబుల్ ఐటీ, ఐఎస్‌బీ, జీహెచ్ఎంసీ, నవోదయ, గచ్చిబౌలి స్టేడియం, టెలిఫోన్ ఎక్ఛ్సేంజ్ కార్యాలయాలకు భూములను కేటాయించింది. కాగా గతంలోనూ వర్సిటీ భూములను ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేయగా అప్పుడు విద్యార్థులు చేపట్టిన ఆందోళనలతో తమ ఆలోచనను విరమించుకుంది. రేవంత్ ప్రభుత్వం వ్యాపారం చేయాలనుకుంటున్న 400 ఎకరాల్లో ఆకుపచ్చని అడవులతో పాటు పెద్ద చెరువులు, అనేక రకాల జంతువులు, పక్షులు, అనేక ఔషధ మొక్కల జాతులు ఉన్నాయి. ఇప్పటికే నగరం కాంక్రీట్ జంగల్‌గా మారింది. ఈ 400 ఎకరాల్లో కమర్షియల్, వ్యాపార కార్యకలాపాలు చేపడితే కాలుష్యం పెరిగిపోతుంది. నాలుగు రోజులుగా కొనసాగుతున్న అడవుల నరికివేతతో గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు సంభవించాయి.

భూములమ్ముకుని పాలించడం అభ్యంతరకరం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల నరసింహా రెడ్డి మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తు న్నామని తెలిపారు. హెచ్‌సీయూ కోసం కేటాయించిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలన్న ప్రయత్నాలను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. ఆ ప్రయత్నాలను ప్రతిఘటిస్తామని, ఆ భూములను వెంటనే సెంట్రల్ యూనివర్సిటీకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. వర్సిటీ భూములను కాపాడుకునేందుకు విద్యార్థులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పార్టీ పూర్తిగా మద్దతు నిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగిస్తూ, అక్రమ కేసులను బనాయించి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నదని, దాన్ని ప్రతిఘటించి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం బస్టాండ్ సెంటర్లో, పెంట్లవెల్లిలో, జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అలంపూర్ ఎంపీడీవో కార్యాలయం ముందు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలు జరిగాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద ప్లకార్డులు, నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో, సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సరిత సెంటర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. మధిర, బోనకల్‌లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఎర్రుపాలెంలో సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయం నుంచి రింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వైరాలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. పినపాకలో ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్ నందు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనంచేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. చేర్యాల పాత బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం.యాదగిరిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరిలించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) నాయకులు తెలంగాణ చౌక వద్ద సంకెళ్లతో నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ పాల్గొన్నారు.

400ఎకరాల భూమిలో పనులు ఆపండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నెం 25లోని 400 ఎకరాలను టీజీఐఐసీకి కేటాయిస్తూ 2024 జూన్ 28న రాష్ట్ర ప్రభుత్వ జీవో 54ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ గురువారమూ కొనసాగనున్న నేపథ్యంలో ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుక ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా భూకేటాయింపు జరిగిందని, దీనిని రద్దు చేయాలంటూ హైదరాబాద్‌కు చెందిన కె. బాబూరావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇదే అంశంపై వాటా ఫౌండేషన్ కూడా పిల్ దాఖలు చేసింది.

ప్రభుత్వం జారీ చేసిన జీవో, టీఎన్ గోదావర్మన్ తిరుమల్పాడ్ వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీం తీర్పునకు వ్యతిరేకం. ప్రభుత్వ రికార్డుల్లో అది అటవీ ప్రాంతంగా నమోదు కాకపోయినప్పటికీ తిరుమ ల్పాడ్ వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీం తీర్పు ప్రకారం చెట్లు, పక్షులు ఉన్న ప్రాంతాన్ని అటవీ ప్రాంతంగా పరిగణించాలి. ఇలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి పనులపేరుతో కేటాయింపులు చేయడం చట్ట వ్యతిరేకం. ఇలాంటి కేటాయింపులు జరుపుతున్న పుడు కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం జరపాలని చట్టం స్పష్టం చేస్తోంది. దట్ట మైన అటవీ ప్రాంతం కాకపోయినా అక్కడ ఉన్న చెట్లు, గడ్డి మొక్కల కారణంగా పక్షులకు వన్యప్రాణులకు ఆవాసంగా ఉంది. కేబీఆర్ పార్కు, మగవాణి నేషనల్ పార్కు వలె ఇది పక్షి జంతుజాలాలకు ఆవాసంగా ఉంది. భారీ కంపెనీలు నివాస సముదాయాలతో అపారమైన అభి వృద్ధితో ముందుకు సాగుతున్న ఆర్థిక రాజధాని హైదరాబాద్‌లో 400ఎకరాల్లోని అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేయడం వల్ల పర్యావరణ విపత్తు వాటిల్లుతుంది. అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసి భూములను వేలం వేయడం ద్వారా నగర ప్రజలకు దీర్ఘకాలిక సంక్షోభం ఏర్పడుతుంది. న్యాయసమీక్ష నిపుణుల కమిటీల పరిధి నుంచి తప్పించే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చి 30వ తేదీ నుంచి 30 నుంచి 40 బుల్డోజర్లు వినియోగించి అక్కడ భూమిని చదును చేస్తోంది. ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. కేజీ ఫారెస్టులో చెట్లు, ఆరు అడుగుల ముళ్ల పొదలతో పలు పక్షులు, కీటకాలకు, జంతువులకు ఆవాసంగా ఉంది. కేజీ ఫారెస్టులో నీటి కుంటలున్నప్పటికీ పీకాక్ లేక్, బఫెలో లేక్ ప్రధానంగా ఉన్నాయి. రెండు బిలియన్ ఏండ్ల క్రితం ఏర్పడిన పుట్టగొడుగుల ఆకారంలో ఉన్న ప్రత్యేకమైన రాళ్లు ఇక్కడ ప్రత్యేకం. ఈ అటవీ ప్రాంతంలో 734 పూలమొక్కలు, 10 రకాల క్షీరదాలు, 15 రకాల సరీసపాలు, 230 జాతుల పక్షులున్నాయి. ఇక్కడ జింకలు, బల్లులు, కొండ చిలువలు, నెమళ్లు, కుందేళ్లు, గుడ్లగూబలు, ఫ్లెమింగో పక్షులు, తాబేళ్లు, అడవి పందులు వంటి వాటితోపాటు హిమాలయ ప్రాంతాల నుంచి వచ్చే అరుదైన వలస పక్షి జాతులున్నాయి. కేబీఆర్, మృగవాణి జాతీయ పార్కులకంటే ఎక్కువ పక్షులు, జంతువులు ఉన్నాయి. ఇది వాటికంటే వైవిధ్యమైనది. అంతేకాక కేంద్ర పర్యావరణ నోటిఫికేషన్ ప్రకారం 150 ఎకరాలకు మించిన అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేస్తున్నట్లయితే పర్యావరణ అధ్యయనం చేసి తీరాలి. చెట్లను నరకాలంటే వాల్టా చట్టం కింద సంబంధిత అధికారి వద్ద అనుమతి పొందాలి. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం అటవీ ప్రాంతాన్ని ఇతర ప్రయోజ నాలకు కేటాయించినప్పుడు కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతి కూడా పొందాలి. కేంద్రం నుంచి టీజీఐఐసీ ఎలాంటి అనుమతులు పొందలేదు. ఈ విషయాన్ని పత్రికా ప్రకటన ద్వారా తేలింది. ఆదాయం పెంచుకోవాలన్న ఏకైక లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ వ్యతిరేక నిర్ణయం తీసుకుని జీవో జారీ చేసింది. ప్రభుత్వం జీవవైవిధ్యాన్ని పట్టించుకోవడం లేదు. పిటిషన్‌పై విచారణ ముగిసే వరకు అక్కడ ఎలాంటి పనులు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలి... అని బ్రిటీష్ నగర్ తరపు సీనియర్ న్యాయవాదులు నిరంజన్ రెడ్డి , రవిచందర్ వాదించారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది. అప్పటివరకు కంచ గచ్చిబౌలి భూముల్లో ఎలాంటి పనులు చేపట్టరాదని రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.



సెవ్వణక్కం.. వీరవణక్కం

నినాదాలతో హోరెత్తిన మదురై... ఒకవైపు సాంస్కృతిక కార్యక్రమాలు.. మరోవైపు ఎర్రదండు కవాతు

- ఆహ్లాదాన్ని నింపిన షేక్ మస్తాన్ బృందం నాదస్వరం
- అబ్బురపరిచిన పాప్పంపాడి పెరియ మేళమ్
- అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన బిమన్ బసు
- స్ఫూర్తిదాయక వాతావరణంలో సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభలు ప్రారంభం

మదురై నుంచి బి.వి.యన్.పద్మరాజు

'సెవ్వణక్కం.. వీర వణక్కం.. సెవ్వణక్కం.. వీర వణక్కం...(అరుణారుణ వందనం.. వీరులారా వందనం...) అంటూ అక్కడ రెడ్‌షర్టు వాలంటీర్లు పెద్దపెట్టున నినదిస్తూ కవాతు నిర్వహించారు. మరోవైపు ఆ రాష్ట్రానికే ప్రత్యేకమైన, అక్కడి వారికే సాధ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. గత పోరాటాలను గుర్తుకు తెచ్చుకుంటూ, నాటి యోధుల త్యాగాలను స్మరించుకుంటూ గాయకులు ఆలపించిన పాటలు స్ఫూర్తినింపాయి. నాలుగేండ్ల బుడతడి నుంచి నలభై ఏండ్ల మధ్య వయస్కుడి వరకూ ఎర్ర చొక్కాలు ధరించి, ఎర్ర జెండాలు చేబూని నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ 'ఔరా...' అనిపించింది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తూ, మతసామరస్యాన్ని ప్రతిబింబిస్తూ షేక్ మస్తాన్ బృందం నిర్వహించిన నాదసర్వం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభకు ఆతిథ్యమిస్తున్న మదురై నగరంలోని సీతారాం ఏచూరి నగర్ (మదురై కన్వెన్షన్ సెంటర్)లో ఆవిష్కృతమైన దృశ్యాలివి. అత్యంత ఉత్సాహ, ఉల్లాసపూరిత వాతావరణంలో బుధవారం మహాసభ స్ఫూర్తిదాయకంగా ప్రారంభమైంది.

అంతకుముందు ఉదయం 7 గంటల సమయానికే సీతారాం ఏచూరి నగర్‌కు సీపీఐ (ఎం) అగ్రనేతలు, నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తరలొచ్చారు. అభిమానులు, సాధారణ ప్రజలు పోటెత్తారు. ఆ జనసందోహంతో తముక్కమ్ మైదానం ఎర్రసంద్రంగా మారింది. అక్కడ ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి నాయకులు, కార్యకర్తలు నివాళు లర్పిస్తూ...'ఇంక్విలాబ్ జిందాబాద్.. జోహార్ సీతారాం ఏచూరి.. సీపీఐ(ఎం) జిందాబాద్...' అంటూ పెద్దపెట్టున నినాదాలిచ్చారు. అక్కడి అమరవీరుల జ్యోతికి వారు 'రెడ్ సెల్యూట్' చేసి, 'మీ త్యాగాల బాటలోనే మేం నడుస్తాం...' అంటూ ప్రతినబూనారు. అదే సమయంలో తమిళనాడులో ప్రసిద్ధిగాంచిన 'షేక్ చిన్న మౌలానా' బృంద సభ్యులు షేక్ మస్తాన్ నేతృత్వంలో నిర్వహించిన నాదస్వర కచేరి కామ్రేడ్లను విపరీతంగా ఆకట్టుకుంది. అక్కడి ప్రముఖ దేవస్థానం శ్రీరంగం ఆస్థాన విద్వాంసులైన ఈ బృంద సభ్యులు ఏకబిగిన 45 నిమిషాలపాటు వాయించిన నాదస్వరం అదరహో అనిపించింది. దీంతోపాటు తమిళనాడులోని కొన్ని దళిత, గిరిజన తెగల వారికి ప్రత్యేకమైన 'పాప్పమ్ పాడి పెరియా మేళమ్...'అనే డప్పుల నృత్యం ఆద్యంతం ఆకట్టుకోవటమేగాక అబ్బురపరిచింది. ఆగకుండా గంటపాటు కొనసాగిన ఈ నృత్యం... సభికులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. మహాసభ కొలువుదీరిన కొడియేరి బాలకృష్ణన్ ఆడిటోరియం ముందు భాగంలో ఉంచిన 'కార్ల్ మార్క్స్' మైనపు బొమ్మ 'సెల్ఫీ పాయింట్'గా మారి అగ్రనేతల నుంచి సాధారణ కార్యకర్తల వరకూ అందర్నీ ఆకర్షించింది.

ఈ కోలాహలంతో కూడిన ఉత్సాహపూరిత వాతావరణంలో వెణ్మణి అమరవీరుల స్మారకార్థం అక్కడి నుంచి తెచ్చిన అరుణ పతాకాన్ని సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు యూ.వాసుకి అందుకున్నారు. ఆమె ఆ పతాకాన్ని పార్టీ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మెన్ ఏకే పద్మనాభన్‌కు అందజేశారు. అనంతరం సీపీఐ (ఎం) సీనియర్ నేత బిమన్ బసు ఆ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అగ్రనేతలు ప్రకాశ్‌కరత్, మాణిక్ సర్కార్, పినరయి విజయన్, బృందా కరత్, బీవీ రాఘవులుతోపాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రతినిధులందరూ అమరవీరుల స్థూపానికి నివాళు లర్పిస్తూ మహాసభ ప్రాంగణానికి చేరుకున్నారు.



ఐక్యతతో ప్రతిఘటన

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

సీతారాంఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి

అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యతతో ప్రతిఘటించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. మదురైలో ప్రారంభమైన సీపీఐ(ఎం) అఖిలభారత 24వ మహాసభ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన సౌహార్ద్ర సందేశంలో సాంప్రదాయకంగా చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతంచేయాలని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో మతతత్వ విధానాలను అమలు చేస్తోందని చెప్పారు. అదే సమయంలో కార్పొరేట్లకు దేశ ప్రజల సంపదను దోచిపెడుతోందన్నారు. ఫలితంగా ఒక్కశాతం ప్రజల వద్ద కనీవిని ఎరగని విధంగా సంపద పోగుపడుతోందని, సామాన్యులు తీవ్ర దోపిడీకి గురవతున్నారని చెప్పారు. మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని చేస్తున్నదాడులు కూడా పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విధానాలను బలంగా ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత వామపక్షలపై ఉందన్నారు. 'జై భీమ్, లాల్ సలామ్, ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నవి ఇక ఏమాత్రం నినాదాలు కావని, అవి జాతి జీవనవిధానం కావాల్సిఉందని చెప్పారు. ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తున్న మోడీ పాలనపై సంఘటిత పోరాటానికి ఇదే కీలక సమయమని, రాబోయే రోజుల్లోఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని చెప్పారు.

ఆదివాసీ పరిరక్షణకు ఉద్యమించాలి : మనోజ్ భట్టాచార్య

నయా ఫాసిస్టు, నయా ఉదారవాద విధానాలపై పోరాటాలు చేయడంతో పాటు ఆదివాసీల పరిరక్షణ కోసం కూడా పెద్దఎత్తున ఉద్యమించాల్సిఉందని ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అన్నారు. గడ్చిరోలి, బస్తర్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చోటుచేసుకుంటున్న ఎన్‌కౌంటర్లను ఆయన ప్రస్తావించారు. మైనింగ్ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం అమాయక గిరిజనులపై హింసాకాండకు పాల్పడుతున్నారని చెప్పారు.

లౌకికతత్వ పరిరక్షణే కీలకం : దీపాంకర్ భట్టాచార్య

దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో లౌకిక తత్వ పరిరక్షణ అత్యంత కీలకమైన అంశమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. సౌహార్ద్ర సందేశంలో భాగంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలను, దళితులను లక్ష్యంగా చేసుకుని హిందుత్వ శక్తులు చెలరేగుతున్నాయని చెప్పారు. మావోయిస్టుల నిర్మూలన పేరుతో నరేంద్రమోడీ ప్రభుత్వం ఆదివాసీలను లక్ష్యంగా చేసుకుంటోం దని, వందలాది మంది ప్రాణాలు తీస్తోందని చెప్పారు. మావోయి స్టులను వందశాతం నిర్మూలి స్తామని హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారని, ఇది మావోయిస్టుల ముసగులో ఆదివాసీలపై దాడి చేయడమేనన్నారు. వాస్తవానికి మోడీ ప్రభుత్వ లక్ష్యం అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమేనని చెప్పారు. ఈ అమానుష హింసాకాండకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

యువతను ఆకట్టుకోవాలి: జి. దేవరాజన్

యువతను అభ్యుదయ భావాల వైపు ఆకర్షించడంలో వామపక్షాలు ఆశించిన ఫలితాలు సాధించడం లేదనిఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జనరల్ సెక్రెటరీ జి. దేవరాజన్ అన్నారు. ఈ లోపాన్ని సరిదిద్దుకోవాలని, యువతను ఆకట్టుకుని ఉద్యమాలను ఉధృతం చేయాలని చెప్పారు. దీనికోసం సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నిరుద్యోగం, అధికధరలు, మతోన్మాదం తదితర సమస్యలను ఆయన ప్రస్తావించారు.

వెణ్మనీ నుంచి ఎందుకు?

సీపీఐ(ఎం) 24వ అఖిలభారత మహాసభ ప్రారంభానికి సూచికగా ఎగురవేసిన పోరాటపతాకాన్ని నాగపట్నంకు సమీపంలో ఉండే వెణ్మనీ అనే చిన్న గ్రామం నుంచి తీసుకువచ్చారు. స్థానిక ప్రజానీకం అత్యంత పోరాట స్ఫూర్తితో ఈ జాతాని నిర్వహించి పోరాట పతాకాన్ని బుధవారం ఉదయం మహాసభ ప్రాంగణం వద్దకు తీసుకువచ్చింది. ప్రాంగణం వద్ద కేంద్రకమిటీ సభ్యురాలు వాసుకి ఈ పతాకాన్ని స్వీకరించి సీనియర్ నేత బిమన్ బసుకు అందచేశారు. ఆ పతాకాన్ని ఆ తరువాతే ఆయన ఆవిష్కరించారు. అయితే, వెణ్మనీకి ఆ ప్రత్యేకత ఏమిటి? అక్కడి నుంచే పోరాట పతాకాన్ని ఎందుకు తీసుకువచ్చారు.ఈ ప్రశ్నలకు సమాధానం కోసం కొన్ని దశాబ్దాల వెనక్కివెళ్ళాలి. అది 1968వ సంవత్సరం. ఈ గ్రామంలోని దళిత కుటుంబాలు తరతతరాలుగా స్థానిక భూస్వాముల వద్ద పనిచేసేవి. వారు నామమాత్రపు జీతపు రాళ్ళతో సరిపెట్టేవారు. ఆ నికృష్ట బతుకులుభరించలేక తమ వేతనాలను పెంచాలని వారు కోరారు. అంతే. ఆగ్రహించిన అగ్రకుల భూస్వామ్య పెత్తందారులు అమానుషకాండకు తెగబడ్డారు. ఆ ఏడాది డిసెంబర్ 25వ తేదిన 44 మంది దళిత వ్యవసాయ కార్మికులకు ఒక గుడిసెలో నిర్బంధించి నిప్పు పెట్టారు. గోపాల కృష్ణనాయుడు అనే అగ్రకుల భూస్వామి చేసిన ఈ దురాగతంలో ఆ 44 మంది ప్రాణాలు విడిచారు. ఈ అమానుష కాండపై తమిళనాడు భగ్గుమంది. కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో పేదలు సంఘటితమయ్యారు. సీపీఐ(ఎం) ఆ పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్ళింది. ప్రతి ఏడాది అదే తేదిన ఆ గ్రామంలో ఎర్రజెండాలతో వేలాది మంది ప్రదర్శన నిర్వహిస్తారు. పోరాటానికి, దళిత, వ్యవసాయ కార్మిక కుటుంబాల చైతన్యానికి నిదర్శనంగా నిలిచిన వెణ్మణీ గ్రామం నుండే మహాసభకు పోరాట పతాకాన్ని తీసుకురావాలని సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ పిలుపునకు స్పందించిన ఆ గ్రామస్తులు ఎర్రజెకండా జాతాను ఘనంగా నిర్వహించి, మహాసభ ప్రాంగణానికి తీసుకువచ్చారు.

సైద్ధాంతిక యోధుడు..

సెక్యులర్ పార్టీల మధ్య విశాల ఐక్యతకు తోడ్పడ్డారు : సీతారాం ఏచూరికి సీపీఐ (ఎం) అఖిల భారత మహాసభ ఘన నివాళి

కొడియేరి బాలకృష్ణన్, బుద్ధదేవ్ భట్టాచార్య, ఎన్.శంకరయ్య తదితరుల మరణం పట్ల సంతాపం



అమరులకు మహాసభ శ్రద్ధాంజలి

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

సోవియట్ యూనియన్ పతనం తర్వాత మార్క్సిజాన్ని లోతుగా అధ్యయనం చేసిన సీతారాం ఏచూరి... సీపీఐ (ఎం)ను సైద్ధాంతికంగా, రాజకీయంగా బలోపేతం చేయటంలోను, ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సూత్రీకరణలు చేయటంలోనూ కీలక పాత్ర పోషించారని సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ స్మరించుకుంది. గతేడాది సెప్టెంబరు 12న కన్నుమూసిన పార్టీ ప్రధాన కార్యదర్శి ఏచూరి...విద్యార్థి నాయకుడి నుంచి మొదలుకుని అఖిల భారత ప్రధాన కార్యదర్శి వరకూ పార్టీకి, దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంది. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొంటూ సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ బుధవారం ప్రారంభమైన మహాసభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలం వైపు ఆకర్షితులైన ఏచూరి...దేశంలోని కమ్యూనిస్టు అగ్రనేతల్లో ఒకరిగా నిలిచారని ఆమె కొనియాడారు. ఐదు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఆయన తొలుత విద్యార్థి నాయకుడిగా దేశంలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా, భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) అధ్యక్షుడిగా దేశంలో అభ్యుదయ విద్యార్థి రాజకీయాలకు బీజాలు వేశారని వివరించారు. 1975లో సీపీఐ (ఎం)లో చేరిన సీతారాం...1985లో కేంద్ర కమిటీకి, 1989లో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారని పేర్కొన్నారు. 1992 నుంచి ఆయన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగారని తెలిపారు. ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం, అక్కడి నాయకత్వంలో 30 ఏండ్లకు పైగా కొనసాగారని చెప్పారు. హిందూత్వ భావజాలంపైనా, ఆరెస్సెస్‌పైనా సునిశిత విమర్శలు చేసిన ఆయన... వాటి దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టారని తెలిపారు. లౌకిక శక్తుల మధ్య విశాల ఐక్యతను తీసుకురావటంలోనూ, తద్వారా ఇండియా బ్లాక్ రూపకల్పన లోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యుడిగా, పీపుల్స్ డెమోక్రసీ సంపాదకుడిగా ఆయన సీపీఐ (ఎం)కు ఎనలేని సేవలందించారని బృందా కరత్ నివాళులర్పించారు. సీతారాం ఏచూరి మరణం దేశంలో కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని ఆమె పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల మహాసభ తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చింది.

ఏచూరితోపాటు సీపీఐ (ఎం) మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు కొడియేరి బాలకృష్ణన్, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మాజీ సీనియర్ నేత ఎన్.శంకరయ్య తదితరుల మరణం పట్ల మహాసభ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది.

సంతాప సూచికగా ప్రతినిధులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. వీరితోపాటు కేంద్ర కమిటీ సభ్యులు కెఎమ్ తివారీ, కేంద్ర కమిటీ మాజీ సభ్యులు బాసుదేవ్ ఆచార్య ఎమ్ఎమ్ లారెన్స్, శివాజీ పట్నాయక్, కనయ్ బెనర్జీ, కుమార్ శిరాల్కర్, మదన్ ఘోష్, మృదుల్ దే, సునీత్ చోప్రా తదితరుల మరణం పట్ల మహాసభ సంతాపాన్ని ప్రకటించింది.


అబ్బురపరిచిన కళాకారుల నృత్య ప్రదర్శన

పలు కమిటీల ఏర్పాటు

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

సీపీఐ(ఎం) అఖిలభారత 24వ మహాసభ నిర్వహణలో భాగంగా తొలిరోజైన బుధవారం నాడు పలు కమిటీలు ఏర్పాటయ్యాయి. మహాసభకు హాజరైన ప్రతినిధులు ఈ కమిటీలను ఎన్నుకున్నారు. మహాసభ అధ్యక్షవర్గంగా మాణిక్‌సర్కార్ (కన్వీనర్), ఎంఎ గఫూర్, విక్రమ్‌సింగ్, పి.దినేషన్, బాలభారతి, మీనాక్షి ముఖర్జీ, వినోద్ నికోలే వ్యవహరిస్తారు.పోలిట్ బ్యూరో స్టీరింగ్ కమిటీగా బాధ్యతలలు నిర్వహిస్తుంది.

తీర్మానాల కమిటీ..

తీర్మానాల కమిటీకి కన్వీనర్‌గా అశోక్ ధావలే వ్యవహరిస్తారు. పి.రాజీవ్, మరియం థావలే,విజూ కృష్ణన్ సభ్యులుగా స్టీరింగ్ కమిటీ సభ్యులు.

అర్హతల కమిటీ...

అర్హతల కమిటీ కన్వీనర్‌గా మురళీధరన్ వ్యవహరిస్తారు.సిఎస్ సుజాత ,సమీక్ లహిరి, టి.జ్యోతి ఈ కమిటీకి సభ్యులుగా మహాసభ ఎన్నుకుంది.

మినిట్స్ కమిటీ...

మినిట్స్ కమిటీ కన్వీనర్‌గా కె.ఎస్ ఉమేష్ వ్యవహరిస్తారు. ప్రచి హతివ్లేకర్, పివి అనియాన్, మయూఖ్ బిశ్వాస్, ఎం. అనిల్‌కుమార్, ఆదర్శలు సభ్యులుగా ఎన్నికయ్యారు.




అమరులకు అగ్రనేతల నివాళి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



ముగిసిన టెన్త్ ప్రధాన పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి ప్రధాన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. గతనెల 21న ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. గురువారం ఓఎస్-ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్), ఒకేషనల్ కోర్సు (థియరీ), శుక్రవారం శుక్రవారాల్లో ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. ఆ పరీక్షలకు తక్కువ మంది విద్యార్థులు హాజరవుతారని అధికారులు వివరించారు.

1,461 మంది గైర్హాజరు

పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం సోషల్ స్టడీస్ పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,97,712 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేశారనీ, 4,96,470 (99.75 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 1,242 (0.25 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థులు 648 మంది దరఖాస్తు చేశారనీ, 429 మంది పరీక్ష రాశారని తెలిపారు. 219 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులు కలిపి 1,461 మంది పరీక్షకు హాజరు కాలేదని వివరించారు. రాష్ట్రంలో ఒక్క విద్యార్థిపై కూడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు. ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.

42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

కాంగ్రెస్ చేతగాని తనాన్ని కేంద్రంపై రుద్దే యత్నం : కేంద్ర మంత్రి బండి సంజయ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ చేతగానితనాన్ని కేంద్రంపై రుద్ది తప్పించుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని మోడీ ప్రభుత్వాన్ని అడిగి కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిందా? మతపర రిజర్వేషన్లకు మోడీ సర్కారు వ్యతిరేకమని తెలియదా? ముస్లింలను బీసీ జాబితాలో ఎందుకు చేర్చారు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 56 శాతమున్న బీసీలను 46 శాతానికి తగ్గించి మోసం చేసింది కాంగ్రెస్ అని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లలో ముస్లింలే 10 శాతం లబ్ది పొందుతారని ఎత్తిచూపారు. ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయనీ, బీసీలకు అదనంగా దక్కేది ఐదు శాతమేనా? అని ప్రశ్నించారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తుంటే బీసీ సంఘాలు ఎందుకు నోరెత్తడం లేదని అడిగారు. నిలదీయాల్సిందిపోయి కాంగ్రెస్‌ను సంకనేసుకుని ఢిల్లీలో ధర్నా పేరుతో డ్రామాలాడుతారా? అని నిలదీశారు. బీసీలతో పాటు తెలంగాణ సమాజమంతా కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

త్వరలో ఇంటర్ అడ్మిషన్స్ నోటిఫికేషన్

డాక్టర్ వీ.ఎస్.అలుగు వర్షిణి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే విద్యా సంవత్సరం 2025-26లో ఇంటర్మీడియట్ (సీఓఇ, నాన్ -సీఓఇ) అడ్మిషన్ల కోసం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శి డాక్టర్ వీ.ఎస్.అలుగు వర్షిణి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ తదితర సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇంటర్ అడ్మిషన్లను పదవ తరగతిలో వచ్చిన మార్కులు, ప్రతిభ ఆధారంగా తీసుకోనున్నట్టు చెప్పారు. ఆదాయ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా 2025 జనవరి ఒకటి తర్వాత జారీ చేసి ఉండాలని సూచించారు.

గాజాలో భూతల దాడులను విస్తరిస్తాం

ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటన • ఇప్పటికే 17శాతాన్ని స్వాధీనం చేసుకున్నారంటున్న హక్కుల గ్రూపులు • మెడికల్ క్లినిక్‌పై దాడిలో 22మందితో సహా నేటి దాడుల్లో 57మంది మృతి





గాజా : గాజాలో భూతల దాడులను విస్తరిస్తున్నామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ప్రకటించారు. బఫర్ జోన్‌లకు కలిపేందుకు పెద్ద మొత్తంలో భూ భాగాన్ని స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా, బుధవారం తెల్లవారు జాము నుండి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 57మంది మరణించారు. జాబాలియా లోని యుఎన్ఆర్‌డబ్ల్యుఎ నిర్వహిస్తున్న మెడికల్ క్లినిక్‌పై జరిగిన దాడిలో 22మంది మరణించారు. వీరిలో మహిళలు, చిన్నారులే ఎక్కువగా వున్నారని స్థానిక అధికారులు తెలిపారు. అక్కడ పరిస్థితి చాలా భీతావహంగా వుందని స్థానికులు తెలిపారు. ఛిద్రమైన శరీరాలు, ముక్కలుగా పడిన అవయవాలు ఆ ప్రాంతమంతా పడి వున్నాయని, ఊహకు అందని రీతిలో ఆ దాడి జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సెంట్రల్ గాజాలోని డేర్ అల్ బాలాహ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని జరిపిన వైమానిక దాడుల్లో అనేకమంది పాలస్తీనియన్లు మరణించారని గాజా హోంశాఖ వర్గాలు తెలిపాయి. గత నెల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినప్పటి నుండి ఇప్పటివరకు 1100మందికి పైగా మరణించారు. గత 31 రోజులుగా గాజాకు నిత్యావసరాల సరఫరా నిలిచిపోయిన ఫలితంగా గాజాలోని బేకరీలు మూతపడ్డాయి. వీటిలో ప్రపంచ ఆహార కార్యక్రమం నిర్వహిస్తున్న బేకరీలే 25 వున్నాయి. ఈ చర్యల వల్ల పాలస్తీనియన్లు అందరూ ఉమ్మడిగా శిక్షను అనుభవించాల్సి వస్తోందని డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ వ్యాఖ్యానించింది. ఇప్పటికి నెల రోజులుగా ఒక్క వాణిజ్య ట్రక్కు కూడా లోపలకు రాలేదని తెలిపింది. గాజాలోని పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలను బలవంతంగా ఖాళీ చేయిస్తున్న నేపథ్యంలో ఇంకా దాడులను విస్తరిస్తామని, భూభాగాన్ని స్వాధీనం చేసుకుంటామని ఆర్మీ ప్రకటనలు చేస్తోంది. ఇజ్రాయిల్ హక్కుల గ్రూపు గిషా డేటా ప్రకారం, మొత్తం ఏరియాలో ఇప్పటికే 17శాతాన్ని స్వాధీనం చేసుకున్నారు. రఫా, ఖాన్ యూనిస్ నగరాలను ఖాళీ చేసి అల్ మావసి వైపు తరలిపోవాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వాయుసేన గ్రీన్ సిగ్నల్



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వాయుసేన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకు ముందు మామునూర్ ఎయిర్‌పోర్టుకు అనుమతులు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు భారత ఎయిర్ ఫోర్స్ నుంచి అనుమతులు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆరు నెలల స్వల్ప వ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు సాధించడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌర విమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు వాయుసేన అధికారులు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిపారు. అక్కడ భవిష్యత్తులో వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు లేఖలో తెలిపారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వానికి పౌర విమాన సేవలను ప్రారంభించేం దుకు కావాల్సిన అనుమతులు మంజూరు చేస్తున్నట్టు వాయుసేన అధికారులు లేఖ ద్వారా తెలిపినట్టు ఆయన వివరించారు.

ఈ విమానాశ్రయాన్ని పౌర విమానయానానికీ, ఎయిర్‌ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణం గా ఒక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వే పునర్నిర్మాణం చేయడం, పౌర టెర్మినల్ ఏర్పాటు, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ (విమానాలు నిల్పోవడానికి, మలుపులు తిరగడానికీ, ఇతర విమానయాన కార్యకలాపాలకు ఉపయోగించే నిర్దిష్ట ప్రాంతం) వంటి ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి పనులు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఇందుకు అవసరమైన భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు సమకూర్చుకోవాలని వాయుసేన అధికారులు లేఖలో సూచించినట్టు మంత్రి తెలియజేశారు.

ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన అన్ని అనుమతులు పొందేందుకు ఏఏఐ డిటెయిల్డ్ ప్రపోజల్స్‌ను భారత వాయుసేనకు సమర్పించాలని కోరిందని చెప్పారు. అందుకు సంబంధించిన తదుపరి కార్యాచరణను అధికారులతో సమీక్షిస్తున్నామనీ, అతి త్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను రూపొందించి కేంద్రానికి, సంబంధిత విభాగాలకు సమర్పిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల అనుమతుల మంజూరులో సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు, రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల ఏర్పాటుకు అండగా నిలబడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై రేపు టీశాట్ ప్రత్యేక కార్యక్రమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పదో తరగతి పరీక్షలు పూర్తయిన సందర్భంగా భవిష్యత్తులో విద్యార్థులు చదివే కోర్సులకు సంబంధించిన సమాచారాన్ని అందించడానికి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.10 గంటల వరకు టీశాట్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డితోపాటు కోర్సుల వివరాలు తెలిపే విషయ నిపుణులు పాల్గొంటారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు తప్పకుండా టీశాట్ ద్వారా నిర్వహించే కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలనీ, ప్రతి ఒక్కరూ వీక్షించేలా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు చూడాలని కోరారు. విద్యార్థులు చేరాలనుకునే కోర్సులు, కాలేజీలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు వంటి అంశాలకు సంబంధించిన వివరాలను నేరుగా అడిగి సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

వేసవి సెలవుల్లో పాలిటెక్నిక్, టీజీఆర్‌జేసీ, వ్యవసాయ డిప్లొమా వంటి అనేక కోర్సులకు దరఖాస్తు చేయడం, ప్రవేశ పరీక్షలను రాయడం, ప్రవేశాలను పొందడం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల కోర్సుల ఎంపిక వంటి అంశాల పట్ల మార్గదర్శనం కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానల్ వంటి సౌకర్యాలను కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చూడాలని సూచించారు.

రేవంత్‌రెడ్డినే అసలైన బీసీ ద్రోహి

బీసీ రిజర్వేషన్లు పెంచడం ఇష్టం లేకనే డ్రామాలు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీల రిజర్వేషన్లు పెంచడం ఇష్టం లేకనే రేవంత్‌రెడ్డి డ్రామాలాడుతున్నారనీ, అసలైన బీసీ ద్రోహి ఆయనే అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. రాహుల్‌గాంధీ వెనకాల ఉండి రేవంత్‌రెడ్డితో డ్రామాలు ఆడిస్తున్నాడని ఆరోపించారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర బీసీ సంఘాల ముసుగులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధర్నాకు దిగడం 42 శాతం రిజర్వేషన్ల అమలు నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నెహ్రూ నుంచి నేటి వరకూ బీసీ రిజర్వేషన్లను తొక్కిపెట్టింది కాంగ్రెస్ పార్టీనే అని విమర్శించారు. మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ఆనాటి ప్రధాని వీపీ సింగ్ ప్రయత్నిస్తే పార్లమెంట్‌లో రాజీవ్ గాంధీ అడ్డుకున్నారని తెలిపారు. బీసీల నుంచి ఒత్తిడి రావడంతో గత్యంతరం లేక 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో పాస్ చేశారే తప్ప అమలు చేయాలనే చిత్తశుద్ధి వారికి లేదని విమర్శించారు. బీసీ సంక్షేమం కోసం ఏడాదికి రూ.20,000 కోట్లు చొప్పున ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామన్న హామీ ఏమైంది? ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏది? అని ప్రశ్నించారు.

బీసీ గర్జన కాదు-కాంగ్రెస్ మాయగర్జన : లక్ష్మణ్

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ, బీసీలను మరోసారి మోసం చేయడానికి కుట్ర పన్నుతున్నదనీ, అది బీసీ గర్జన కాదు..కాంగ్రెస్ మాయా గర్జన అని రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎన్నడూ న్యాయం చేయలేదని స్పష్టంగా కనిపిస్తున్నదని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్న నినాదం కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్యపెట్టేందుకు ఆడుతున్న కొత్త నాటకం అని విమర్శించారు. నిజంగా బీసీలకు న్యాయం చేయాలనే తపన కాంగ్రెస్‌కు ఉంటే.. మంత్రివర్గంలో ఇద్దరే బీసీ మంత్రులేంటి? అసెంబ్లీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు ఎందుకు చేయలేదు? అనే ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం బీజేపీ బలమైన పోరాటాలు చేస్తున్నదని తెలిపారు.

తిరుమావళవన్‌తో ప్రొఫెసర్ కోదండరాం భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో దక్షిణాది గళం వినిపించేందుకు కలిసి రావాలని విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, తమిళనాడు ఎంపీ తిరుమావళవన్ టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం కోరారు. బుధవారం ఢిల్లీలో తిరుమావళవన్‌తో కోదండరాం భేటీ అయ్యారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో టీజేఎస్ పార్టీ ఆధ్వర్యంలో "పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ-దక్షిణ భారత భవిష్యత్" పై సదస్సు నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. ఆ సదస్సులో పాల్గొనాలని తిరుమావళవన్‌ను ఆహ్వానించారు.

బిజినెస్

స్విగ్గీకి రూ.158 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదిక స్విగ్గీకి ఆదాయపు పన్ను శాఖ నుంచి పన్ను ఎగవేత నోటీసులను జారీ చేసింది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన డెలివరీ ఫీజుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.158.25 కోట్ల బకాయిలను చెల్లించాల్సిందిగా ఐటీ శాఖ తన నోటీసుల్లో ఆదేశించింది. ఈ విషయమై తమకు ఐటి శాఖ నోటీసులు ఇచ్చిందని స్విగ్గీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి మధ్య కాలంలో డెలివరీ చార్జీలపై జీఎస్టీ బకాయిలు చెల్లించాల్సి ఉందని నోటీసుల్లో సమాచారం ఉందని పేర్కొంది. కాగా దీనిపై అధికారుల వద్ద అప్పీల్‌కు వెళ్లనున్నట్టు స్విగ్గీ పేర్కొంది.

బిలియనీర్లలో 18వ స్థానంలో అంబానీ

అదానీకి 28వ స్థానం • ఫోర్బ్స్ జాబితా వెల్లడి



వాషింగ్టన్ : ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025లో టెస్లా అధినేత ఎలన్ మస్క్ అగ్రస్థానంలో ఉన్నారు. గతేడాదితో పోల్చితే147 బిలియన్ డాలర్ల సంపద పెరిగి 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్‌లో నిలిచారు. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ 216 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉన్నారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానం దక్కించుకున్నారు. భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో 18వ స్థానంలో నిలిచారు. గౌతం అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు. అత్యధిక బిలియనీర్లు కలిగిన దేశంగా అమెరికా టాప్‌లో ఉంది. అక్కడ 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా.. భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో కొత్తగా 288 మంది చేరారని ఫోర్బ్స్ వెల్లడించింది.



విదేశాల్లో లిథియం బ్లాక్‌లపై కోల్ ఇండియా దృష్టి

అర్జెంటీనా, ఆస్ట్రేలియాలతో చర్చలు

సిఐఎల్ సిఎండి పిఎం ప్రసాద్ వెల్లడి

కోల్‌కత్తా : దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) విదేశాల్లోని లిథియం గనులపై దృష్టి పెట్టింది. విద్యుత్ రంగ వాహనాలు, సోలార్, విండ్ పవర్‌లో లిథియం బ్యాటరీలకు డిమాండ్ పెరుగుతోన్న నేపథ్యంలో ఈ రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థ భావిస్తోందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అర్జెంటీనా, ఆస్ట్రేలియాలో లిథియం బ్లాక్‌లను కొనుగోలు చేసేందుకు చర్చలు జరుపుతోన్నామని కోల్ ఇండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) పిఎం ప్రసాద్ తెలిపారు. దీంతో క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు మద్దతివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ఏడాది బొగ్గు కొరత ఉండదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 875 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 11వ ఆసియన్ మైనింగ్ కాంగ్రెస్, ఇంటర్నేషనల్ మైనింగ్ ఎగ్జిబిషన్ కర్టెన్‌రైజర్ సందర్భంగా ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. కోల్ ఇండియా కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్‌కు సహాయంగా టన్ను బొగ్గు ధరను రూ.10 పెంచడానికి ఆమోదించామన్నారు. పెంచిన ధరలు ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ఆస్ట్రేలియాలో లిథియం బ్లాక్‌ను కొనుగోలు చేసేందుకు చురుగ్గా చర్చలు జరుగుతున్నాయన్నారు. అదే విధంగా అర్జెంటినాలోని లిథియం బ్లాక్‌ల స్వాధీనానికి తమ బృందాలు అనేకసార్లు సందర్శించాయన్నారు. ఇరు దేశాల ప్రభుత్వం మధ్య చర్చలు జరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, విండ్ టర్బైన్‌ల కోసం బ్యాటరీల ఉత్పత్తిలో లిథియంను కీలక ఖనిజంగా వాడుతోన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బొగ్గు సరఫరాపై ఆందోళనలపై ప్రసాద్ స్పందిస్తూ.. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి యూనిట్లకు బొగ్గు కొరత ఉండదని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పిట్‌హెడ్‌ల వద్ద భారత బొగ్గు నిల్వలు 106 మిలియన్ టన్నులుగా ఉన్నాయన్నారు. గతేడాది లాగా కొరత ఉండదని స్పష్టం చేశారు. మొత్తం భారత బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా 80 శాతం వాటాను కలిగి ఉంది.

పెన్షన్ల పంపిణీకి సిపిఎఓ ఆమోదం

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : సెంట్రల్ పెన్షన్ అకౌంటింగ్ ఆఫీసు (సీపీఏఓ) తన తరుపున పెన్షన్‌లను పంపిణీ చేయడానికి తమ బ్యాంక్‌కు అవకాశం ఇచ్చిందని ప్రయివేటు రంగంలోని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ వెల్లడించింది. దీంతో ఇకపై అఖిల భారత సర్వీస్ అధికారులు, మాజీ పార్లమెంటు సభ్యులు, హైకోర్టులు, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు, భారత మాజీ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, పౌర మంత్రిత్వ శాఖలు, విభాగాల అధికారులు ఇప్పటి నుంచి తమ బ్యాంకు నుంచి కూడా పెన్షన్లను పొందవచ్చని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. రైల్వేలు, పోస్టల్, టెలికాం, రక్షణ శాఖల మాజీ ఉద్యోగులను ఇందుకు మినహాయించిందని పేర్కొంది. పెన్షనర్లు తమ జీవిత భాగస్వామితో కలిసి ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాను తెరిచి పెన్షన్ పొందవచ్చని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ సౌకర్యాలను ఉపయోగించి తమ పొదుపు ఖాతాలో పెన్షన్ పొందాలని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ కంట్రీ హెడ్, రిటైల్ లయబిలిటీస్ చిన్మయ్ ధోబుల్ పేర్కొన్నారు.

వియట్రిస్‌కు గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు

న్యూఢిల్లీ : వరుసగా నాలుగవ సంవత్సరం తమ సంస్థకు గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు లభించిందని మైలాన్ లేబరేటరీస్ లిమిటెడ్ (వియాట్రిస్ కంపెనీ) తెలిపింది. ఇది ఉద్యోగుల సంక్షేమం, సంస్కృతిని ప్రోత్సహించడంలో తమ సంస్థ నిబద్ధతను సూచిస్తుందని వియాట్రిస్ ఇండియా హెచ్‌ఆర్ హెడ్ అనుపమ్ భట్ పేర్కొన్నారు. వరుసగా నాలుగవ సంవత్సరం గ్రేట్ ప్లేస్ టు వర్క్ ధృవీకరణను పొందడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు.

ఎక్స్‌పీరియన్ హైదరాబాద్ జిఐసి విస్తరణ

హైదరాబాద్ : డేటా, టెక్నాలజీ దిగ్గజం ఎక్స్‌పీరియన్ హైదరాబాద్‌లోని తమ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ని (జిఐసి)ని మరింతగా విస్తరించినట్లు ప్రకటించింది. ఇదివరకంటే రెట్టింపు ఆఫీస్ స్పేస్‌తో 85,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎక్స్‌పీరియన్ (టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఇన్నోవేషన్) సీఈఓ అలెగ్జాండర్ లింట్నర్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ఉత్పత్తులను రూపొందించేందుకు, నిరంతరాయంగా సర్వీసులు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ సెంటర్ ప్రధానంగా ఫిన్‌టెక్, అనలిటిక్స్, మోసాల నివారణ వంటి అంశాలకు సంబంధించిన కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెడుతుందన్నారు.



ఆర్బీఐ నూతన డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా

న్యూఢిల్లీ : ఎన్‌సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ అయిన పూనమ్ గుప్తాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన డిప్యూటీ గవర్నర్‌గా కేంద్రం నియమించింది. మూడేండ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. తాజా నియామకాన్ని నియామకాల క్యాబినెట్ కమిటీ ఆమోదించిందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. డిప్యూటీ గవర్నర్‌గా ఎండీ పాత్రా జనవరిలో పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఆ పదవి ఖాళీగా ఉంది. ఈ నెలాఖరులో ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షకు ముందు పూనమ్ నియమాకం జరగడం విశేషం.

సెన్సెక్స్‌కు 593 పాయింట్ల లాభం

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతుతో బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 592.93 పాయింట్లు లేదా 0.78 శాతం పెరిగి 76,617కు చేరింది. ఇంట్రాడేలో 76,065- 76,680 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 167 పాయింట్లు లేదా 0.72 శాతం లాభపడి 23,332 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 1.61 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.12 శాతం చొప్పున రాణించాయి. సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్అండ్‌టీ షేర్లు నష్టాలు చవి చూశాయి.

ఐపీఓకు జైన్ రీసోర్స్ రీసైక్లింగ్ దరఖాస్తు

హైదరాబాద్ : ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) కోసం సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను (డీఆర్‌హెచ్‌పీ) దాఖలు చేసినట్టు జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ లిమిటెడ్ తెలిపింది. నాన్ ఫెర్రస్ మెటల్ రీసైక్లింగ్ కార్యకలాపాలు సాగిస్తోన్న ఈ దిగ్గజం పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2,000 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.500 కోట్ల వరకు విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటితో పాటు రూ.1,500 కోట్ల వరకు విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించడానికి ప్రతిపాదించింది.

ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు
గ్రూప్ 1లో ర్యాంకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఇటీవల ప్రకటించిన గ్రూప్-జనరల్ ర్యాంకింగ్‌లో ఎస్సీ స్టడీ సర్కిల్‌కు చెందిన పలువురు విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు సాధించారని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 68 మంది విద్యార్థులు 400 కంటె ఎక్కువ మార్కులు సాధించారని తెలిపారు. ఇందులో 40 విద్యార్థులు డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, కమర్షియల్ టాక్స్ అధికారి వంటి ఉద్యోగాలకు ఎంపికయ్యే అవకాశముందని తెలిపారు. ఓవరాల్ ర్యాంకింగ్‌లో బి.వనజ (38), ఆర్. మేరిగోల్డ్ (56), ఎం.రవితేజ (66) పొందారని తెలిపారు. ఎస్సీ స్టడి సర్కిల్‌లో కోచింగ్ తీసుకుని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

హైదరాబాద్ లో ఏప్రిల్ 9 నుంచి 17 వరకు టెక్ ఫెస్ట్

- జేఎన్టీయూహెచ్ జియో-ఇన్ఫర్మాటిక్స్ విద్యార్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పథ్విగ్న-2025, జేఎన్టీయూహెచ్ జియో-ఇన్ఫర్మాటిక్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జేఎన్టీయూహెచ్‌లో ఏప్రిల్ 9 నుంచి 17 వరకు టెక్ ఫెస్ట్ జరగబోతుంది. ఈ మేరకు ఫెస్ట్ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు ఎ.హస్మిత, రిఖియా భట్టాచార్జీ తదితరలు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫెస్ట్‌లో జియో స్పేషియల్ టెక్నాలజీ, ఏఐ, డిజిటల్ మ్యాపింగ్ తదితర అంశాలపై వర్క్‌షాప్‌లుంటాయి. వీటితో పాటు డ్రోన్ ఆచార్య, మ్యాపింగ్ హ్యూమానిటీ వంటి విషయాలపై నూతన సాంకేతికతతో చర్చించనున్నారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్టు వారు తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై సీబీఐ ఎంక్వైరీ వేయాలి

- దీనిపై కేంద్ర మంత్రి అమిత్ షాను కలుస్తాం
- కేంద్రం వెంటనే ఆ నిధులను విడుదల చేయాలి : సీబీసీఎన్‌సీ ట్రస్ట్ ఇండియా చైర్మెన్ ముత్తాబత్తుల రత్నకుమార్ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం ముమ్మాటికి హత్యేనని సీబీ సీఎన్‌సీ ట్రస్ట్ ఇండియా చైర్మెన్ ముత్తాబత్తుల రత్నకుమార్ అన్నారు. ప్రవీణ్ ప్రగడాల అనుమానాస్పద మరణంపై తక్షణమే సీబీఐ ఎంక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాలకు శాంతి చేకూరాలని కాకినాడలో వేలాది మందితో ర్యాలీ తీశామని గుర్తు చేశారు. తప్పని సరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని కోరారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ త్వరగా వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడలో పోలీస్ అధికారులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యకు కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు దేశంలో ఎక్కడా పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. సీబీసీఎన్‌సీలో 1800 చర్చిలు, 240 స్కూళ్లు, 8 హాస్పిటల్స్‌తో ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ఎఫ్‌సీఆర్‌ఏలో ఇప్పటికే దేశ వ్యాప్తంగా వేలాది ట్రస్ట్‌లను మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలనీ, త్వరగా రీ ఓపెన్ చేయాలని కోరారు. 2014 నుంచి ఇప్పటి వరకు రూ.36 వేల లక్షల కోట్లు ఎఫ్‌సీఆర్‌ఏ ప్రాబ్లమ్స్ ఉన్నాయని చెప్పారు. వీటిని కేంద్రం నిలుపుదల చేసిందని తెలిపారు. త్వరగా విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. ఇవి మతాలను మార్చే నిధులు కాదనీ, ఉచిత విద్య, వైద్యాన్ని అందించే నిధులు అని స్పష్టం చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై త్వరలోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి సీబీఐతో విచారణ చేయాలని కోరుతామని స్పష్టం చేశారు.

జీపీవో పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

- పాత వీఆర్‌వో,వీఆర్‌ఏల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 16 వరకు అవకావం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామ పాలనా అధికారుల (జీపీవో) పోస్టులకు (10,954) రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటర్ (సీసీఎల్ఏ) నవీన్ మిట్టల్ సర్క్యులర్ జారీ చేశారు. గత సర్కార్ హయాంలో తొలగించిన వీఆర్‌వో, వీఆర్‌ఏలు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, లేదా వీఆర్‌వో, వీఆర్‌ఏగా ఐదేండ్ల అనుభవమున్న వారు ఇంటర్మీడియట్ చదివినా అర్హులని పేర్కొన్నారు. ఏప్రిల్ 16లోగా సంబంధిత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారి విద్యార్హతలు, స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

విధులు, బాధ్యతలు

1). గ్రామ ఖాతాల నిర్వహణ.
2). వివిధ సర్టిఫికెట్ల జారీ కోసం విచారణలు నిర్వహించడం.
3). ప్రభుత్వ భూములు, సరస్సులు, నీటి వనరుల ఆక్రమణలకు సంబంధించి విచారణ నిర్వహించడం, వాటి రక్షణకు చర్యలు తీసుకోవడం.
4). భూమికి సంబంధించిన వివాదాలను పరిష్కరించడం, భూ సర్వేలో సర్వేయర్‌లకు సహాయం చేయడం.
5). అత్యవసర సేవలకు సంబంధించిన విధులను నిర్వర్తించడం. విపత్తు నిర్వహణ మరియు అందించడానికి
6). సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం లబ్ధిదారులను గుర్తించడం.
7) ఎన్నికల సంబంధిత విధుల్లో సహాయం చేయడం, అధికారుల ప్రోటోకాల్‌ను పర్యవేక్షించడం.
8) గ్రామ, క్లస్టర్. మండల స్థాయిలో అంతర్-విభాగ అధికారులతో సమన్వయం.
9) ప్రభుత్వం, భూపరిపాలన ప్రధాన కమిషనర్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా తహశీల్దార్ అప్పగించిన ఇతర విధులను చేపట్టడం.

2500 కేజీల నార్కోటిక్స్ స్వాధీనం

న్యూఢిల్లీ : పశ్చిమ హిందూ మహాసముద్రంలో గస్తీ నిర్వహిస్తున్న భారత నావికాదళ యుద్ధనౌక ఐఎన్ఎస్ తర్కాష్ ఇటీవల అక్రమంగా రవాణా చేస్తున్న 2500 కేజీలకు పైగా నార్కోటిక్స్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ విషయాన్ని భారత నావికా దళం బుధవారం ప్రకటించింది. మార్చి 31న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో భారత నేవీ పి8ఐ విమానం నుంచి వచ్చిన నిఘా సమాచారంతో అనుమానాస్పద నౌకలో ఐఎన్ఎస్ తర్కాష్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. మెరైన్ కమాండోలతో కూడిన ఒక ప్రత్యేక బోర్డింగ్ బృందం అనుమానిత నౌకలోకి ప్రవేశించి క్షుణ్ణంగా తనిఖీలు చేసి సీల్ చేసి ఉన్న అనేక ప్యాకెట్లను కనుగొంది. వీటిల్లో 2386 కేజీల హషీష్, 121 కిలోల హెరాయిన్‌తో పాటు మరింత మాదకద్రవ్యాలను గుర్తించింది. దీంతో అనుమానాస్పద నౌకను, అందులోని వ్యక్తులను ఐఎన్ఎస్ తర్కాష్ అదుపులోకి తీసుకుంది. దీనిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు భారత నావికా దళం తెలిపింది.కాగా, హిందూ మహాసముద్ర ప్రాంతం (ఐఓఆర్)లోని అంతర్జాతీయ జలాల్లో భద్రత, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఏడాది జనవరి నుంచి ఐఎన్ఎస్ తర్కాష్ విధులను నిర్వహిస్తోంది.

భారతీయ విద్యార్థుల వీసా రద్దుపై వాయిదా తీర్మానం

- చర్చించాలని కాంగ్రెస్ ఎంపీ పిలుపు

ఢిల్లీ : భారతీయ పౌరుల విద్యార్థుల వీసాలను అమెరికా అధికారులు రద్దు చేయడంపై చర్చించాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ బుధవారం లోక్‌సభలో వాయిదా తీర్మాన నోటీసును సమర్పించారు. తన వాయిదా తీర్మాన నోటీసులో అత్యవసర ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశంగా ఆయన అభివర్ణించిన ఈ అంశాన్ని చర్చించడానికి జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం, రోజు షెడ్యూల్ చేయబడిన ఇతర పనులను నిలిపివేయాలని పిలుపునిచ్చారు.

రాములోరిపై చిన్నచూపు

యాదాద్రికి రూ.200 కోట్లు.. వేములవాడకు రూ.100 కోట్లు

- భద్రాచలానికి గత, ప్రస్తుత ప్రభుత్వాల మొండిచేయి
- ఆలయ.. పట్టణ అథారిటీ లేకపోవడంతోనే నిర్లక్ష్యం
- నవమికి సీఎం రేవంత్ రెడ్డి వస్తుండటంతో ఆశలు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భద్రాచలం రామాలయంపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. ఓవైపు కేంద్ర ప్రభుత్వం ఆలయం బాగోగుల గురించి పట్టించుకోవడం లేదు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాద్రిని నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమూ అదే పద్ధతిలో వ్యవహరిస్తోందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2016-17 బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయించింది కానీ ఒక్క పైసా విడుదల చేయలేదు. ఏండ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు మారుతున్నా భద్రాచలం పట్టణం, రామాలయ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. ప్రతి బడ్జెట్‌లో భక్తులు, స్థానికులకు ఎదురుచూపులు తప్పటం లేదు. కాంగ్రెస్ హయాంలోనూ ఈసారి బడ్జెట్‌లో భద్రాచలం రామాలయానికి మొండి 'చేయే' చూపారు. అయితే 6వ తేదీన శ్రీరామనవమికి జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులతో పాటు ఆరుగురు మంత్రులు హాజరవుతున్న దృష్ట్యా ప్రత్యేక నిధుల కేటాయింపులు ఉంటాయనే ఆశ భక్తుల్లో నెలకొంది. ఆరోజు సీఎం వరాల జల్లు కురిపించవచ్చని స్థానికులు ఆశిస్తున్నారు.

భద్రాద్రి అభివృద్ధికి నిధుల లేమి..

ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క గత నెల ప్రవేశపెట్టిన బడ్జెట్లో యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.200 కోట్లు, వేములవాడ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.100 కోట్లు కేటాయించారు. కానీ భద్రాచలానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఇటీవల రూ.34.4 కోట్లతో మాఢ వీధులు భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. శ్రీరామ నవమికి సీఎం రానున్న దృష్ట్యా ఆ రోజున దీని అభివృద్ధికి శంకుస్థాపన చేస్తారు. ఇప్పటికే నిర్వాసితులతో అంగీకార పత్రం రాయించుకున్న నేపథ్యంలో మాడవీధుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తారని భక్తులు ఆశిస్తున్నారు. మొన్నటి బడ్జెట్ లోటును ఈ రకంగానైనా కొంతమేరకు తీర్చుతారని భావిస్తున్నారు. 'భద్రాచలం ఆలయ పట్టణాభివృద్ధి అథారిటీ' ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఒక ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక అథారిటీలను ఏర్పాటు చేస్తుంటాయి. ఖమ్మం నగరాభివృద్ధికి స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని నాలుగేండ్ల క్రితం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఎప్పటి నుంచో ఉంది. భద్రాచలం అభివృద్ధికి కూడా ఈ తరహా ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల జీతభత్యాలకే హుండీ ఆదాయం

యాదాద్రి, వేములవాడల డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ప్రతి బడ్జెట్లో నిధులు కేటాయించి అవసరమైన వసతులు కల్పిస్తోంది. కానీ భద్రాచలం రామాలయానికి, పట్టణాభివృద్ధికి ఎలాంటి అథారిటీ లేదు. భక్త రామదాసు నిర్మించిన ఆలయానికి కొద్దిపాటి మార్పులు, చేర్పులు, సీతారాముల కల్యాణానికి నిర్మించిన మిథిలా స్టేడియం తప్ప ఇతర అభివృద్ధి పనులకు నోచుకోలేదు. కల్యాణానికి ప్రతి ఏడాది భక్తులు పెరుగుతున్నా మిథిలా స్టేడియాన్ని ఆధునాతనంగా పున్ననిర్మించడం లేదు. రామాలయ హుండీ ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, ఉత్సవాల నిర్వహణకే సరిపోతున్నాయి. భక్తుల వసతుల సమస్య అలాగే ఉంటోంది.

భద్రాచలం పట్టణ ప్రగతి అధోగతి..

భద్రాచలం పట్టణ ప్రగతి అధోగతి పాలైందనే చెప్పాలి. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న భద్రాచలంలోని దాదాపు 25 కాలనీల్లో లక్ష వరకు జనాభా ఉంటున్నారు. భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏండ్ల తరబడి ప్రకటనలు ఇచ్చిందే తప్ప రూపాయి కూడా మంజూరు చేయలేదు. వరదల సందర్భంగా రూ.1,000 కోట్లు ప్రకటించినా అందులోనూ పైసా విదల్చలేదు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో స్థల సమస్య తీవ్రమైంది. ఇక్కడ కీలకమైన దేవాదాయ, పంచాయతీరాజ్, రెవెన్యూ, అటవీశాఖ, ఐటీడీఏ, పోలీస్, పర్యాటక విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి పనులు ముందుకెళ్తాయి. ఒక విభాగం పనులు ప్రారంభిస్తే మరో శాఖ అడ్డుకునే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అన్నింటినీ సమన్వయం చేస్తూ ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

భద్రాచలం అభివద్ధికి నిధులు కేటాయించాలి



గోదావరి కరకట్ట ఎత్తు పెంచాలి. ఇరువైపులా కరకట్టని పొడిగించాలి. పోలవరం బ్యాక్ వాటర్‌తో పొంచి ఉన్న ప్రమాదాన్ని రీ సర్వే చేసి నష్టంపై నిర్దిష్ట అంచనాకు రావాలి. బాధితులకు ప్రత్యామ్నాయం చూపించాలి. నష్టపరిహారం అందించాలి. భద్రాచలానికి అనుకుని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను పట్టణంలో కలపాలి. రామాలయం అభివృద్ధితో పాటు భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

- ఏజే రమేష్, సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

హెచ్‌సీయూ విద్యార్థులపై ప్రభుత్వ నిర్బంధం

సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎర్రం నవీన్‌ను కలిసిన హెచ్‌సీయూ ఎస్ఎఫ్ఐ, సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పర్యావరణం, హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూ కేసులు పెట్టి జైల్లోకి తోస్తుందని ఎస్ఎఫ్ఐ, సీపీఐ(ఎం) నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎర్రం నవీన్‌పై అక్రమంగా కేసులు నమోదు చేసిన పోలీసులు సంగారెడ్డిలోని సెంట్రల్ జైల్లో పెట్టారు. జైల్లో ఉన్న నవీన్‌ను ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు శివదుర్గారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు శిరీష, మాజీ ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు బషీర్‌తో పాటు సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా నాయకులు కృష్ణ, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మేకల కృష్ణ తదితరులు బుధవారం ములాఖత్ ద్వారా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు శివదుర్గారావు, శిరీష మాట్లాడుతూ.. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూముల్ని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వేలం పాడటం సరైంది కాదన్నారు. పర్యావరణంతో పాటు జీవ వైవిద్యాన్ని పరిరక్షించే అడవుల్ని నరికివేయడం దారుణమన్నారు. 400 ఎకరాల భూముల్ని అమ్ముకోవడం కోసం పోలీస్ బలగాలతో రాత్రికి రాత్రి చెట్లను నరికేస్తున్నారని, వివిధ రకాల జీవరాసులు, పచ్చటి వృక్షాలను ధ్వంసం చేసే చర్యల్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. భూముల్ని కాపాడాలని కోరుతూ హెచ్‌సీయూ విద్యార్థులు ప్రశాంతంగా నిరసన వ్యక్తం చేస్తే అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. అక్రమంగా పెట్టిన కేసుల్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. భూముల అమ్మకాల్ని ఆపకపోతే పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బంధించినంత మాత్రాన పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

మిగతా సగం జిల్లాల అంగన్‌వాడీలకు ఫిబ్రవరి వేతనమివ్వాలి

- రిటైర్డ్ అయిన వారికి 10 నెలల పారితోషికాలివ్వాలి
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని సగం జిల్లాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, హెల్పర్లకు ఫిబ్రవరి నెల వేతనం ఇప్పటి వరకూ చెల్లించకపోవడం సరిగాదనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన వారికి 2023 సెప్టెంబర్ నుంచి 2024 జూలై ఒకటో తేదీ వరకు పది నెలల(ప్రోత్సహకాలు సీబీఈ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బుధవారం ఈ మేరకు వారు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వేర్వేరుగా లేఖలను రాశారు. 2024 జూలై వరకు కార్యక్రమాలు సీబీఈ తదితర పనుల ఖర్చులన్నీ ఇప్పుడు రిటైర్డ్ అయిన అంగన్‌వాడీ ఉద్యోగులే పెట్టారనీ, పనులన్నీ వారే చేశారని లేఖలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో వారికి అందాల్సిన ప్రోత్సహకాలు సీబీఈలను అంగన్‌వాడీ టీచర్లకు రూ.12 వేలు, హెల్పర్లు, మినీ టీచర్లకు రూ.3 వేలు చెల్లించాలని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులకు ఫిబ్రవరి నెల వేతనాన్ని మార్చి 21న అకౌంట్‌లలో వేసిందనీ, అయితే సగం జిల్లాల అంగన్‌వాడీలకు నేటికీ ఆ వేతనం అందలేదని ప్రస్తావించారు. ఒకే శాఖ కింద పనిచేస్తున్న వారికి ఒకే సారి వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. సగం జిల్లాల వారి వేతనాలను పెండింగ్‌లో పెట్టడం సరిగాదని పేర్కొన్నారు. ఈ రెండు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

పారదర్శకంగా ఇంటర్ మూల్యాంకనం

- సీజీజీ ధృవీకరించిన తర్వాతే ఫలితాలు : ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పారదర్శకంగా మూల్యాంకన ప్రక్రియ జరిగేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. మూల్యాంకన ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా క్యాంపు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. స్క్రూటినైజర్లు, సబ్జెక్టు నిపుణులు మూల్యాంకన శిబిరాల్లో నిశితంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. బుధవారం ఇంటర్ బోర్డు అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. గైర్హాజరైన విద్యార్థులు, మాల్ ప్రాక్టీస్ కేసులు, ఓఎంఆర్ డాటాకు సంబంధించిన బార్‌కోడ్‌లను నిర్వహించడంలో తగు సూచనలను పాటించాలని కోరారు. జోన్ అధికారులు, సూపరింటెండెంట్లు ఈ సమాచారాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. మూల్యాంకన ప్రక్రియ సమయంలోనే నామినల్ రోల్స్‌లో దిద్దుబాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. క్యాంపు అధికారులు బార్‌కోడ్‌లపై యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. మార్కులను ఇవ్వడంలో కచ్చితత్వం, నిర్ధారించడానికి అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, సబ్జెక్టు నిపుణులు సమాధాన పత్రాలను పూర్తిగా సమీక్షించాలని పేర్కొన్నారు. క్యాంపుల్లో పార్ట్-3 ధృవీకరణ పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో డాటాను ఇంటర్ బోర్డు నమోదు చేస్తుందని వివరించారు. డాటాను సంకలనం చేసిన తర్వాత సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఫలితాలను విడుదల చేసే ముందు దాన్ని ధృవీకరిస్తుందని తెలిపారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా అవసరమైన చోట తిరిగి మూల్యాంకనం చేస్తారని వివరించారు. ఈ సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి జయప్రదబాయి, జాయింట్ సెక్రెటరీలు, డిప్యూటీ సెక్రెటరీలు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం

- మార్చి 30 నుంచి జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులు
- ఏప్రిల్ 2న అధికారికంగా వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతనెల 30 నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేటు జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులను ప్రకటించింది. కానీ బుధవారం (ఏప్రిల్ 2న) అధికారికంగా ప్రకటన విడుదల చేయడం గమనార్హం. జూన్ ఒకటి వరకు సెలవులు కొనసాగుతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు ఈ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. జూన్ రెండు నుంచి తరగతులు పున:ప్రారంభమవుతాయని వివరించారు. విద్యార్థులు ఈ సెలవులను స్వీయ అధ్యయనం, నైపుణ్యాల అభివృద్ధి వంటి ప్రయోజనకరమైన పనులకు ఉపయోగించుకోవాలని సూచించారు. సెలవుల సమయంలో అనధికారికంగా తరగతులను నిర్వహించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కచ్చాతీవు ద్వీపాన్ని పునరుద్ధరణపై తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం

- ప్రవేశపెట్టనున్న సీఎం స్టాలిన్

న్యూఢిల్లీ : కచ్చాతీవు ద్వీపాపాన్ని పునరుద్ధరించాలని బుధవారం జరిగే అసెంబ్లీలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. తమిళనాడు మత్స్యకారుల సాంప్రదాయ చేపల వేట హక్కులను కాపాడటానికి, శ్రీలంక నావికాదళ చర్యల కారణంగా వారు ఎదుర్కొంటున్న సవాళ్లను తగ్గించడానికి ఏకైక మార్గం కచ్చాతీవు ద్వీపాన్ని తిరిగి పొందడమే ఏకైక మార్గమని ఈ తీర్మానం హైలెట్ చేస్తుంది.

కాగా, ఈ నేపథ్యంలో ఇండో - శ్రీలంక ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే సమీక్షించి, కచ్చాతీవు ద్వీపాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్టాలిన్ ప్రతిపాదించనున్నారు. ఈ నెలలోనే భారత ప్రధాని మోడీ శ్రీలంకలో పర్యటించనున్నారు. ఈ సంధ్బంగా శ్రీలంకలో నిర్బంధంలో ఉన్న భారత జాలర్లను విడుదల చేయాలని, వారి పడవలను వారికి అప్పగించే విధంగా శ్రీలంక ప్రభుత్వంతో మోడీ చర్చలు జరపాలని కూడా స్టాలిన్ తీర్మానం పిలుపునిచ్చింది. ఈ తీర్మానానికి అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించే అవకాశం ఉంది.

శాంతి చర్చలకు సిద్ధం

- కేంద్రానికి మావోయిస్టుల లేఖ


న్యూఢిల్లీ : భారత్‌ని మావోయిస్ట్ రహిత దేశంగా మార్చాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'యాంటీ మావోయిస్టు ఆపరేషన్'ను దూకుడుగా కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్లలో గత వందరోజుల్లోనే భద్రతా బలగాలు 120 మందకిపైగా మావోయిస్టులను హతమర్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ప్రతిపాదిస్తే.. కాల్పుల విరమణకు సిద్ధమని మావోయిస్ట్ కేంద్ర కమిటీ సంచలన ప్రకటన చేసింది. 'ప్రజల కోసం ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలి. యాంటీ మావోయిస్టు ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి. ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో జరుపుతున్న హత్యాకాండను ఆపాలి' అని మావోయిస్టు కేంద్ర కమిటీ కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొంది. శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల వాతావరణం కల్పించాలి. అప్పుడు మేం వెంటనే కాల్పుల విరమణ పాటిస్తాం" అని మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదలైంది. దీనికి కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

ఆస్పత్రిలో చేరిన పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ

కరాచీ : పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ (69) ఆరోగ్యం క్షీణించడంతో కరాచీలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేరినట్టు బుధవారం స్థానిక మీడియా పేర్కొంది. జ్వరం, ఇన్ఫెక్షన్‌తో కరాచీకి 300 కి.మీ దూరంలో ఉన్న నవాబ్‌షా నుండి జర్దారీని ఆస్పత్రికి తీసుకువచ్చినట్టు తెలిపింది. ఆయనకు వైద్యులు చికిత్సనందిస్తున్నారని వెల్లడించింది. ఆయన సోమవారం (రంజాన్ సందర్భంగా) ఈద్ ప్రార్థనల కోసం నవాబ్‌షాకు వెళ్లారని తెలిపింది. అంతకుముందు ఆదివారం తన పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారని మీడియా నివేదికలు తెలిపాయి. అధ్యక్షుడు జర్దారీ ఆరోగ్యం గురించి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మంగళవారం టెలిఫోన్‌లో విచారించారని ఆ నివేదికలు పేర్కొన్నాయి. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్టు తెలిపింది.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని ..

- సంగారెడ్డి జిల్లా అమీర్‌పూర్‌లో ముగ్గురు పిల్లలను హతమార్చిన తల్లి
- పోలీసుల అదుపులో హంతకురాలు రజిత, ప్రియుడు సూరు శివ కుమార్ : వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



నవతెలంగాణ-సంగారెడ్డి

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని తన ముగ్గురు పిల్లల్ని ఊపిరాడకుండా చేసి చంపిన కన్న తల్లిని, ఆమె ప్రియుడు సూరు శివకుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి గ్రామానికి చెందిన రజిత అలియాస్ లావణ్యకు 2013లో తనకన్నా 20ఏండ్లు పెద్ద వాడైన అవురిచింతల చెన్నయ్యతో వివాహమయింది. వీరికి ముగ్గురు పిల్లలు.. సాయి కృష్ణ (12) మధుప్రియ (10), గౌతమ్ (8) ఉన్నారు. భార్యాభర్తలు పిల్లలతో కలిసి బతుకుదెరువుకోసం మూడు సంవత్సరాల క్రితం అమీన్‌పూర్‌కు వచ్చి రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా, రజిత ప్రయివేట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఆరు నెలల క్రితం 10వ తరగతి విద్యార్థులు నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో అప్పటి పదవ తరగతి స్నేహితుడు శివతో రజితకు పరిచయమేర్పడింది. రజిత ప్రతి రోజూ శివతో చాటింగ్, కాల్స్, వీడియో కాల్స్ చేస్తూ గడిపేది. వయస్సులో పెద్దవాడైన చెన్నయ్య అంటే రజితకు ఇష్టం ఉండేది కాదు. దాంతో వారికి తరచూ గొడవలు జరుగుతుండేవి. శివను కలిసినప్పటి నుంచి రజిత జీవితం ఆనందంగా ఉందని, శివకు పెండ్లి కాకపోవడంతో ఎలాగైనా అతన్ని పెండ్లి చేసుకుని జీవితాంతం సుఖంగా ఉండాలని రజిత అనుకున్నది. పెండ్లి చేసుకోమని శివను అడగ్గా, ఒకవేళ రజితకు పెండ్లి కాకపోయి పిల్లలు లేకుండా ఉంటే కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. శివను పెళ్లి చేసుకోవాలంటే పిల్లలను అడ్డు తొలగించుకోవాల్సిందేనని నిర్ణయించుకున్నది. ఈ విషయాన్ని శివకు చెప్పగా ఆ పనిని త్వరగా పూర్తి చేయమని అనడంతో గత నెల 27వ తేది రాత్రి 10.00 గంటలకి ట్యాంకర్ తీసుకొని చెన్నయ్య చందానగర్ వెళ్ళగా అదే మంచి సమయమని భావించి, ముగ్గురు పిల్లలు.. ఒకరి తరువాత ఒకరిని ముక్కు, మూతిపై టవల్ వేసి, చేతితో గట్టిగా అదిమి పట్టుకొని, ఊపిరాడకుండా చేసి చంపేసింది. ఈ విషయాన్ని నిందితురాలు రజిత పోలీసుల ఎదుట అంగీకరించడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, అమీన్‌పూర్ ఇన్స్‌పెక్టర్ నరేష్, పటాన్‌చెరు డీఐ రాజు, ఎస్ఐ సోమేశ్వరి తదితరులు ఉన్నారు.



క్లిక్.. కేఎస్ హరి..

